
అభ్యుదయ




క్రొత్తయుగానికి
సరిక్రొత్త రేడియో

Cossor

కొస్సార్

జగద్విఖ్యాత రాడర్
యంత్ర నిర్మాతలైన
ఎ సి కొస్సార్ లిమిటెడ్
వారిచే
తయారుచేయబడి సరిక్రొత్త
పరిశోధనలను కలిగియున్న
అద్భుతమైన రేడియోలు

5 వాల్వులు
ఎ సి
మోడల్సు
మావద్ద
దొరకును



7 వాల్వులు ఎ సి మోడలు

గుంటూరు, కృష్ణా,
తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖజిల్లాలకు
సోల్ డిస్ట్రిబ్యూటర్లు

బెజవాడ ఎలక్ట్రిక్ కార్పొరేషన్

గవర్నరుపేట, బెజవాడ

ముఖ్యపట్టణములలో అనుభవముగల డీలర్లు ఏజన్సీకై వ్రాయుడు

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సంపుటి ౧ సంచిక ౭

ఏప్రిల్, 1947

★

సంపాదకులు.

చదలవాడ పిచ్చయ్య

కొమర్రాజు వినాయకరావు ప్రయాగ కోదండరామశాస్త్రి

విషయసూచిక

1.	భాషాతత్వవేత్త	ప్రయాగ	3
2.	సంపాదకీయం		8
3.	దేశసౌభాగ్యం	రాజమన్నారు	11
4.	అభ్యుదయ రచయితలసంఘం— నవ్యసాహిత్య పరిషత్తు	డాక్టరు చిలుకూరి	15
6.	పులిపంజా	పురిపండా	17
7	శత్రువా!	సుదర్శన	18
8.	సమీక్ష	అబ్బాస్	19
9.	సాహిత్యం	విశ్వనాథ	26
10	మనుషులుకాదు, మరలు	'మణిమాల'	33
11.	బానిసల కథ	'విజయ్'	38
12.	కావ్యప్రయోజనం	కనకదండి	39
13.	"నేను ఎంతో సుఖజీవి!"	ట్రిగోవ్	46
14.	రేపు మనది!	'మురళి'	50
15.	శబ్ద ప్రపంచం	నారాయణరావు	51
16.	బానిసత్వం	శ్రీకృష్ణదేవరాయలు	57
17.	నరకంకాళం	సంగమేశం	58
18.	కరువొచ్చింది	కొడవటిగంటి	59
19	ఆవేదన	'శిరి'	64
20.	సాహిత్యాభ్యుదయం	నికోలయేవ్	65

ముఖచిత్రం శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు

గౌరవ సంపాదకులు

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ   శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీ పి. వి. రాజమన్నారు   శ్రీ తుమ్మల వెంకటరామయ్య

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

అ భ్యు ద య

ఇది కార్మికులదైనందిన జీవితంలోని కష్టసుఖాలు వ్యక్తం చేయడానికై చేసనప్రయత్నం. స్త్రీపురుషులనె భేదంలేకుండా, పట్టెడన్నం కోసం శ్రమించి రొడ్డురోలర్ని లాగుతున్నారు కూలీలు కొమ్మకు కట్టినగుడ్డ వుయ్యాల్లో గ్రీష్మాతపానికి అలసి నిద్రపోతున్నాడు పసివాడు ఎర్రనిఎంత వెలుగు నీడల్లో కష్టజీవులు బాటలు తీరుస్తున్నారు

రో డ్డు రో ల రు

చిత్రకారుడు

శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి



ఆంధ్రభాషా తత్వవేత్త
శ్రీ కోరాడ రామకృష్ణయ్య

ప్రాక్పశ్చిమ విజ్ఞానాలనూ, సాహితీ సంప్రదాయాలనూ జీర్ణించుకొని తెలుగు సాహిత్యంలో స్వతంత్ర విమర్శాదృష్టిని ప్రవేశపెట్టినవారిలో శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారొకరు.

శ్రీ రామకృష్ణయ్యగారు 1891 లో బందరులో జన్మించారు. పండిత కుటుంబం – ఎప్పుడూ సాహిత్యగోష్ఠులూ, తర్కవితర్కాలూ, వేదఘోషలూ ...

ఒకవైపున వీధిబడిలో చదువు – రెండోవైపున ఇంట్లో పినతండ్రిగారివద్ద కావ్యపాఠం

ఇటు ఇంగ్లీషు —— అటు నాటకపాఠం.

ఇక్కడ కాలేజీ —— అక్కడ అలంకార వ్యాకరణాలు.

ఇలా సాగింది రామకృష్ణయ్యగారి సంస్కృతాంగ్ల విద్యాభ్యాసం

బెంగాల్ విభజనతో 1905 లో వచ్చిన వందేమాతరం ఉద్యమ ప్రభావం ఆయనమీదకూడా పడింది బిపిన్‌చంద్రపాల్ ఉపన్యాసాలు ఆయనలో నిద్రిస్తున్న జాతీయశక్తుల్ని మేల్కొల్పాయి.

కాని, తాను నిత్యమూ కలలుగంటున్న ఏ సనాతనమతాన్నో, ఏ సనాతన హిందూదేశాన్నో పునరుద్ధరించాలని సంకల్పం ఈ దృష్టితో నే రామ కృష్ణయ్యగారు 'వందేమాతరం' బాడ్జీలు పెట్టుకొని, వీధుల్లో లెక్చర్లివ్వడం మొదలుపెట్టారు.

1915 లో బి ఏ పరీక్ష పూర్తయింది. ఉద్యోగం కావాలి ఆ రోజుల్లో ఉద్యోగాలు దొరకడమంటే ఇప్పటంత కష్టం వుండేదికాదు అదీకాక, రెండు భాషల్లో బి ఏ. ప్యాసైనవారు మరెవ్వరూ పోటీపడకపోవడంవల్ల వెంటనే విజయనగరం కాలేజీలో ట్యూటర్‌పని దొరికింది.

ఇక్కడ పని దొరకడమే కాదు; ఆయన చిన్ననాటినుంచీ నేర్చుకున్న అన్ని విషయాలనూ విమర్శాదృష్టితో సమగ్రంగా పరిశీలించడానికి అవకాశం

చిక్కింది దీనికితోడు బి. ఏ. క్లాసుకు భాషాతత్వశాస్త్రం, వ్యాకరణ భాష్యం కొంతా, కొన్ని ఋక్కులూ చెప్పవలసి రావడంతో మరింత పరిశ్రమచేయడం అవసరమైంది.

అదే కాలేజీలో సుబ్బరాయభట్ అనే ఆంగ్లోపన్యాసకుడుండేవాడు. ఆయనకు తమిళ, కర్ణాట భాషల్లోను, భాషాతత్వశాస్త్రంలోను ప్రవేశంవుంది. ఆయన సహాయంతో రామకృష్ణయ్యగారు ద్రావిడ భాషాతత్వాన్ని పరిశీలించ నారంభించారు. 'ద్రావిడ భాషాపద చరిత్రము' అనే శీర్షికతో కళాశాలాపత్రికలో కొన్ని వ్యాసాలు ప్రచురించారు.

అంతకు పూర్వమే, బెంగాల్ జాతీయోద్యమాన్నిగూర్చి, వివేకానంద, జగదీంద్రచంద్రబోసు, రే, టాగూర్ మొదలైన భారత విజ్ఞానవేత్తలనుగూర్చి దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమాన్ని గూర్చి, రామకృష్ణయ్యగారు అనేక పాటలూ పద్యాలూ వ్రాశారు. కాని ఆకవిత్వం అంతటితోనే ఆగిపోయింది.

నిజానికి ఆయన స్వభావమే కవిత్వానికి అనువైంది కాదు. ఏ విషయాన్ని కూడా లలితంగా, లాలింపుగా 'కాంతా సమ్మితం'గా చెప్పడం ఆయనకు అలవాటు లేదు. ప్రతివిషయాన్నీ ఖచితంగా విమర్శించి, విడమర్చి, సూటిగా చెప్పడమే ఆయన స్వభావం. అదే ఆయన ఋజుదృష్టికి నిదర్శనం సనాతన మతాభిమానంతో సత్యానికి దూరంకాకుండా. ఆయన్ను నిలబెట్టగలిగింది ఈఋజుదృష్టే. ఈ ఋజుదృష్టే ఆయన కలానికి పదునునూ, ఆయన వాదానికి బేవనూ కలిగించింది.

ఆయన సనాతన మతాభిమాని సంస్కృతాన్ని దైవభాషగా ఆరాధిస్తాడు. దేశంలోని పండితు లందరూ సంస్కృతం ప్రకృతిఅనీ, దాని వికృతి తెలుగనీ చెబుతున్నారు. కాని, రామకృష్ణయ్యగారి ఋజుదృష్టి సంస్కృత పక్షపాతానికి లోబడలేదు.

ఇలా భాషాతత్వ శాస్త్రంలో కృషి చేస్తూనే రామకృష్ణయ్యగారు 1921 లో ఎం. ఏ. పూర్తిచేశారు.

1924 లో మద్రాసులో అఖిల భారత ప్రాచ్యవిజ్ఞాన మహాసభ జరుగుతున్నది. ప్రత్యేకానుమతిమీద, రామకృష్ణయ్యగారు ఆసభకు తెలుగులో ఒకవ్యాసం వ్రాసి పంపారు. కాని ఆసభలోఉన్న తెలుగువాళ్ళు ఒకరిద్దరికంటెలేరు. అరవ ప్రెసిడెంటుగారు ఐదు నిమిషాల్లో ఇంగ్లీషులో సారాంశం చెప్పమన్నాడు. అంతే; అంతకంటె సైపు లేదట!

'ప్రాచ్య విజ్ఞాన మహాసభలో ఆంధ్ర భాషకూ, ఆంధ్ర సంస్కృతికీ లభించిన స్థానం ఇదేనా? ఆంధ్రభాషా వాఙ్మయాల విశిష్టతనూ, ఆంధ్రజాతి విశిష్టతనూ, ప్రత్యేక పరిశ్రమచేసి, యావద్భారతదేశం గుర్తించేటట్లు చేయాలి!' అనే నిశ్చయానికి ఈమహాసభ దోహదం చేసింది.

భాషా విషయంలోను, వాఙ్మయంలోను తెలుగు భాషకు ప్రత్యేకత ఏమీ లేదా? ఇది కేవలం సంస్కృత జన్యమేనా? అనే జిజ్ఞాస బయలు దేరింది. అప్పటికే భాషా తత్వశాస్త్రంలో ఆయనఎంతో పరిశోధన చేశాడు. తెలుగుకూ సంస్కృతానికీ అలాంటి జన్య జనక భావంలేదని స్పష్టంగా గుర్తించాడు. ఆంధ్రభాషా సాహిత్య తత్వాలూ, సంప్రదాయాలూ వేరు. సంస్కృత భాషా సాహిత్య తత్వాలూ సంప్రదాయాలూవేరు. ఈ రెంటికీ సంబంధంలేదు. సంస్కృత భాషా సాహిత్య తత్వాలకంటె ఆంధ్ర భాషా సాహిత్య తత్వాలు ఇంకా ఎంతో లోతైనవనికూడా ఆయన గమనించాడు.

ఇంతలో మదరాసు విశ్వవిద్యాలయంలో తన కోసమే నన్నట్లు పరిశోధక శాఖ క్రొత్తగా ఏర్పడడమూ, శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి ప్రోద్బలంతో రామకృష్ణయ్యగారు అక్కడ చేరడమూ, సంభవించాయి అక్కడ ఒక దిగులులేదు; ఒక విచారంలేదు .తనభాషాతత్వ పరిశోధనకు కావలసినంత అవకాశం కావలసినన్ని సాధనాలు!

ఈరోజుల్లోనే — ఆంధ్రభాషా సాహిత్యారంభాలను గూర్చిచేసిన పరిశోధనల ఫలితంగా ఆయన ఆంధ్ర భారత కవితా విమర్శనమనే ఉద్గ్రంధాన్ని ప్రచురించారు. ఇందులో తన లక్ష్యాన్ని గురించి ఆయన చెప్పుకున్న మాటలు, ఆయన జీవిత లక్ష్యాన్నే సూచిస్తాయి.

> "ఆంధ్ర భాషా వాఙ్మయముల చరితమును, వాని సక్రమ పరిణామమును అన్వేషించి విమర్శించుటయే ప్రాచ్య పరిశోధనాలయ మందలి ఆంధ్రశాఖ చేయదగిన పని....భారతమే ఈ భాషలో మొదటి ఉద్గ్రంధమగుటచే, తద్భాషా వాఙ్మయ పరిణామమునకిది ఎంత వరకు తోడ్పడినదో తెలిసికొనవలసిన అవశ్యకత కలదు....భారత కవితకు తత్తద్దేశకాల పరిస్థితులతో నెట్టి సంబంధము కలదో, ఇది ఆంధ్రభాషా వాఙ్మయ పరిణామమునకెట్లు తోడ్పడినదో....విమర్శన లింకను బయుటందేరవలసి యున్నవి. గీర్వాణ సారస్వత మహావృక్ష శాఖకు గట్టిన అంటుగా బయలుదేరి విజృంభించిన ఆంధ్ర సారస్వతమునందు ఆంధ్ర జాతీయతాగుణమెంతవరకు నిలిచియున్నదో పరిశీలింప వలసియున్నది ప్రాచీనాంధ్రభాషా స్వరూపమును గుర్తించి, దానికితర ద్రావిడ భాషలతోను, సంస్కృత ప్రాకృతములతోడను గల సంబంధ బాంధవ్యములను నిర్ణయించి, తద్భాషా చరిత్ర నన్వేషించుటయు ఆవశ్యకమే!"

ఈ లక్ష్యంతోనే శ్రీ రామకృష్ణయ్యగారు తన పరిశోధన సంతటినీ వినియోగించారు. సంస్కృత ప్రాకృత సాహిత్య తత్వాలనూ, ద్రావిడభాషా తత్వాలనూ నిశితంగా పరిశీలించారు. ద్రావిడ భాషల విశిష్టతను గుర్తించారు. కాల్డ్వెల్

మొదలైన భాషాతత్వ శాస్త్రవేత్తల ఉత్తమ పంథాననుసరించి, వారు సూత్ర ప్రాయంగా సూచించిన ద్రావిడ భాషాతత్వాన్ని పూర్తిగా పరిశోధించారు. ఆంధ్ర భాషా వాఙ్మయారంభాలను గురించి నిరంతరం చేసిన కృషిఫలితంగానే ఆయన తన ఒక్క రెక్క మీద ఆంధ్రభాషా తత్వశాస్త్రాన్ని నిర్మించగలిగారు. అంతవరకూ సంస్కృత భాషా వ్యామోహంతో సంస్కృతాన్ని మాతృభాషగా చెప్పుకొనే పండితుల పటాటోపాన్ని పటాపంచలు చేశారు. ఆంధ్ర భాషా సాహిత్యాల ప్రత్యేకతను నిరూపిస్తూ, అనేక విమర్శక గ్రంధాలు, వ్యాసాలు వ్రాశారు.

ఒక్క భాషాతత్వశాస్త్రం విషయంలోనే కాదు. సాహిత్య విమర్శలోకూడా ఆయనది ముందడుగే. ఆయన సనాతనమతాభిమానం ఎక్కడా ఆయన విమర్శా దృష్టికి అడ్డురాలేకపోయింది. నిజం చెప్పవలసివస్తే, ఆయనకు ఏ అభిమానమూ లేదు; ఏ మొగమాటమూ లేదు చూడండి:

"సామాన్యంగా జాతీయజీవనము తద్వాఙ్మయమున ప్రతిబింబితంబై యుండునను విషయము నితరభాషాపరిచితిలేని కేవల హైందవ విజ్ఞానధురంధరులగు మనవారు కొందరు పాటింపరేమో కాని, పాశ్చాత్య వాఙ్మయములను, అచ్చటి విమర్శకాభిప్రాయములను పరిశీలించినవారి కెల్లరకును అది వాఙ్మయవిషయమున నొక ముఖ్యతత్వముగ గోచరింపక మానదు.... దేశమున నొక్కొక్క కాలమున గల్గు విప్లవములు జాతీయ జీవనము నెట్లు మార్చుచుండునో, అట్లే భాషావాఙ్మయమునుగూడ మార్పగలిగియుండును, ఒకవేళ మనవారీవిషయము నంతగా గమనింపకున్నను, దేశచరిత్ర రచనావిషయమున ఆదినుండియు తూష్ణీంభావము వహించి, ఎల్లప్పుడును పరమార్థచింతాతత్పరులైన వీరియెడల నిది యెంత ఆశ్చర్య జనకము కాదు."

అని శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు మన సాహిత్యవిమర్శకు పాశ్చాత్య పద్ధతుల ననుసరించవలసిన అవసరాన్ని నొక్కివక్కాణిస్తూ, ఆ పద్ధతులను మన సాహిత్యానికి అన్వయించి 'కాళిదాసుని కళాప్రతిభలు', 'సారస్వత వ్యాసాలు' అనే విమర్శాగ్రంధాలు ప్రచురించారు.

ఆంధ్రభాషాసాహిత్య తత్వాలనుగూర్చి అనేక పరిశోధనలు చేస్తూ, ఆయన 1946 దాకా మద్రాసు విశ్వవిద్యాలయ ప్రాచ్యశాఖాప్రధానాధ్యాపకులుగా పనిచేశారు. ఇప్పుడు తన ఉద్యోగంనుంచి విరమించుకొని తన పరిశోధనల సర్వస్వాన్ని ఆంధ్రదేశానికి అందజేయాలని కంకణంకట్టుకున్నారు

ఆయన ఇంతవరకు ప్రచురించిన గ్రంధాలు: 1. ఆంధ్రభారత కవితా విమర్శనము, 2 కాళిదాసుని కళాప్రతిభలు, 3. సారస్వత వ్యాసములు, 4. భాషో

త్పత్తి క్రమము - భాషాచరిత్రము. 5. Dravidian philology, 6. Sandhi మొ॥ ఇంకా అనేక వ్యాసాలు తెలుగులోను, ఇంగ్లీషులోను.

ఈ విధంగా ప్రాచీన నవీన విజ్ఞానాలను జీర్ణించుకున్న కళావేత్త శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు; స్వతంత్రమైన విమర్శాదృష్టితో ఆంధ్రభాషా సాహిత్య తత్వాలను పరిశోధించి ఆంధ్రజాతికి భాషాతత్వశాస్త్రాన్ని సమర్పించిన తత్వవేత్త; వ్యక్తిగతంగా సనాతన భావాలు వుండికూడా తన రచనల్లో నవీనభావాలను, ఉపయోగించే భాషలో కృత్రిమత్వం ఉండికూడా విషయంలో వాస్తవికతనూ ప్రదర్శించే సత్యాన్వేషకుడు।

ఆయన నిశిత విమర్శాధోరణీ, నిరంతర పరిశ్రమా యువకులకు ఆదర్శాలు। ఆయన పరిశోధనాసర్వస్వం ఆంధ్ర వాఙ్మయానికి పెన్నిధి।

— ప్రయాగ

నాగేశ్వరావు పంతులుగారి నవమ వర్ధంతి

శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు, 'భారతి' మొదలైన పత్రికల ద్వారాను, 'ఆంధ్ర గ్రంధమాల'ద్వారాను, ఆంధ్ర సంస్కృతీ వికాసానికి ఎంతో సేవచేశారు, కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి సహాయంతో 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' వెలువరించారు

ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ, సంస్కృతికీ బహుముఖాలుగా తోడ్పడి, ఆంధ్ర జాతీయతకూ, జాతీయ విజ్ఞానానికీ అనేకవిధాల కృషిచేసిన నాగేశ్వరరావు గారు ఆంధ్రజాతికి చిరస్మరణీయులు

కనుక, శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి నవమ వర్ధంతిని ఏప్రిల్ 11వ తేదీన ఆంధ్రదేశమంతటా అభ్యుదయ రచయితలు, వివిధ సాహితీపరుల, జాతీయాభిమానుల సహకారంతో జయప్రదంగా జరపాలని కోరుతున్నాను.

బెజవాడ, 1–4–47

ఇట్లు,
చదలవాడ పిచ్చయ్య,
కార్యదర్శి,
ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం.

సంపాదకీయం

> "ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభా నివేదిక, తీర్మానాలు పంపుతూ మీరు ఫిబ్రవరి 24న వ్రాసిన లేఖ అందింది. మహాసభలో మీరు సాధించిన మహత్తర విజయానికి సంతోషం. ఈ సంవత్సరం మన ఉద్యమం ఆంధ్రదేశంలో ఇంకా ముందుకు పోతుందని ఆశిస్తున్నాను
>
> సజ్జాద్ జహీర్,
>
> అఖిలభారత అభ్యుదయరచయితలసంఘ కార్యదర్శి.

ఆసియా ప్రజల దాస్యవిముక్తి - అంతర్జాతీయ శాంతికి సోపానం

ఆసియా దేశాల ప్రతినిధులు తమ భవిష్యత్తును నిర్ణయించుకోడానికి ఢిల్లీలో సమావేశమయారు. ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా మనమెలా అభ్యుదయం పొందాలి. మనసంబధ బాంధవ్యాలు స్నేహపూర్వకంగా, ప్రేమానురాగాలతో యెలా అల్లుకుపోవాలి అని చర్చించుకున్నారు. సామ్రాజ్యవాదుల దాస్యంనుంచి మనం విముక్తి పొందనిదే మన అభ్యుదయం అసంభవమని అంచనా వేసుకున్నారు స్వతంత్రం పొందడానికి సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా ఒకరికొకరు సహకారం చేసుకుంటూ పోరాడాలనుకున్నారు. అప్పుడే మనం ఈ చిరదాస్యంనుంచి విముక్తి పొందగలమని సంకల్పించు కున్నారు. ఇది ఆసియాదేశాల ఉజ్వల భవిష్యత్తుకు నాంది

మానవ జాతిలో సగభాగాన్ని మించిన ప్రజలు అమాయకత్వంలో, అజ్ఞానంలో, దరిద్రంలో, దాస్యంలో దరీ దోవాలేక అల్లాడుతూ వచ్చారు ఎందువల్ల? ప్రపంచం ఒకవంక నాగరీకమై విజ్ఞాన వికాసాలు పొందింది. సకల సంపదలపై అధికారం సంపాదించింది. ప్రపంచ ఆర్థిక సంపత్తుపై అధికారం హస్తగతం చేసుకుంది. పెద్దపెద్ద పరిశ్రమలు స్థాపించింది. తమ వస్తువుల అమ్మకంకోసం సమస్త జాతులపై రాజ్యాంగాధికారం గుత్తపుచ్చుకొంది.

ఆసియా ప్రజల ఆర్థికవ్యవస్థ బలహీనమైంది. పురాతనమైంది. నూతన విజ్ఞాన సంపత్తుతో పోటీకి నిలువలేనిది. పాత, కొత్తవిజ్ఞానాల సంఘర్షణలో కూలిపోయింది అందువల్లే ఆసియా ప్రజలు అనేక దురవస్థ లనుభవిస్తున్నారు. అనుక్షణం తమ జీవిత వికాసం కోసం దెబ్బలాడుతున్నారు. వీరు విడివిడిగా యింతకాలంనుంచీ పోరాడారు ఈ యుద్ధానంతరం సామ్రాజ్యవాదుల దాస్యబంధాలను త్రెంచుకొని, బయటపడాలని నూతనానుభవంతో, నూతన చైతన్యంతో నూతన ఆశావెల్లువలతో, జీవన్మరణ పోరాటాన్ని చేస్తూ పురోగమిస్తున్నారు.

ఈ విప్లవ వెల్లువ సామ్రాజ్యవాదుల పునాదుల్ని సహితం పెకల్చివేసేలా వుంది. ఇది చూచి సామ్రాజ్యవాదులు కొత్తప్లానులు వేస్తున్నారు. అన్ని దేశాలకూ స్వతంత్రహక్కులందంటున్నారు. వారివారి స్వతంత్రహక్కులను కాపాడుకునే శక్తి పొందేవరకూ తాము అండగా వుంటామంటున్నారు. కొత్త ఆశలు కల్పించి పాతబంధాలను మరింత బిగువుగా ముడిపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఇది మోసం. మరిఒక దగాకోరుతనం. ఇక ఈ విధానాలు సాగవు. ఈ కల్లబొల్లి మాటలు అతకవు. తెగిన సంబంధాలు ముడిపడవు.

మానవుని పశువుకన్నా హీనంగా చూచే సామ్రాజ్య పరిపాలన అంతమయ్యేదాకా మేల్కొన్న ప్రజలు నిద్రించరు. తరతరాలదాస్యంలో క్రూరంగా హింసింపబడినవారూ, క్రూరహింసలకు వ్యతిరేకంగా పోరాడి అసువుల్ని అర్పించినవారూ, ఉరికంబాలెక్కినవారూ కళ్ళముందు కనుపిస్తున్నారు. బానిసదేశాల భవిష్యత్తు ఆనందదాయకమయ్యేవరకూ పురోగమించండనే వారి సందేశం వినవస్తున్నది. శత్రువులపై ద్వేషాగ్ని మా హృదయాలలో రగుల్కొంటూంది. ఈ ద్వేషం స్వతంత్రజాతులుగా యీ ప్రజలందరూ అభివృద్ధిపొందేవరకూ చల్లారదు.

మా పీడితహృదయాలు యెంతో సానుభూతితో, యెంతో ఆదరంతో, యెంతో ఆప్యాయంగా, యెంతో ఆనందంగా ఒకరికొకరం సామీప్యంగా భావించుకునేలా చేశాయి. గడచిన చరిత్రను జ్ఞప్తికి తెచ్చాయి. సంస్కార సంబంధాల పొలికలిచ్చాయి. అంతలో మా హృదయాల్లో ఆశారేఖలు అల్లుకుపోయాయి. మరచిన సంబంధ బాంధవ్యాలను మననం చేసుకున్నాము. ఒకే హృదయంగా, ఒకే మనస్సుగా, ఒకే ఆత్మగా, ఒకే శరీరంగా ఐపోయాం. ఆసియాప్రజల దాస్య విముక్తే అంతర్జాతీయ శాంతికి అంత్యసోపానంగా భావించాము. ఈ బాధ్యతను నెరవేర్చడానికీ, ఈ కర్తవ్యాన్ని కడవరకూ సాధించడానికీ ఈ అఖిల ఆసియా మహాసభ పునాదిరాయిగా వుంటుందని ఆశిస్తున్నాము. మా ఆశలు ఫలిస్తాయని నమ్ముతున్నాం. అప్పుడే, ఆ నాడే, మనసంస్కృతీ, మనకళలూ - అభ్యుదయం పొందుతాయి. ఉన్నతమైన, వుత్తమమైన విజ్ఞానసంస్కారాలతో అలరారే ఐక్య ఆసియా నిర్మించబడుతుంది.

నవ్య జగత్తును నిర్మిద్దాం

గబ్బిల్లై గూడుకట్టి ముసురుకున్న చీకట్లు పటాపంచలవుతున్నాయి. విజ్ఞానం వెల్లి విరుస్తున్నది. కొత్త జగత్తు జీవం పోసుకుంటున్నది.

ఈ జగత్తులో అరలూ, పొరలూ లేవు. ఇదంతా విశాలమైన ఒకే ఒక

కుటుంబం ఇక్కడ దేశాల సరిహద్దులు భూగోళ శాస్త్రరీత్యా ఏర్పడడంగానీ మత మౌఢ్యాలు ధర్మం దృష్ట్యానిలబడడంగానీ జరగదు

చుట్టూ కట్టుకున్న గోడలు మానవుడి ఆశయ సాఫల్యానికికాక మానవుణ్ణి తోటి మానవుడినుంచి వేరు చెయ్యడానికే తోడ్పడుతున్నాయి. పవిత్రమైన గంగా నదీ తీరంలో నివసిస్తున్నా, సహారా ఎడారిలో నివసిస్తున్నా — ఈనాడు మానవుడు అనుభవిస్తున్నది మాత్రం ఒక్కటే — దరిద్రం, దాస్యం ! ఇందులో వాడు హిందువుడా, మహమ్మదీయుడా — అన్న సమస్య లేనే లేదు

కనుకనే, తన చుట్టూ ముసురుకొని తన దరిద్రాన్నీ దాస్యాన్నీ భద్రంగా కాపాడుతున్న గోడలను బదా బదలు చేస్తున్నాడు మానవుడు ఇలాగే తమ తమ ఆవరణలను ఛేదించుకొని విశాల విశ్వంలో అడుగు పెడుతున్న మానవులందరూ ఒకే ఆశయంకోసం పోరాడుతున్నారు తమ దాస్యం దారిద్ర్యం పోవాలి; స్వాతంత్ర్యం సౌభాగ్యం కావాలి ఈ ఒకే ఒక ఆశయం జగత్తునంతా ఒకే ఒక కుటుంబంగా మార్చి వేసింది

చినవోగిరాలలో మార్చి 20 వ తేదీన జరిగిన యువజన మహాసభ ఈ సత్యాన్నే ఋజువు చేస్తున్నది సోవియట్ యుగోస్లావియా ఫ్రాన్సు, డెన్మార్కు దేశాల యువజన ప్రతినిధులు — ప్రపంచ యువజన సమాఖ్య పక్షాన — భారత దేశానికి వచ్చి తమ సౌభ్రాతృత్వాన్నీ సౌహార్దాన్నీ వెలిబుచ్చారు అనేక స్వాతంత్ర్య పోరాటాలు సాగించిన చైతన్యంతో, భారత యువకులు అంతర్జాతీయ యువజన ప్రతినిధులకు హృదయపూర్వకంగా స్వాగతమిచ్చారు దారిద్ర్యానికీ దాస్యానికీ వ్యతిరేకంగా జరిగే మానవ స్వాతంత్ర్య పోరాటంలో ఒక మహత్తరమైన అంతర్జాతీయ శక్తిగా ఈనాడు ప్రపంచయువజనం నిలబడ్డది.

ఈ సత్యాన్నే 'చినవోగిరాల' మహాసభ ఆంధ్రదేశానికి ప్రదర్శించింది ఇదే ఈ సభ ప్రత్యేకత

★

దేశసౌభాగ్యం

శ్రీ పి. వి. రాజమన్నారు

క్రొత్త సంవత్సరం అనగానే క్రొత్త పంచాంగాలు, క్రొత్త బట్టలు, క్రొత్త తీర్మానాలు, క్రొత్త భావాలు — వీటిమీదికి మనసు పరుగెత్తుతూ వుంటుంది పంచాంగ శ్రవణం అయింది ఇప్పుడే. త్వరగానే మునిమాణిక్యంగారి క్రొత్త తీర్మానాలు వింటారు. ఈ మధ్య కాలంలో దేశ సౌభాగ్యాన్ని గురించి ఏవో కొన్ని క్రొత్త ఆలోచనలు చేస్తాం

ఈరోజు మన తెలుగువాళ్ళ సంవత్సరాది గనుక తెలుగుదేశం గురించే మాట్లాడుతాను శ్రీముఖకాలంలో మనకు సంప్రాప్తిస్తుందనే నమ్మకంతో మనకు రాబోయే ఆంధ్రరాష్ట్రాన్ని గురించే కలలు గంటాను. ఒకవేళ నేను చెప్పేవి కొన్ని గిరీశంగారి కోరికల్లాగ ఉన్నా, మన్నించండి. అతనేమన్నాడో జ్ఞాపకంలేదూ ?

"ఒక సంవత్సరంగాని నాకు దేవుడు దివాన్గిరీ యిస్తే భీమునిపట్నానికి పాల సముద్రం, విశాఖపట్నానికి మంచినీళ్ళ సముద్రం తెస్తాను. యీ ఈస్టర్న్ ఘాట్స్ అంతా పొగాకు అరణ్యం చేస్తాను" అన్నాడు.

దేశ సౌభాగ్యం అంటే సహజంగా సృష్టిదత్తంగా సంక్రమించినటువంటి ప్రకృతి సౌభాగ్యం అయితే ఆంధ్రదేశానికి కావలసినంత ఉంది. కృష్ణా, గోదావరీ, తుంగభద్రవంటి నదీసుందరుల విహారభూమి ఆంధ్రసీమ పాపికొండలు సింహాచలం, మంగళగిరి, తిరుపతి, శ్రీశైలం వంటి పర్వతాలున్నాయి. నల్లమలల ప్రాంతాల్లోవలె దట్టమైన అడవులున్నాయి సముద్రతీరం ఎన్నోవందల మైళ్ళవరకూ ఉంది రేవులున్నాయి విశాఖపట్టణం, కాకినాడ, బందరు మొదలైనవి. కావలసినంత పరిమితి ఉంది. జన సంఖ్యా ఉంది

ఇంకేమి, దేశ సౌభాగ్యానికి తక్కువేమి, అనగలమా ?

దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్.

అన్నాడు కాదూ కవి ! ప్రజా సౌభాగ్యమే దేశ సౌభాగ్యం ఏ దేశంలో ప్రజలు సౌఖ్యంగా సంతోషంగా, సంపత్కరంగా, ఉత్సాహంగా ఆనందంగా వుంటారో, ఆదేశమే సౌభాగ్యవంతమని సార్థకంగా చెప్పవచ్చును మా గంటి బాపినీడుగారు తమ తెలుగు తల్లిలో ఏమి వ్రాశారో వినండి.

'ప్రపంచంలో వున్న చాలా దేశములకంటే మన భారతదేశం చాలాపెద్దది. అయితే ఏమి ? మనకేమి లాభం ? ఎక్కడ చూచినా బీదవాళ్ళు, బిచ్చగాళ్ళు —ఎందుకిలా ఉన్నాం ?'

ఎక్కడో కొందరు కోటీశ్వరులో లక్షాధికార్లో ఉంటే చాలదు అంత

మాత్రంతో దేశ సౌభాగ్యం రాదు. సామాన్య ప్రజాస్థితి బాగుంటేనే దేశం బాగున్నట్టు.

దేశ సౌభాగ్యం సాధనంలో ప్రథమ సమస్య ఆహారసమస్య ఆంధ్ర దేశంలో ఒక్క మానవవ్యక్తి — పురుషుడు గాని స్త్రీగాని, శిశువుగాని పస్తు ఉన్నంతవరకు ఆంధ్రదేశానికి సంపూర్ణసౌభాగ్యం ఇంకా కలగలేదనే అనుకోవలెను ఆకలిబాధతో అన్నమో రామచంద్రా అనే ఆర్తనాదం ఎప్పుడు వినబడదో, అప్పుడే ప్రభుత్వం కృతకృత్యమైనదని చెప్పవచ్చును రోజూ ఒక్కపూట సగం కడుపునిండే తిండికూడా దొరకకుండా శుష్కించే దరిద్రులు లక్షలున్నారు. ఈ పాపం, ఈ దోషం పరిహారం చెయ్యడానికి స్వల్ప సంఖ్యాకులైన ధనవంతుల దాన దయా ధర్మములపైన ఆధారపడితే సరిపోదు పొట్టకూటికోసరం ఒకర్ని దేహీ యని యాచించడంకన్నా హీనమైన కార్యం లేదు.

ఈ సమస్య తృప్తికరంగా విడిపోడానికి రెండు ఉపాయాలున్నవి మొదటిది—వ్యవసాయం చాలారెట్లు ఎక్కువగావాలి. రాయలసీమతో పదకొండు జిల్లాలుగల ఈ విశాల ఆంధ్రదేశంలో సస్యశ్యామలం కావలసిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి.

గలగలా గోదారి కదలి పోతుంటే
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే
బంగారు పంటలే పండుతాయీ.

అని పాడుకొంటే సరిపోతుందా? ఇప్పుడు పండే పంటలు చాలుతాయా. గోదావరి, కృష్ణా, తుంగభద్రవంటి నదుల్లో ప్రవహించే నీరు మనం ఎంత వరకు ఉపయోగించు కొంటున్నాం? ఎంత వృధాగా సముద్రంలో కలసి పోతున్నది! ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది నూటికి తొంభై పాళ్ళు వృధా. మిగతా పదిపాళ్లు కూడా పూర్తిగా ఉపయోగించుకోవడం లేదు గలగలా, బిరబిరా పోతూవుంటే ఊరుకుంటున్నాము ఆ నీరును ఆపుజేసి వినియోగించుకుంటే ఎన్నో వేలఎకరాలు పండించవచ్చు సస్య సమృద్ధి ఉంటుందిప్పుడు దేశం సుభిక్షంగా వుంటుంది బీదవాళ్ళకు కూడా చవుకగా అన్నం దొరుకుతుంది రేషనింగ్ అవసరం వుండదు

రెండవది వ్యవసాయాభివృద్ధితో పాటు పరిశ్రమలుసహా బాగా వర్ధిల్లితేనే గాని, ఆర్థిక సమస్య తెగదు పనిచేయగల ప్రతివానికిని చేయతగ్గపని సులభంగా దొరికి తీరాలి గృహపరిశ్రమలను స్థాపించడం ముఖ్య విషయమే కాని, అదిమాత్రం చాలవు. యంత్ర సాహాయ్యం మీద ఆధారపడే పెద్ద పరిశ్రమలుకూడా అభివృద్ధి చెందాలి.

ఆంధ్రభూమి రత్నగర్భ. మనం కృషిచేస్తే మనకు కావలసిన లోహాలన్నీ ఇస్తుంది. లోపల దాచివుంచింది. కష్టపడితే మనకు కానుకగా ఇవ్వడానికి మనదేశంలో ఎంత ఖనిజసంపద గుప్తంగా వుందో మనం ఇంకా పూర్తిగా తెలుసుకోలేదు మనకు కార్యక్రమం అపరిమితంగా ఉంది బద్ధకం చేస్తే బానిసలుగానే వుంటాం ఎప్పటికీ. మాటలతో కోటలు గట్టలేము. పట్టి

గొప్పలు చెప్పుకుంటే దేశౌన్నత్యం సిద్ధిస్తుందా ?

నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్.

అన్నాడు గురజాడ మహాకవి దేశ సౌభాగ్య వృక్షానికి కావలసినది 'నరుల చెమట.

ఆర్థిక సంపద కలగగానే కడుపునిండా అన్నం దొరుకుతుంది ప్రజలందరికి. ఆ తరవాత కావలసినవి, ఉండనిల్లు, కట్టబట్ట తలదాచుకోడానికి పూరిగుడిసె కూడా లేకుండా క్రింద మన్ను పైన మిన్నుతో కాలక్షేపం చేస్తూవున్న వారెందరున్నారో ఎంచిచూస్తే ఏడుపు రాకమానదు. సిగ్గు కాపాడుకోడానికి, గుడ్డముక్కలేని స్త్రీలు ఎందరున్నారో, ఊహిస్తే తలవంచుకోవలసిందే.

ప్రజా సామాన్యంయొక్క జీవిత విధానం ఉన్నతదశకు వస్తేగాని, దేశానికి సౌభాగ్యం రాదు పుష్టినిచ్చే ఆహారం, శుభ్రమైన వస్త్రం వాస యోగ్యంగా వుండేఇల్లు, వాకిలి, ఇవి ఉండాల ప్రతివ్యక్తికీ

ఆ తరువాత ముఖ్య విషయం — ఆరోగ్యరక్షణ, పోషణ, దేశసౌభాగ్యం, దేశప్రజల ఆరోగ్యం మీద చాలావరకు ఆధారపడి వుంటుంది ఇదియదార్థం రోగగ్రస్తులైనవాళ్లు లక్షలుంటేమాత్రం ఏ కార్యమవుతుంది ? నానాటికీ జాతి క్షీణించిపోతుంది ఆంధ్ర దేశంలో ప్రస్తుతం ప్రజల ఆరోగ్యంచాలా అధమ స్థితిలో ఉందని అంగీకరించక తప్పదు. రాబోయే ఆంధ్రరాష్ట్రంలో ప్రజారోగ్య కార్యక్రమం ప్రభుత్వంవారే నిర్వహించాలి. ఆరోగ్య సౌకర్యాలు, వైద్యసదుపాయాలు ప్రతివాళ్ళకీ ఉచితంగా అందజేయాలి ప్రతి గ్రామంలో డాక్టరు, నర్సు, మందుకొట్టు వుండాలి కాన్పుల కోసరం ప్రత్యేకంగా ఏర్పాట్లు వుండాలి పట్టణ ప్రదేశాల్లో ప్రతి 10,000 మందికి ఒక వైద్యశాలనిర్మించాలి సామాన్య వైద్యశాలలేగాక, క్షయ, కుష్ఠు, ఉన్మత్త సుఖరోగాలకు ప్రత్యేక వైద్యశాలలు అక్కడక్కడా నిర్మించాలి పూర్వం నుంచి మనం అవలంబిస్తూవున్న పద్ధతుల్ని అనాలోచితంగా తోసివేయకుండా పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా మార్పులు చేయడానికి ప్రయత్నించాలి ఇందుకు పరిశోధన లత్యావశ్యకం వైద్యశాస్త్రంలో ప్రతిదినము బయలుపడే కొత్తవిషయాలు, చికిత్స విధానాలు, మందులు, అన్నిటినీతెలుసుకోవడానికి అవకాశాలు కల్పించాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రభుత్వపు విధి అని మరిచిపోకూడదు జీవితంమీద ఆశ, మృత్యువంటేభయం, రోగంవల్లబాధ అందరికీ సమానమే ధనవంతులకూ, దరిద్రులకూ దీక్షతో కంకణం కట్టుకొని ప్రణాళిక తయారుచేసుకొని పనిచేస్తే ఎంతైనా సాధించవచ్చును ప్రజారోగ్య విషయంలో రష్యా సాధించినంత మనం మాత్రం ఎందుకు సాధించకూడదు ?

ఆరోగ్యం దేహానికెలాగో, మనస్సుకూ బుద్ధికీ, విద్య అలాగు ఆరోగ్య సదుపాయాలు ప్రతివ్యక్తికీ ఉచితంగా లభించవలసినట్టే సామాన్య విద్యాభ్యాస అవకాశాలుకూడా ఉచితంగా ప్రతిఒక్క

శ్యకీలభించాలి అంటే ప్రతి పురుషుడు, స్త్రీ బి ఏ. ప్యాసు కావలెననికాదు. విద్యఅంటే అదేకాదు లోకజ్ఞానాన్ని ఇచ్చే శిక్షణే విద్య వ్రాయడం, చదవడం గణితం ప్రజాసామాన్యానికి అవసరం ఏవృత్తి అవలంబించినా ఏఉద్యోగం చేస్తున్నా ఏతరగతికిచెందినా, విద్యలేని ప్రజకు సంస్కారం వుండదు సంస్కారములేనిదే సౌభాగ్యం వుండదు

ఇంతేగాదు, ప్రజాజీవితంలోఆనందం ఉండాలి సౌందర్యం వ్యాపించాలి రాజకీయ, ఆర్థిక, స్వాతంత్ర్యం అభివృద్ధీ తప్పక కావలసినవే. అందరికీ కడుపునిండా కూడూ, కట్టగుడ్డా ఉండనిల్లూ, వైద్యం విద్యా — అన్నీకావలసినవే పాడీ పంటలూ సస్మృద్ధిగా వుండవలసినవే. అయినా యివన్నీ ఉన్నప్పటికీ దేశ సౌభాగ్య సౌధం పూర్తిగా నిర్మించడానికి ఇంకొకటి ఉండలి — సంస్కృతి, సౌందర్యారాధన, సాహిత్యం, సంగీతం, కళలు వికసించాలి. సామ్రాజ్యాయి నశించినా సాహిత్యం, కళాసృష్టి నశించవు వాటికున్న స్థిరత్వం కేవల భౌతిక విషయాలకు ఉండజాలదు.

దేశ సౌభాగ్యానికి అభ్యుదయానికి ఎటువంటి సాహిత్యం అవసరమో నాకు వీలున్నప్పుడల్లా వివరిస్తూనే వున్నాను మానవత్వంతోనిండి నూత్న చైతన్యంతో పొంగిపొరలే సాహిత్యం కావాలి. రచయితలకూ ప్రజలకూ మరీ దగ్గర సంబంధం ఏర్పడాలి. సాహిత్యం ఏకొద్దిమంది అదృష్టవంతులకో సంపన్నులకో, సోమరిపోతులకో కాదు. అనేకులైనఅభాగ్యులకు సామాన్య వ్యక్తులకు — వారి జీవితాలకూ, వారు స్వాతంత్ర్యానికై క్షణ క్షణం సాగించే సంఘర్షణలకు రూపం దిద్దేదిగాఉండాలి

అట్టి సాహిత్యం జీవభాషలో ఉండాలి ఎర్వచించటానికి వీల్లేని విద్యుచ్ఛక్తితో స్పందించే వ్యావహారిక భాషలో వుండాలి సాహిత్యానికివస్తువు, విషయం యదార్థ జీవితంనుంచే స్వీకరించడం ప్రధానం, సమకాలీనమైన జీవిత పరిస్థితికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు, సాంఘిక సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణ్యంగా అనుకూలంగా సాహిత్యం వెలసిల్లినప్పుడే దేశం జాతియొక్క ఆత్మ వికసిస్తుంది

ఆఖరున ఒకమాట దేశ సౌభాగ్యానికి ప్రజలలో సామరస్యం ఐకమత్యం, పరస్పర సానుభూతి, విశ్వాసం ఉండాలి ఈర్ష్య, అసూయా, లేనిపోని కలతలను, అణగద్రొక్కితేగాని దేశం ఉన్నత స్థితికి రాదు

చెట్టపట్టాల్ పట్టుకొని దే
శస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
—మతములన్నీ
మెలగవలెనోయ్

[ఆల్ ఇండియా రేడియోవారి అనుమతిన]

అభ్యుదయ రచయితల సంఘం నవ్యసాహిత్య పరిషత్తు

శ్రీ చిలుకూరి నారాయణరావు

ఈమధ్య "భారతి" లో మల్లవరపు విశ్వేశ్వరరావుగారు ఈ విషయమును గురించి వ్రాస్తూ నవ్యసాహిత్య పరిషత్తు వారు అభ్యుదయ రచయితల సంఘము నాక్రమించుకున్నారనే ధ్వని కలిగేటట్లు సూచించినారు. ఈ అభిప్రాయము కేవలము మీరన్నట్లు నవ్యసాహిత్య పరిషత్సభ్యులు కొందరు చెన్నపురిలో జరిగిన అభ్యుదయ రచయితల సంఘ వార్షికోత్సవములో పాల్గొన్నారన్న విషయము తప్ప దీనికి మరెట్టి ఆధారమున్నూ లేదు.

మన సాంఘికాది జీవితములలో గదులు గదులుగా ఏర్పాటు చేసుకుని ఒకగదిలోనివారు మరొక గదిలోకి కాలు పెట్టకూడదనే అభిప్రాయమింకా కొందరి మనస్సులలో ఆక్రమించి విడువకుండా వున్నది. ఒక గుంపుకు ఒకపేరు అతికించి ఆపేరుకొక నిర్వచనమూ, ఒక స్వరూపమూ వున్నదని కాని, ఒకరినుంచి ఒకరు ప్రత్యేకపడి తమ తమకొక విశిష్టత వున్నదనుకొనడము సరిపాటి అయినది. ఇదే మనజాతీయ జీవిత మంతటిలోనూ ఆవరించుకున్న అరిష్టము. నిజమాలోచిస్తే నవ్యసాహిత్య పరిషత్తుకు, అభ్యుదయ రచయితల సంఘానికీ యెట్టి భేదమున్నూ లేదు అభిప్రాయాలలోగాని, రచనా పద్ధతిలో గాని. ఇద్దరిదిన్నీ పురోముఖమే, పురోగమనమే. పురోగమనానికెక్కడనుండి ఆటంకము కలిగినా, ఇద్దరున్నూ సహించరు. ఇటువంటి సాహిత్యమే ఉండవలెననే నియమము ఇద్దరికిన్నీ లేదు. నాకు కనబడిన భేదమొక్కటే. నవ్యసాహిత్య పరిషత్సభ్యులు కొన్నియేండ్లు ముందుగా పుట్టినారు. వారికి మీసము (మీసాలనేవి వున్న వారిమాట) ముందుగా వచ్చినవి. అభ్యుదయ రచయితలు నూనూగు మీసాల వాళ్ళు, కొంచమిటీవల పుట్టిన వాళ్ళు. వాళ్ళూ వీళ్ళూకూడా అతివేగముగా మార్పుపొందుతూవున్న ప్రపంచపు వత్తుడులకులోనై, చైతన్యమున్న వాళ్ళు గనుక ఆ ప్రపంచపరిస్థితులకు లోనుగావడమూ, ఆ పరిస్థితులను తమ కనుకూలముగా మార్చుకోవడమూ, ప్రతికూలమైనప్పుడు ప్రతిఘటించడమూ భవిష్యజ్జీవితాని కనుకూలముగా కొత్త మార్గాలలోనికి తిప్పడమూ చేయడానికి తమ లేఖినుల నుపయోగిస్తున్నారు.

అభ్యుదయ రచయితలకువలెనే నవ్యసాహిత్యపరిషత్సభ్యులకు పశ్చాద్బుద్ధి ఎంతమాత్రమున్నూ లేదు. ఉంటే నవ్యులుకానేకారు. ఆనిత్య నవ్యత్వ సిద్ధాంతమును ప్రతిఘటించినవారు కావ

దము చేతనే పశ్చాద్బుద్ధిగల ఆంధ్ర సాహిత్య పరిషత్తును వెనుకకు నెట్టి ముందుకు తెగబడ్డారు అభ్యుదయ రచయితలు నవ్యసాహిత్యపరిషత్తుమీద తిరుగుబాటు చూపలేరు ఇద్దరున్నూ యేకాభిప్రాయులు. ఏకాభ్యుదయ భావ ప్రేరితులు కాబట్టి అట్టి తిరుగుబాటు కవకాశము లేదు

అయితే రెండు ప్రత్యేకసంస్థల కావశ్యకత యేమున్నదని యెవరయినా అడుగవచ్చును అభ్యుదయ రచయితల సంఘము కొంత పనిచేసి, కొంత స్థైర్యమును పొందేవరకు అట్టిఆవశ్యకతవున్నదని నాయభిప్రాయము నేనీ మాటలు నవ్యసాహిత్యపరిషత్సభ్యుడనుగా వ్రాస్తున్నాను దాని సంస్థాపకులలో ఒకడను ప్రధమాధ్యక్షుడను ఆ పరిషత్తు తానై ప్రత్యేకముగా చేయవలసినపని కొంత వున్నదని నాయభిప్రాయము అందుచేతనే కొన్నాళ్ళవరకు ఆ భేదమును పాటించాలని నాస్వంత అభిప్రాయము నవ్యసాహిత్య పరిషత్తు ప్రత్యేకము చేయవలసినపని మరి లేనిసమయము వస్తే రెండుసంస్థలూ కలిసిపోయి ఏక సంస్థగా ఏర్పడిపోవడానికి అభ్యంతరమేమీ లేదు ఎవరి అభ్యంతరము మాత్రము యెందుకు పనికివస్తుంది కొన్నాళ్ళకు ఆయీ నూగుమీసాల అభ్యుదయ రచయితల మీసాలుకూడా పండిపోకుండా తుమ్మెదలలాగ నిగారిస్తాయా? అప్పటికిక్రొత్తభావాలు, కొత్తఆశయాలు క్రొత్తరక్తము, క్రొత్తఅలజడి, ఆందోళన యేమిబయలుదేరుతుందో! ఆనాడు నవ్యసాహిత్య పరిషత్తుకూ స్థానముండదు, అభ్యుదయ రచయితల సంఘానికీ స్థానముండదు ఈరెండుసంస్థల సభ్యులకు యిప్పుడున్న యువభావము నిలచివుంటే, వీరేవారౌతారు వారిలో కలసిపోతారు కలసి ముందుకు సాగిపోతారు అభ్యుదయ విరోధుల నెదిర్చి సాగదీస్తారు ఉత్తపేర్లుకోసమీ పెనుగులాట మాత్రము వ్యర్ధము.

తెలుగు పిల్లలకు —

తెలుగు పూలు

రచయిత. శ్రీ నార్ల చిరంజీవి

★ ద్వితీయ ముద్రణ. త్వరలో వెలువడుతుంది.

★ ఈసారయినా మీ ప్రతికోసం జాగ్రత్తపడండి.

వెల: మూడణాలు

వివరాలకు:—

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, బెజవాడ.

పులి పంజా

శ్రీ పురిపండా అప్పలస్వామి

బురుజుమీద బొల్లిగద్ద
బురుజుక్రింద కృకలాసం
ఉల్లి పాము తలపాగా
ఊరినిండ పులిపంజా
చీకటి చిందిన రక్తం
క్విస్లింగుల విష్కంభం
పాడలేని పాడుకోట
పణ్యాంగన పరిహాసం
రణ
రణ
రణ
ఝణ ఝణ ఝణ
కనకదుర్గ కాలిఅందె
కపాల పాత్రికనిండా
అపార మీ పానీయం
పగిలి
పగిలి
రగిలి రగిలి

ఇది విప్లవ సంకేతం
చిరవాంఛిత సంక్షోభం
ఓహో
సైనికులారా!
మీ హయహేషల చెదరిన
అరదమ్ములు నీరదాలు
గజ
గజ
గజ
గజ గజ గజ
వృద్ధ వసుంధర
స్వాహా
నా గేయం మీ కవచం
మీ ఖడ్గం నా గేయం
కుబుసం వదలిన సర్పం
నా గీతం
పులిపంజా.

★

శత్రువా!

శ్రీ 'సుదర్శన'

'సాహసించకు
సాహసించకు శత్రువా.
ఈ హేమభూమిని
కాలుమెట్టగ అడుగు కదిపితివో !

ముసలిబాటలు రాలు రువ్వును,
తరు నికుంజము చివురు తూపుల
నీదు కాయము తూటు బొడుచునురా !

గండశిలాఖండములను
ధారలుగా గురియించును
సుమ్మీ గిరితతి ;

అరుణ జలోత్తుంగ భంగ
శిఖరి జారి మడిసెదవే ?
ముసుగుత్రోసి మగువలేచి
సబలాత్వము చూపునురా !

రాకు రాకు
'బదాక్షన్' కు,
ద్వేషమిచట కాపున్నది.

సాహసించకు సాహసించకు
శత్రువా యీ హేమధరణిని
కాలుమెదపకు-జీవమెగురును !'

* ఈరచన తజకిస్తాన్ పల్లె పదానికి అనుసరణ. 'డాన్ ఓవర్ సమర్కాండ్' నుండి

అభ్యుదయ రచయితల మహాసభ

శ్రీ అబ్బాస్ సమీక్ష

పన్నెండు గంటల్లో

వేళ్ళు కొంకర్లుపోతూ, రక్తం గడ్డ కట్టుకపొయ్యే చలిలో లాహోర్లో విమానంలో [ఉన్ని బనీన్లు స్వెట్టర్లు, కోట్లు, దుప్పట్లు, మఫ్లర్లు వేసుకొని] ఎక్కాను ఢిల్లీకి [మన భారతదేశపు కేంద్రం] ఢిల్లీ మైదానాల మీదుగా 'నూతన రాజ్యాంగ పరిషత్తు' సమావేశమౌతున్న వెచ్చటి భవనాల గవాక్షాల్లోనుంచి చలి గాలి జోరుగా వీస్తున్నది. గ్వాలియర్ చేరేసరికి తెల్లవారింది. [పైకోటు తీసేశాను] భోపాల్లో వేడివేడి రొట్టెతిని, కాఫీతాగి [ఏ పలవేసుకున్న ట్వీడ్ కోటు తీసేశాను] మధ్యమాగాణంలో గుండా నాగపూర్ వచ్చి అక్కడ భోంచేశాక, ఉన్నిబనీను తీసేశాను ఎర్రటి-వెచ్చటి దక్కన్ పీఠభూములమీదుగా హైదరాబాద్ వచ్చాను, టీ తీసుకొనేసరికి ఇక్కడ చొక్కా-కూడా తీసెయ్యాలని పించింది. వేడి దుర్భరంగాఉంది తాటి చెట్లూ, పచ్చపచ్చని వరి పొలాలతో నిండిన ఈమద్రాసులో దిగేసరికి, గుట్ట బడివున్న ఈకోట్లు, దుప్పట్లు చూస్తే 'ఎందుకు తెచ్చుకున్నట్టు ఈమోత' అని పించింది.

విమానాశ్రయంనుంచి సరాసరి సభా మందిరానికి వెళ్ళాను 1500 మందికి పైగా గిరగిర తిరుగుతున్న ఎలక్ట్రిక్ పంకాలక్రింద క్రిక్కిరిసి కూర్చున్నారు తెనుగు రచయితలు — మేధావంతులు అందరూ ఇక్కడే ఉన్నట్టుంది।

ఇంక ఈ మద్రాస్

ఈమద్రాసులో ప్రజలవేషం-దుస్తులు చూస్తే ఏమాత్రంఆడంబరంకనిపించదు. ఇది ఈనగరపు ప్రత్యేకత లాగుంది పన్నెవన్నెల దుస్తులు వేసుకొని అతి నవీనులుగా కనిపించే లాహోరు ప్రజలనుచూచి, ఖద్దరు ధోవతులు, లాల్చీలు వేసుకతిరిగే ఈ మద్రాసు ప్రజలను చూస్తే ఎంతోవిపరీతంగా ఉంటుంది।

ఇక్కడ ఇతర ప్రాంతాలతో పోల్చి చెప్తే ఖద్దరు కట్టడం హెచ్చనవచ్చు

బాటాలు, మరే ఇతర చెప్పుల వ్యాపారస్థులకైనా సరే—ఇక్కడ అంత లాభసాటిగా ఉంటుందనుకోను చెప్పులు వేసుకొనే అలవాటు ఇక్కడ అంతగా లేనట్టుంది కొద్దిమంది చెప్పులు వేస్తారు మెరీనా బీచిలో హైకోర్టు జడ్జీలంతటి ఉన్నతోద్యోగులు సైతం చెప్పులు లేకుండా నడవడం చూడొచ్చు

ఇది కాఫీకి నిలయంలాగుంది. టీ పార్టీకి పిలిచి - నీకు ఇక్కడ ఉత్త కాఫీ ఇస్తారు అయితే ఈ పట్నంవాళ్ళకు కాఫీ చెయ్యడం బాగా తెలుసు। మన బొంబాయి, కలకత్తా, ఇతర పట్నాల

లాగా ఇదిఅంత నవీనం కాలేదు పెద్ద పెద్ద భవనాలు, హోటళ్ళుకూడా తక్కువే రెండంతస్తుల బస్సులు ఇంకా ఇక్కడికి రాలేదు. పాశ్చాత్య నాగరికతా ప్రాభవం నగరంమీద అంత ఎక్కువగా పడకపోయినప్పటికీ, ఇతర పట్నాలన్నింటికంటే ఇక్కడ ఇంగ్లీషు మాట్లాడడం హెచ్చు. ఎంతో నిరాడంబరంగా కనిపించే వీళ్ళు ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడుతుంటే ఆశ్చర్యం కలుగుతుంది. సాహిత్యదృష్ట్యా చెన్నపట్నం అగ్రతాంబూలం. రెండురోజుల యీ అభ్యుదయ రచయితల మహాసభకు 1500 మంది స్త్రీ–పురుషులు వచ్చి, ఉపన్యాసం తర్వాత ఉపన్యాసం, పద్యం తర్వాత పద్యం, పాటతర్వాత పాట వింటూ జటిలమైన సాహిత్య చర్చల్లో కూడా పాల్గొంటున్నారు!

మద్రాసీ నీకురాదుగా

నేను ఈఅభ్యుదయ రచయితలమహాసభకు మద్రాసుకువెళుతున్నానని ఒకస్నేహితుడితో చెప్తే ఆయన ఇలాఅన్నాడు. "ఉపన్యాసాలన్నీ అక్కడ మద్రాసీలో వుంటాయి నీకు ఆభాష అర్థంకాదుగ!" పైగా ఈ మద్రాసీభాషకు చెప్పుకోదగినంత సాహిత్యం కూడావుందా ?అన్నట్టు పెదిమ విరిచాడు మద్రాసీ అనే భాష ఒకటిలేదు. అక్కడిప్రజలు మాట్లాడు కొనేభాషల్లో ముఖ్యమైనవి— తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం; ఆ భాషల్లో మనభారతదేశంలో మాట్లాడే యేఇతరభాషలకూ, అంతేకాదు ప్రపంచంలో అభివృద్ధిచెందిన యేఇతరభాషకూ తీసిపోనిసారస్వతం ఉందని నేను చెప్తే ఆయనవిస్తుపోయినాడు •

నాకు తెనుగు ఒక్కముక్కకూడా రాదనే విషయం ఒప్పుకున్నాను. అక్షరాలా అక్కడి ఉపన్యాసాలు నాకు అర్థం కావనికూడా నేను ఆయనకు చెప్పాను ఇదంతా తెలియక పోబట్టే నేను రెండువేలమైళ్ళ దూరం పోతున్నాననీ, ఉత్తరదేశ రచయితలతో సజీవమైన సంబంధం పెట్టుకోవాలని, ఆంధ్రాభ్యుదయ రచయితలు నన్ను ఆహ్వానించారనీ, చెప్పాను ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసంలో న్యాయమూర్తి గోవింద రాజావారిగారు——

"ఈసభ ముఖ్యంగా ఆంధ్రాభ్యుదయ రచయితల కని ఉద్దేశించబడినప్పటికీ రాష్ట్రేతర రచయితలనుకూడా ఆహ్వానించాం ఇది మనలో సోదరభావమూ, సహకారమూ పెంపొందించుకోడానికి తోడ్పడుతుంది అంతే కాదు. మన ప్రాంతీయ రచయితలందరూ ఒక్కచోట సమావేశమై, మన సంస్కృతి సాహిత్యాలు ఎలాంటి పరిణామం పొందుతున్నవో చర్చించి, తెలుసుకోవచ్చు మనకృషి ఏకోన్ముఖమై, ఒక్క మన సాహిత్యానికేగాక, భారత దేశానికంతటికీ ప్రయోజనకారి కాగలదు. ఎవరి భాషలో వారికి ఆదరణా, విశ్వాసం ఉండవచ్చు. తన భాష, తన సారస్వతం ఉత్కృష్టమైనదనుకొని, ఇతరుల భాషలూ, సాహిత్యాలూ అంత ఉత్కృష్టమైనవీ, ఉదాత్తమైనవీ కావనే సంకుచితత్వానికి తావు లేకుండా చేసుకొని, విశాలదృక్పథంతో పవిత్ర ఆశయాలతో,

కృషి చేయవలసి ఉన్నది. ఇదొక్క తెనుగు రచయితలను మనస్సులో పెట్టుకొనే చెప్పడంలేదు. వివిధభాషారచయితలు గమనించవలసిన విషయం సంస్కృతి, వైజ్ఞానిక రంగాల్లో చిన్నాభిన్నంగా ఎవరికివారు విడిపోవడం ఎంతో ముప్పు ఈ రంగంలోనైనా అందరూ కలిసి కృషి సాగించేటట్టు చూడటం రచయితల విద్యుక్తధర్మం— రచయితల సమావేశం ఎక్కడ జరిగినా సరే. దేశంలోని ఇతర భాషారచయితలందరూ అక్కడ తప్పక సమావేశమయ్యేట్టుండాలి" అన్నారు

నేనుమాత్రం ఎంతో సంతోషంతో ఈ ఆంధ్రాభ్యుదయ రచయితల ఆహ్వానాన్ని అంగీకరించాను. దక్షిణాత్య సాహిత్యాలతో, సంస్కృతితో పరిచయంలేకపోవడంవల్ల - వాటిని గురించి తెలుసుకోవలసిన అవసరం నాకు ఎంతో ఉంది ఈసభకు పోవడం నాకెంతో మేలైంది. కనీసం ఒక్క తెనుగు సాహిత్యంతోనైనా సంబంధం పెట్టుకోగలిగాను

కధకాళీ అంటే నాట్యమా ? లేకుంటే ఏదన్నా డబ్బా ?

మద్రాసులో అంతా మద్రాసీ మాట్లాడతారన్న నా లాహోర్ స్నేహితుడు ఈభాషలో చెప్పుకోదగ్గ సాహిత్యం కూడానా. అని ఆశ్చర్యపడ్డాడు దస్యులైన ఈ అనార్యులకు ఒక సాహిత్యం కూడానా - అన్నాడు ఇట్లా పొరుగు సాహిత్యాల సంగతి అవగింజంతైనా తెలియకుండా నాస్నేహితుడిలాగే ఉన్న మేధావులు ఎందరో ఉన్నారు. నేను నాస్నేహితుణ్ణే ఎక్కువ నిందించడం సబబుకాదు ఒకసారి నేనుకూడా క్షమార్హంకాని తప్పుచేశాను. ఒక్క వారంలోనే నాపుస్తకాన్ని కన్నడభాషలోకి అనువదించుకుంటానంటే ఒకరికీ, అదే పుస్తకాన్ని కొనరీస్‌లోకి అనువదించుకుంటానంటే మరొకరికీ, రెండూ రెండు భాషలనుకొని యిచ్చాను దాక్షిణాత్యులు సైతం ఇలాగే చీకట్లో ఉన్నారు నా తమిళ, తెనుగు స్నేహితులు కొద్దిమంది 'ఇక్బాల్' సంగతి విన్నట్టున్నారే కాని, వాళ్లు జోష్' 'నిరాలా'ల కవిత్వం ఏమాత్రం విన్నట్టులేదు. ప్రేమచంద్ నవలలు వారుచదివినట్టులేదు. 'చిత్రాల్' చిత్రాలు వాళ్ళుచూడలేదు 'ఖారేగులామ్ ఆలీ' పాట యిప్పటికీ వినిఉండరు చాలా కాలం రాజకీయాధికారం ఉత్తరదేశీయుల చేతుల్లో ఉండి ఉండడంచేత, ఈ ఔత్తరాహ సాహిత్యాలను గురించి దాక్షిణాత్యులు కొంతవరకు తెలుసుకున్నారు. తాజ్‌మహల్ సంగతి వాళ్ళకు తెలుసు. కథక్ నాట్యరీతన్న విషయం వారికి చెప్పక్కర్లేదు అయితే ఉత్తరదేశంలో వేలాదివేల పట్టభద్రులకు, మేధావులకు చిదంబరం, నటరాజాలయం సంగతి చింతాకంతైనా తెలియదు కథకాళి అంటే ఒకనాట్యవిధానమో, లేక ఏదైనా జబ్బో వారికితెలియదు బుర్రకధ సంగతి చెపితే బుర్రాసాహెబో, లేక మోకాళ్ళ దాకా వ్రేలాడే పెద్ద బొర్రో ఏమిటో ననుకుంటారు.

పరిపరిపాలన - విషఫలితాలు

ఇంత చిందరవందరగా ఉన్న పరి

స్థితులకు, బ్రిటిష్ ప్రభుత్వం మన నెత్తిన రుద్దిన విజాతీయ విద్యావిధానమే కారణం. అది ఎంతో గర్హ్యణీయమైంది. ఈ సామ్రాజ్యవాదులే మన సాహిత్యాలకూ, సంస్కృతికీ మనల్ని దూరంచేసి తప్పుదారి తొక్కించారు.

మొట్టమొదట కృత్రిమంగా — ఒకే భాష మాట్లాడుతూ, ఒకే సంస్కృతికి చెందిన ప్రజలను, వాళ్ళు నివసించేరాష్ట్రాలను ఛిన్నాభిన్నంగా చీల్చివేశారు ఉదాహరణకు, మద్రాసురాష్ట్రం తీసుకోండి తమిళం, తెలుగు, మళయాళం, కన్నడం మాట్లాడే ప్రజల్ని కలగా పులగంగా కలిపేశారు పైగా కొన్ని తెనుగు భాగాల్ని మహారాష్ట్రంతోటి, కొన్నింటిని నైజాం ప్రభుత్వం క్రిందా, చేర్చేశారు. ఇప్పుడు ఆతెనుగుమాట్లాడే వారంతా ఉరుదు నేర్చుకోవలసి వస్తున్నది। ఇట్లా చీల్చి పాలించే ఈ విధానమే, పెంపొందే మన సాహిత్యాలకూ, సంస్కృతికీ గొడ్డలిపెట్టయింది।

ఇంగ్లీషుకే ప్రాధాన్యమిచ్చిన ఈ కృత్రిమ విద్యావిధానం ఇంగ్లీషుకీ, ఐరోపాచరిత్రకూ, గ్రీకు, లాటిన్ సాహిత్యాలకూ, పాశ్చాత్య కళలకూ, తత్వాలకూ మనల్ని బానిసలుగాచేసింది. మన కళాసంపదలకు, సాహిత్యాలకు దూరమైపోయి, మనం తప్పుదారి తొక్కాం ఇందుకూ ఫలితమేమంటే, బాగా చదువుకున్న పంజాబీ, ప్రాన్సు నవయుగ పరిణామాలను అర్థం చేసుకున్నాడేకాని, వాటికి ఏమాత్రం తీసిపోని, అతనికి ఎంతో సన్నిహితమైన బెంగాలుచరిత్రను తెలుసుకోలేకపోతున్నాడు. చదువుకున్న అరవవారికి కాంట్, నీచ్చైల సంగతి తెలుసుకాని, ఇక్బాల్ సంగతి తెలియదు. రాజకీయ, ఆర్థిక కేంద్రానికి దూరంగా ఉన్నందువల్ల దక్షిణ భారత దేశం కొంత వెనకబడి ఉంది।

జోర్నస్టీన్ అంటే తెలుస్తుంది కాని, బాలసరస్వతి అంటే—?

సర్వ సాధారణంగా మనదేశంలో ఇంతో అంతో ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళకుపాశ్చాత్యఇతిహాసాలనుగురించీ, రచయితలనుగురించీ తెలుసు మెకాలే, మిల్టన్లతో వాళ్ళకు పరిచయంవుంటుంది. ఇంక కీట్స్, షెల్లీ, షా, లనుగురించి వాళ్ళకు చెప్పక్కరలేదు. గ్రీక్ నాటకాలు, రోమన్ న్యాయశాస్త్రంకూడా వాళ్లు చదువుతారు. ఎలిజబెత్ నాటి నాటక సాహిత్యం, జార్జియన్ వచనరచనలూ అనంతంగా చదివేవుంటారు ఏ మిషన్ స్కూల్లోనో, క్రిస్టియన్ కళాశాలలోనో చదువు కున్నట్లయితే బైబిల్ని కూడా చదివేవుంటారు. వాళ్ళకు కనీసం దూరదేశం స్కాండినేవియాలోని కెంట్ హాన్సన్, జోర్నస్టీన్ల రచనల సంగతి తెలిసివుంటుంది శిల్పాధికారం, కూరళ్, కంబరామాయణం లాంటి తమిళ ఉద్గ్రంథాలనువినివుండరు.

ఏ వొకక్కరికికూడా ప్రసిద్ధ రాజకీయవేత్త రాజాజీ ఉత్తమ కథకుడన్నసంగతి తెలియదు కల్కి, మస్తి, చిలుకూరి నారాయణరావు, తాపీ ధర్మారావుగార్ల సంగతి వాళ్ళకు దురూహ్యంగాఉంటుంది.

కళల్లో, నాట్యంలో అభిరుచి కల వాళ్ళసంగతి తీసుకుందాం. పార్లొరా,

నిజొవస్కీల నాట్యభంగిమలనూ, రీతులనూ పట్టిస్తారే కాని, భరతనాట్యంలో పేరెన్నికగన్న దాక్షిణాత్యులు, కుంజన్ నంబియార్, గోపీనాథ్, మీనాక్షిసుందరం పిళ్ళె, బాలసరస్వతి అంటే 'ఎవరో' అంటారు 'సాండర్ వెల్స్ బ్యాలెట్స్'ను గురించి పదేపదే చదువుతుంటారు గాని, మళయాళకవి వల్లథోల్ 'కళామండలం' ప్రసక్తి వీళ్ళకు లేదు

బొంబాయి కలకత్తా, లాహోర్లలో పత్రికా విమర్శకులు, నాట్యకళారాధకులు గిల్‌గుడ్‌'ను గురించి ప్రసంగిస్తుంటారే కాని బళ్ళారి రాఘవాచారి విషయం ఎత్తనే ఎత్తరు [దురదృష్టం ఆయన ఇప్పుడులేడు] ఆయన ఒక్క తెలుగు దేశపు నాటక చక్రవర్తే కాదు. పాశ్చాత్య దేశాల్లోను మన్ననలందిన మేటి న్యూయార్కులో 'మర్చెంట్ ఆఫ్ వెన్నిస్'లో షైలాక్ పాత్ర వేశాడు. సంగీతంఅంటే చెవిగోసుకునే వాళ్ళయితే గ్రెస్‌మూర్, జెనటీమాగ్డొనాల్డు, ఎహూడీమెన్యూలిన్‌ల సంగీతం వింటుంటారు మంచిదే! సుబ్బులక్ష్మి, ద్వారం వెంకటస్వామినాయుడు గార్ల సంగతి వీరికితెలుసా? కొందరంటారు ఈపేర్లు పలకడానికే కష్టంగా వుంటాయని. అవి పొడుగాంటివే— అయితే మెలిజాకోర్జస్ సచాహిఫీజ్ అమాట కొస్తే జోర్న్‌స్టీన్ జోర్న్‌స్టీన్లు పలకడం లేదు

మనం మనసంస్కృతికి ఎంతదూరమైనామంటే — మనకు నార్వీజియన్ పేర్లు సుళువుగా వస్తాయికాని, దాక్షిణాత్యుల పేర్లు పలకలేమనే స్థితివచ్చింది. ఇక్కడ కళలు సజీవంగా ఉన్నై

మరి నాకు కూడా ఈసభలో ఉపన్యాసాలిచ్చిన వారిపేర్లు అదివరలో పరిచయమైనవి కావు. వాళ్ళందరూ పొడుపుగా, స్ఫుటంగా మాట్లాడారు. ఈ ఆంధ్రాభ్యుదయ రచయితల సభలకు వెళ్ళగలిగినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది.

ఎందుకోనన్ను ఆదక్షిణదేశం ఎంతో ఆకర్షిస్తుంది అక్కడికి ఏదో తెలియని తెలుసుకోవాలనే కోరికతో వెళ్ళానసంది, దూరపు కొండలు నునుపను కుని వెళ్ళాననండి, ఏమన్నాసరే! దాక్షిణాత్య భాషలతో పరిచయం లేకున్నప్పటికీ, ఆదేశంతో నాకు పరిచయంఉన్నది. అనన్యమైన అక్కడి దేవాలయ సుందర శిల్పాలనూ, వారి నాట్య విధానాలనూ చూచాను, అవిచూచి ఆనందించినప్పుడు ఆభాషలు రాకపోవడం పెద్ద ప్రతిబంధకము కాలేదు ఈవిధంగా నేను వారి నాగరికతనూ, సంస్కృతినీ అర్థం చేసుకోగలిగాను 1935 లో దక్షిణదేశానికి నేను మొట్టమొదటిసారి వెళ్ళాను ఆదేవాలయ శిల్పాలు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టున్నై. నేను మతాభిమానంతో ఈమాటలు చెప్పడంలేదు కనీసం నేను విగ్రహారాధకుణ్నయినా కాదు. మానవుడిలో ఉన్న అనశ్వరమైన సౌందర్య పిపాస, సత్యాన్వేషణ ఈ శిల్పాలలో వ్యక్తమవుతున్నది. అక్కడ కథకాళీ, భరతనాట్య విధానాలలో ఆరితేరినవారి నాట్యం చూచాను ఆనాట్య భంగికులూ, భంగికులలో సౌందర్యమూ, భావవ్యక్తీకరణం, అందలిపటిమా-నన్ను ముగ్ధుణ్ణి చేశాయి

నాటకాలు, కళాప్రదర్శనాలు చూస్తున్నప్పుడూ, కావ్యపరనం సాగుతున్నప్పుడూ సభికుల్లోని కదలిక, వారిముఖ కవళికలు చూస్తే ఈకళలు ఇంకాప్రజల్లో సజీవంగా ఉన్నాయనీ అవి ప్రదర్శనశాలలో చిహ్నప్రాయంగా ఉన్నవి మాత్రం కాదనీ తెలుసుకున్నాను సంగీతం, నాట్యం ముఖ్యంగా ఈదక్షిణ దేశంలో పెంపొందాయి వాటిని ఇతర రాష్ట్రాలవారికంటే ఎంతో శ్రద్ధతో వికసింప జేస్తున్నారు వాటికి ప్రజాహృదయంలో కుదురైనస్థానం అక్కడ ఉండడంచేత అవి ప్రజా జీవితాన్ని చిత్రిస్తూ ఎంతోవృద్ధి పొందుతాయని చెప్పవచ్చు!


ప్ర జా క వి

రసవంతంగా, రాగలహరిలా సాగిపోతున్న ఈ 'కార్యావళి' లో నాజర్ బుర్రకథ విన్నాను అదొక విధమైన జానపద కళాఫణితి పేద రైతుకుటుంబంలోనుంచి వచ్చిన నాజర్ మహమ్మదీయుడైనా నిత్యవ్యవహారంలో ఉన్న తెనుగు కవిత్వం వ్రాస్తున్నాడు. మేధావంతులైన సామాజికులందరి ఎదుటా నిలిచి తన బుర్రకథను రసవంతంగా చెప్పగలగడం గణనీయమైన విషయం! అతను చెప్తున్నంతసేపూ, సభికులు ఏకాగ్రతతో వింటూ, కథలో లీనమైపోవడం చూస్తే, కళకూ ప్రజలకూ మధ్యఉన్న తెరలు తొలిగిపోయినట్టుంది. కళకు అర్హమైన గౌరవం వచ్చిందనుకున్నాను ఈ ప్రదర్శనలలో పాట, నటన, నాట్యం అన్నీకలిసి వున్నాయి ఒక భావం తర్వాత ఒక భావం దూసుకవస్తుంది. కథాగమనం వేగంగా సాగిపోతుంది విశ్రాంతి లేకుండా అట్లా గంటన్నరసేపు కథ చెప్పుకు పోవడం ఎంత కష్టం!

ఈకవి కథాంశం చరిత్రలోంచి ఏరుకున్నాడు ఒక క్రూరరాజు పరిపాలన ప్రజలకు దుర్భరమై కంటక ప్రాయమైపోతోంటే, ప్రజల్లో విప్లవ చైతన్యం కలిగించి, అన్యాయాన్ని అరికట్టడానికి ఆయన మంత్రి ప్రజల్ని తిరుగుబాటుకు పురికొల్పుతాడు పాట కాగానే, ఒకరు కథ కలుపుతూ వ్యాఖ్యానిస్తుంటారు. రాజకీయాలే కాదు ఎన్నో విశేషాలు చెప్పుకపోతాడు మధ్యలో హాస్యం చెప్పే అతను చెణుకులూ చమత్కృతులూ విసురుతుంటాడు అవి ఎంతో హాయినీ ఒకరకంగా కథకుఊపునూ ఇస్తుంటాయి సభికులందరూ పరవశులై కథ విన్నారు ఈ గంటన్నరలో ఆంధ్రదేశమంటే ఏమిటో నాకు తెలిసింది ఈ విషయం ఒక డజన్ తెనుగు కావ్యాలు, సాహిత్య విమర్శలూ చదివినప్పటికీ అవగాహన అయ్యేది కాదు!

రచయితలకు సముచితస్థానం

ఖాన్‌బహాదూర్, రాయ్‌బహాదూర్, నైట్‌హుడ్, సర్ బిరుదులకూ అమెరికన్ సినిమా తారలకు వ్యాపారదృష్ట్యా తరగతుల వారీగా ఇచ్చే బిరుదులకూ, రష్యాలో రచయితలను 'ప్రజాకవి' 'కళారాధకుడు' అని సత్కరించే విధానానికీ నక్కకూ, నాగలోకానికీ ఉన్నంత అంతరం ఉన్నది. ప్రజాకవి అన్నప్పుడు ఎంతో అర్థం స్ఫురిస్తుంది. రచయితలకూ, రచనలు చదివే ప్రజలకూ ఉన్న హృద్గత సాన్నిహిత్యం స్ఫుటంగా,



శ్రీ విశ్వనాథ సత్యనారాయణ



ಶ್ರೀ ವಿ. ಕೃ. ಗೋಕಾಕ

సవరణ

25 వ పేజీ - 2 వ కాలం - మొదటి పేరా మొదట్లో ఈ క్రింది విషయం చేర్చి చదువుకోవాలి.

నిజం చెప్పాలంటే, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఆంధ్ర సాహిత్యంలోని విశిష్టమైన ఉదారమైన అన్ని అభ్యుదయ పంథాలకూ యథార్థంగా ప్రాతినిధ్యం వహిస్తున్నది దాక్షిణాత్య సాహిత్య జీవితంలో ఈ ఉద్యమం ప్రధానమైనదే కాక, సజీవమైన ప్రభావం కలది కూడాను. మహాకవుల దగ్గరనుంచీ జానపద కవులదాకా, కొత్త కొత్త సాధనలు చేస్తున్నవారితో సహా, తొమ్మిదివందలమంది రచయితలు ఈ సంఘంలో వున్నారు. దీని ప్రాముఖ్యం దక్షిణదేశంలో మాత్రమే కాదు ఈ సంఘం అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘంలోని అన్ని రాష్ట్ర శాఖల్లోను బలవత్తరమైనది; అతి ప్రధానమైనది.

ఈ సంఘ కార్యక్రమం, సభలూ, సమావేశాలూ జరపడంతో మాత్రమే ఆగిపోలేదు, అభ్యుదయ సాహిత్యాన్ని ప్రచురించడంలో ఈ సంఘం ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నది. ఈ సంఘం 'అభ్యుదయ' అనే ఉత్తమ సాహిత్య పత్రికను ప్రచురిస్తున్నది అనేక నాటికలను, కావ్యాలనూ, కథలనూ, జీవిత చరిత్రలనూ ఇదివరకే ప్రచురించింది.

బలంగా ధ్వనిస్తుంది. కళలకు అత్యున్నతమైన స్థానం ఉందని వాటిని లోకానికి 'అందని పండ్ల'గ్నట్లు చేసేవారు ఈ కళలకూ, ప్రజలకూ ఉన్న బాంధవ్యాన్ని గుర్తించాలి! ఈ సభల్లో ప్రజాకవులన్న దృష్టితో ఎంతోమంది కవులనూ, రచయితలనూ గౌరవించారు. సభలో రచయితల పేర్లు చెప్పి, ఒక్కొక్కరిని వరసగ పరిచయం చేస్తుంటే చెలరేగిన హర్షధ్వానం, ఉత్సాహం కెరటాలై లేచినట్టుంది ఆదృశ్యం ఇట్లాంటిదని చెప్పడం ఎట్లా?— ఈ సాన్నిహిత్యమే కళలూ, సాహిత్యమూ పెంపొందడానికి దోహదం చేస్తుంది

ఈ సభలకు ఒక్క తీవ్రభావాలు కలిగిన యువ రచయితలు మాత్రమేకాదు, సానలుతీరిన జాతిరత్నాలు, అభ్యుదయ రచయితల మంకోకుండానే అపారమైన కళాసేవచేసిన ప్రజ్ఞావంతులు ఎందరో వచ్చారు. ఈ సభలు, అభ్యుదయ రచయితలంటే సాహిత్య జగత్తులోకి తోసుక వచ్చిన వాళ్లెవరో కారనీ, వీళ్ళు ప్రాచీన సాంప్రదాయాలనూ, సాహిత్యాన్నీ ధ్వంసంచేసేవారు కాదనీ స్పష్టం చేశాయి!

సభలు జేగీయమానంగా జరగాలని పెద్దలు ఎందరో సంగేశాలు పంపారు. సభలో చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, నిడదవోలు వెంకట్రావు, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, తాపీ ధర్మారావుగార్లవంటి ప్రముఖులు ఎందరెందరో ఉన్నారు. నాకు ఆతిధ్యమిచ్చిన న్యాయమూర్తి రాజమన్నారుగారే అధ్యక్షతవహించారు. ఆయన న్యాయశాస్త్ర నిష్ణాతుడేకాదు. ప్రసిద్ధ నాటక రచయితకూడా!

అభ్యుదయరచయితల సంఘము — ఉద్యమ స్ఫాయి

ఆంధ్రాభ్యుదయ రచయితలసంఘం ఇంత సజీవమైనదీ, బలవత్తరమైనదీ కావడానికి ఎంతోమంది కృషి చేస్తున్నప్పటికీ — తన సర్వస్వాన్ని త్యాగం చేసి శ్రమకోర్చి నిరంతరంకృషిచేస్తూన్న యువకుడైన కార్యదర్శి చదలవాడ పిచ్చయ్యను ముఖ్యంగా పేర్కొవాలి. ఆయన్ని. ఆయన సహచరులనూ, వారు చేస్తున్న ఈ ఉత్తమకృషికీ నా అభివందనాలు. ఆంధ్రదేశంలో ఈ అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఉజ్జ్వల భవిష్యత్తు వుంటుందని ఆశిస్తున్నాను.

— 'బాంబే క్రానికల్' నుంచి

★

సాహిత్యం

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

సాహిత్యం అనుభవదశలో బ్రహ్మ పదార్థంవంటిది ఆ బ్రహ్మ పదార్థానికి వర్ణమతభేదాలులేవు; రాజకీయాలులేవు. శాఖాభేదాలులేవు దేశపు ఎల్లలులేవు. కవితారసానుభూతి ఇట్లాంటిది. ఈపైన చెప్పిన భేదాలన్నీ జీవుడికి వుంటవి. జీవుడు అనుభూతి దశలో మెట్లెక్కి ఈఆవరణలు లేని ఆ బ్రహ్మపదార్థ లక్షణంపట్టించుకోవడానికే నిత్యయాత్ర చేస్తాడు జీవుని యీసహజ లక్షణాన్నే వేదవేదాంతాలు నియమాలుగా చెప్తున్నాయి ఈజీవితమంతా ఒకసాధన అనుకున్నా సాధనే; అనుకోకపోయినా సాధనే.

ఈ సాధనామార్గాలు అనంతాలుగా వున్నై లోకాన్ని వదిలిపెట్టి కొన్ని మార్గాలువుంటే, లోకాన్ని కలుపుకొని కొన్ని మార్గాలువున్నై ఈ లోకాన్ని కలుపుకొని పోయేమార్గాలలో ప్రధానమైనది సారస్వతానుభూతి కాని, ఈ సారస్వతాన్ని అనుభవించటానికిపూర్వం దానితో బాగా పరిచయముండాలి పరిచయవికాసంపొందినదాంపత్యంలోగాని, స్నేహంలోకాని, సుఖానుభూతియెక్కువ గదా। మనకు ఒకభావన నచ్చిందంటే ఆ భావం మనకు పరిచితమైనదన్న మాట.

కవిత్వం విషయాన్ని ఒక విలక్షణంగా చెపుతున్నది కవిత్వంలో యెప్పుడూ ఒకముడి వుంటుంది ఆముడి విప్పదీస్తేగాని ఆనందం కలుగదు లోకంలో యేదైనా యింతే మనస్సు చొప్పించి విచారణ చేసినచోట అధిక సుఖం. మనస్సుతో ఆలోచించకపోతే సుఖమూ దుఃఖమూ రెండూలేవు. చాలా అల్పవిషయమే ననుకోండి. ఒకకుక్క యీనింది. నాలుగు పిల్లల్ని పెట్టింది. పిల్లలను వదలిపెట్టి పోలేక ఆకలి వేస్తున్న, దించుకపోయినపొట్టతో ఆ పిల్లలు చంటబడి సందడి చేస్తుంటే అలాగే పడుకొనిఉంది. దారివెంట చాలా మందిపోతూ ఉంటారు ఎవళ్ళకీ దాని గోడు పట్టలేదు. ఒక భావుకుడు దాని వంక చూస్తాడు జంతువులకు సహజమైన సంతానమునందలి ప్రేమ-ఆప్రేమ కోసం ఆకలిని చంపుకొనడము, తాను వెళితే ఆపిల్లలు యేమవుతాయోనన్న భయం ఆకూనల పసిరేఖలు వాటి నోటి వెంటవచ్చు వికసించని సన్నని లేత కూతలు-ఇవన్నీ భావిస్తే ఆ పరిస్థితిలో కుక్క యీనింది. పిల్లలువున్నవి అన్న సామాన్యభావాన్ని అతిశయించిమనస్సు కుక్క పిల్లలు అన్న అల్ప విషయాన్ని దాటి, మాతృప్రేమ అన్నమహావిషయం దగ్గరకుపోతున్నది. ఈమాతృప్రేమలో నుంచి ప్రకృతియొక్క లక్షణాన్ని భావిస్తున్నది ఆమనస్సుయొక్క స్థితివేరు,

ఆమనస్సు ఆవరణలుదాటినది. చూస్తున్నది కుక్కనైనా, ఊహిస్తున్నది సృష్టి రహస్యాన్ని. కుక్కను కుక్కగాచూస్తే ఈభావవికారంలేదు. ఈభావవికారంలేకపోతే విశిష్టమైన అనుభూతిలేదు విశిష్టమైన అనుభూతిలేకపోతే, సామాన్యమానవుడు. సామాన్య మానవుడుగానే వుండటానికి కవిత్వం మొదలయినవి అక్కరలేదు వచనంలోవున్న భావాన్ని పద్యరూపంగానో, పాట రూపంగానో ఉండాలని యెందుకు వాంఛిస్తాడు? ఆ పద్యమో పాటో వచన రూపంగావున్న భావంకంటే అధికమైన ముద్ర యిస్తుందని. ఇపుడు చూడండి! ఒక భావం ఉన్నది ఉన్నట్లుగా పద్యంలో పెడతాము. వచనంలో ఎలావుందో, పద్యంలోనూ అలానేవుంది భేదమేమిటయ్యా అంటే, పద్యంలో గణాలతో అమరించాము ఈగణాలవల్ల ఒకనడకవచ్చింది. ఒక వూపువచ్చింది. చేస్తే ఒక మాధుర్యం వస్తుంది. ఆ వట్టిభావం ఈ గుణాలతో కూడి ఎక్కువ సుఖమిచ్చిందన్నమాట

ఆపద్యరచనలో రచనాసౌందర్యమెక్కువైనకొద్దీ ఆపద్యం యిచ్చే ఆనందం యెక్కువవుతున్నది-అనడంలో కష్టం లేదు. అల్లాగే ఆభావం సామాన్యమైనదైతే దానిని ఒక ఒడుపుగా చెప్పడం ఆభావాన్ని యింకోభావంతో సంయోజనంచేసిచెప్పడం, మనస్సుకుయెక్కువ ఆహ్లాదకారి. లోకంలో సామాన్యంగా వాడు అందవికారంగా వుంటాడు అన్నప్పటికన్నా వాడు కోతిపలె వుంటాడు అన్నప్పుడు నవ్వెక్కువ వస్తున్నది. ఎందుచేత ?

కోతి అందంగా ఉండదు, వికారంగా ఉంటుంది అన్న భావాన్ని తీసుక వచ్చి వీనిరూపంమీద ఆరోపణ చెయ్యడం కనుక రెండు భావాలు కలిపితే చమత్కారం పుట్టింది. ఇలాంటి అనేకములైన విషయముల కూడికచేత కవిత్వం యేంచేస్తుందంటే - మన మనస్సుల కానందం కలిగిస్తున్నది ఆనందం కలిగించాలంటే ఆనందమనేమాటే తీసివేస్తాం మన మనస్సులను సామాన్యస్థితి దాటించి ఒక వ్యగ్రమైన స్థితి కలిపించటమే అంటాము. ఆ స్థితి కల్పించాలంటే యే భావమూ దానిఅంతట అదికలిగించలేదు లోకములో కలిగిస్తున్నది, కావ్యంలో కలిగించలేదు. సమీప బంధువు చనిపోయినాడంటే దుఃఖము వస్తున్నది ఎవడో చనిపోయినాడంటే ఎవడో పరమదయామూర్తి విచారిస్తాడేమో తక్కినవాళ్ళకు చీమైనాకుట్టదు. బంధువు చనిపోయినాడంటే దుఃఖమెందుకు ? ఎవడో చనిపోయినాడంటే ఎందుకు లేదు ? ఇద్దరూ మనుష్యులేగా! ఈ బంధువునందు వాడు మనుష్యుడవటమట్లా వుండగా, మన బంధుభావం ఒకటి దానితో జోడించివున్నది. అప్పుడు హృదయం ఎక్కువ ద్రవించింది. ఈ బంధుత్వమంటే యేమిటి? ఇది సంఘంలో పెరిగిన ఒక భావం ఈ భావాన్నిఅంటుకొని సహజంగా ప్రేమలు వుంటవి. కష్టాలలో సుఖాలలో ఒకళ్ళకొకళ్ళ మాదుకుంటాము. చిన్నప్పటినుంచీ ఎరుగుదుము అతను కనుపిస్తే పరాయి పెద్దమనిషితో మాట్లాడినట్లు ఏదో బిగుసుకు పోనక్కర లేదు.

ఇవన్నీ మమకారానికి హేతువులే. ఆ బంధువు పోయినాడనటంతోటే ఈభావాలన్నీ కదలులాడినవి ఈ భావాల ఒత్తిడిచేత అతడు చనిపోయినాడన్న విషయం మనకు పట్టరాని దుఃఖహేతువైనది ఇలా ఒకభావం ఇతరములైన మన హృదయాన్ని కంపేటటువంటి ఇతరభావాలతో సంయోగపడి మనస్సు వ్యగ్రం కావడం మనుష్యునియొక్క మనోలక్షణం

ఇది సహజం. ఈ సహజమైన స్థితి వల్ల మనుష్యుడు మనుష్యుడేఅవుతాడు అదికూడా కాదు. ఈ సహజమైన స్థితి జీవితంలో తనకుపట్టని లౌకికంగా తాను బాధ పడనక్కరలేని ఒక కల్పిత సంవిధానంలో మనుష్యుడు ఉల్లా అనుభవించేటట్టు చేస్తే అది మనస్సుకి ఉన్నతత్వం తెప్పిస్తున్నది మనుష్యుడు శరీరమయుడుకాకుండా మనోమయుడవుతాడు శరీరమయుడైతే తాను, తన బంధువులు తన స్నేహితులు గుడిగుడి గుంజం - గుండేరాగం మనోమయుడైతే సర్వజీవకోటిలో ఒకడవుతాడు సర్వజీవుల సుఖ దుఃఖాలు తనవి అవుతాయి అది ఒకవిధమైన మోక్షము. ఒకచిన్న మెత్తు బంగారాన్ని తీసుకొని రేకుగా కొడతాము ఆ చిన్న మెత్తు బంగారము రెండు చదరపుగజాల రేకు ఎప్పుడూ గాదు. ఆ స్థితిలో బంగారం కనుపించదు ద్రవ్యం నశించదుగాః అణువులణువులై పోయి అది వున్నది మనకు రేకులేదు. మనకు పనికిరాదు మనస్సును ఈరీతిగా కవితా భావానికి దాని అనుభూతికి అలవాటు చేస్తే, బంగారపు రేకులోని అణువులు ప్రకృతిలో కలిసిపోయినట్లుగా మనస్సు కూడా సర్వజీవలోకంలో కలిసిపోతున్నది ఆ బంగారపురేకు మనకు పనికివచ్చేతనాన్ని పోగొట్టుకొన్నట్టుగా ఈ మనస్సు తాను తనచుట్టాలు అన్న భావాన్ని పోగొట్టుకుంటున్నది. ఇది ఒక మహాసాధన. అందుకనే మన పూర్వులు సాహిత్యానికి యితరప్రయోజనాలు చెబుతూ పరమ ప్రయోజనంగా సద్యః పరనిర్వృతి చెప్పారు ఈ పరనిర్వృతి కలిగినా, కలుగకపోయినా కవిత్వంచేత మనస్సునకు వైశాల్యం రావాలి ఈ వైశాల్యం వచ్చేందుకే మనము వ్రాసినదానియందు కవితాత్వం వుండాలి. కవితాత్వమంటే పైన చెప్పినట్లుగా ఒక భావాన్ని రంగులురంగులుగా రంగురంగులయిన మాటలతో రంగైన చేతతో చెప్పడం ఆ చెప్పడానికి కవికి కవి కావాలనినట్టుగా మనుష్యుడు భావుకుడు కావాలి ఆ రంగులతో పరిచయముండాలన్న మాట పరిచయమే గాకుండా అభిమానముండా లన్నమాట ఇదంతా ప్రయత్నంచేతసాధ్యం బంధువు చనిపోయినాడంటే ఏడవడం సులభం సులభమంటే సహజం సహజమంటే యెక్కువపాళ్ళు పుట్టుకలోను, పెంపకంలోను వుండటమన్నమాట. ఈ సహజమైన సహజంగానేవుంటే మనుష్యుడు జంతువు. అది శరీరలక్షణం. దీనిని దాటి నీవు మనఃప్రపంచములోనికి పోతే జంతుత్వాన్ని దాటి మనుష్యత్వాన్ని పొందుతావు మనుష్యత్వాన్ని దాటి దేవత్వాన్ని పొందుతావు.

ఈ మాటలనుబట్టి కొంద రిదంతా వేదాంతమనివచ్చు కావ్యం చదివి నప్పుడు పరమానంద రసానుభూతి పొందటం మూలంగా వాడు వెంటనే బైరాగికాడు ఆస్థితి పరమమైనస్థితి ఆస్థితిని పొందిన తరువాత దానిక్రింది స్థితులు నీకు సులభాలవుతై యే విషయాన్నైనా గాఢంగా పరిశీలించడమూ, అనుభవించడమూ, ఆచరించడమూ, నీప్రకృతిలో భాగాలవుతై అప్పుడు నీమాట, నీచేత, తీర్చిదిద్దినట్లు వుంటై నిచ్చెనమీద పైమెట్టునవున్న వాడికి క్రింది మెట్లుఅడుగువేస్తే అందుతవి ఈరీతిగా ఉత్తమకవిత్వం జీవితాన్ని తీర్చిదిద్దుతుంది కవిత్వానికి నీఆదర్శాలతో పని లేదు. నీమతభేదాలతో పని లేదు. నీ వైషమ్యాలతో పనిలేదు నీ ఆవేశాలతో పనిలేదు నీవు నీయిష్టము వచ్చినట్లుగా వ్రాసుకో అది కవిత్వమైతే నాకానంద మిస్తున్నది దానియందు నాకు సానుభూతి కలిగిసున్నది. నన్ను మారుస్తున్నది దానిలోవున్న పరమ రహస్యాన్ని నన్ను గ్రహింప జేస్తున్నది నన్ను ఆచరణ మార్గంలోకి త్రిప్పుతున్నది ఒక ఉదాహరణ చెబుతా. మనం యింగ్లీషు గ్రంధాలనేకాలు చదువుతున్నాము వాటినిండా పాశ్చాత్యుల సంఘాచారాలు, క్రైస్తవమత సాంప్రదాయాలు వుంటవి అవి మాకు వ్యతిరేకం గనుక మేము చదవము అనము. పాఠ్యగ్రంధాలుగా చదువేవి బలవంతంగాని మనం తట మనం యిష్టపడి చదివే గ్రంధాలు ఎందుకు చదువుతున్నాము? ఆనందం కోసం. హృదయము యొక్క విశాల స్పందనము కోసము చదివి మనం క్రైస్తవులంకాలేదు. కాని, ఆగ్రంధంలో వున్న పరమార్థం మన మనస్సుకూ ఆత్మకూ పట్టించుకుంటాము. ఈ సంస్కారం ఇప్పుడూ మరొకప్పుడూ నీకు సహాయ పడుతూనే వుంటున్నది. ఆగ్రంధం చదువకపూర్వం నీమనస్సుకు ఉన్నవైశాల్యానికి ఆగ్రంథంచదివిన తరువాత మరికొంత వైశాల్యం వచ్చింది. ఆతరువాత నీవుచేసే పనులమీద ఈసర్వ వైశాల్యము వుంటున్నది ఇల్లావైశాల్యము సంపాదించిన మనస్సుగలవాడు చేసేపని శాంతంగా వుంటున్నది. చిరస్థాయిగా వుంటున్నది అందుచేత అల్ప సంస్కారాన్ని తొలగించాలి

మహాకవిత్వ లక్షణాలు కల కావ్యం దానినిగ్రహించిచదివే పాఠకుడికిచేసే ఉపకారంవల్లనే నేడీ ప్రపంచకము నాగరికమని చెప్పుకోడానికి హేతుభూతమైనది. భారతంచదివి రష్యావాళ్ళు ఆనందిస్తారు ఇలియడ్ చదివి మనం ఆనందిస్తున్నాం. ఇది మహాకవిత్వంలో వున్న పరమ రహస్యం కవిత్వమంటే కథలోవున్న పురుషులుకారు వాళ్ళ మతాలుకావు వాళ్ళ సాంప్రదాయాలుకావు. వీటి అన్నింటినుండి పుట్టిన పరమార్థ భూతమైనది మన మిదమిద్ధమని చెప్పలేనిది, సర్వజీవులు యిముడ్చుకోగలది యిన ఒకచిత్తసంస్కారము. జీవునికే ఆసంస్కారము

వ్రాసే కవికన్నా చదివే భావుకుడు, వినే శ్రోత, వీళ్ళిద్దరికీ ఎక్కువ కట్టుదిట్టాలు కావాలి. అల్పగుణమైన కావ్యం మనహిందూ దేశస్థుడు వ్రాశాడని, మన

ఆంధ్రుడు వ్రాశాడని, మనవర్ణంవాడు వ్రాశాడని, మనశాఖవాడు వ్రాశాడని నీవభిమానం పెంచుకుంటే, అది నీవు నీజంతుదశను దాటిపోయేందుకు సహాయకారికాదు. నీకది ఉపకారం చేయదు. ఇంకొకవిధంగా నీవుచేస్తే అది నీకపకారంకూడా చేస్తున్నది. ఈ పుస్తకము వ్రాసినవాడు మన శాఖవాడుకాదు సరిగదా మనకు విరోధంగల శాఖవాడు. మనవర్ణంవాడు కాదుకదా మనకువిరోధం గల వర్ణమువాడుఅని ఆ గ్రంథాన్ని ద్వేషిస్తావు. ఇందాక మంచోచెడ్డో ప్రేమించావు: ఇప్పుడు ద్వేషిస్తున్నావు ఆప్రేమ నిన్ను జంతువుగానైనా వుంచినది ఈద్వేషం నిన్ను జంతువుకంటే తక్కువ చేస్తున్నది సారస్వతాన్ని మనం సరిగ్గా ఉపయోగించుకోలేకపోతే మనకువచ్చే నష్టమిది నీవు ఏదివ్రాస్తే నాకేమి? వ్రాసినదానిలోని పరమార్థంను గదా నేను స్వీకరించేది! ఆపరమార్థాన్ని కవితామార్గంలో వున్న అనేక మనోహరములైన ఆలంబనాలను స్వీకరించి నీవు నామనస్సునకు ఆ చిత్త సంస్కారము కలిగించు. నీవు ఆ ఆలంబనాలు లేకుండా ఏదో చెబుతావు నాకు సామాన్యంగా వుంటున్నది.

నాకేమిటి! నీకూఅలానేవుంటున్నది నేను ఈ చిత్త సంస్కారమనేదానిని ఒక ఉదాహరణతో చెబుతా ఒకమనుష్యునికి మెత్తని మనస్సు వుంటుంది అతడు భార్యను ప్రేమిస్తాడు తల్లిదండ్రులను ప్రేమిస్తాడు తోబుట్టువులను ప్రేమిస్తాడు: బంధువులను ప్రేమిస్తాడు: స్నేహితులను ప్రేమిస్తాడు ఈ మెత్తదనమనే వస్తువు అతని మనస్సులోవుండి భిన్న వ్యక్తులతో సంబంధమున్నప్పుడు ఆప్రేమ భిన్న భిన్నంగా మారి భిన్నభిన్నంగా కనిపిస్తున్నది. ఆ మెత్తదనం ఉండటం మూలంగా ఇంతమందిలో ఎవరియందు చూపించవలసిన ప్రేమఅయినా ఆప్రేమే యేమి మంచివాడనిపిస్తున్నది ఒక తమ్ముడిమీద ప్రేమ, ఆహా! అతనికి ఎంతసోదర ప్రేమవున్నది అంటున్నాం ఈ ప్రేమ భార్యమీద ప్రసరించినప్పుడు భార్యఅంటే అతనికి ఎంతప్రేమ అంటున్నాము ఒక్కభార్యనో, ఒక్కతమ్ముణ్ణో ప్రేమించేవాడి ప్రేమగాదిది ఒక మహానదివుంటే ఎక్కడబడితే అక్కడ కాలువలు త్రవ్వుకున్నట్లు ఈమూలభూతమైన మనస్సు మెత్తదనం ఎలాంటిదో, సారస్వతం, కవిత్వం చదవటం మూలంగా అటువంటి మూలభూతమైన చిత్త సంస్కారం ఏర్పడుతున్నది మూలదశలో ఆమెత్తదనానికి తల్లీ, తమ్ముడూ చెల్లెలూలేరు. అలాగే మూలదశలో ఈచిత్తసంస్కారానికి ఈ కవితా రసానుభూతికి ఆ కావ్యంలోవున్నమనవి కాని సాంప్రదాయాలు, మనవి కాని భావాలుఅని లేవు. ఆ కావ్యమంతా చదివినతర్వాత అది మహాకావ్యమయితే అది గొప్ప కవిత్వమే అయితే అక్కడవున్న గొప్ప సాంప్రదాయాలు భావాలు, శబ్దచమత్కారాలు వీటన్నింటినీదాటి ఒకఆనందలేశము మన మనస్సుల్లో మన హృదయాలల్లో స్థానం కల్పించుకుంటుంది. ఆ ఆనందలేశం యెట్లాంటిదంటే, ఆపుస్తకంలో వున్న

భావాలయందున్న రహస్యాన్ని తనలో బీజభూతంగా యిముడ్చుకుంటుంది. ఈ రీతిగా సంభృతమైన ఈ ఆనందము మళ్ళీ వివృతంగావాలంటే, యేభావాలు, యే సాంప్రదాయాలుగల పుస్తకాన్ని చదివితే ఈ ఆనందంవచ్చిందో, ఆ సాంప్రదాయాలు ఆ భావాలువాటి ప్రసక్తి లేకుండా తనకిష్టంవచ్చిన భావాలు, తన కిష్టమైన సాంప్రదాయాలమీద అంత శక్తితో విజృంభిస్తున్నది.

అందుచేత, కవిత్వ మనిపించుకునే మహావస్తువుప్రధానంగాని, ఆపుస్తకంలో మనకిష్టంలేని భావాలు చెప్పాడనిగాని మొదలయినవి ప్రధానంకాదు అయితే 'గేధే'శాకుంతలాన్ని చూచి నృత్యంచేసి వుండేవాడుకాడు. మనము బాజాక్‌ను, డుమాస్‌ని హార్డీని, డాడెట్‌ను, పుష్కిన్‌ని చదివి ఆనందించనేలేము.

ఇంతాచెబితే కవిత్వమంటే ఎట్లా వుండాలి అన్నమాట చెప్పలేదు. ఈ కవిత్వం ఒక్కొకప్పుడు కవిత్వంగా వుంటున్నది. ఒక్కొకప్పుడు శిల్పంగా వుంటుంది ఒక్కొకప్పుడు కథ చెప్ప డంగా వుంటుంది ఎలాగైనా వుంటు న్నది ఇదివరకు మహాకవులువ్రాశారు. మహాకవులు వ్రాస్తున్నారు మహా కవులు వ్రాస్తారు. పూర్వకవులందరి కవితాలక్షణాలు తీసుకునిచెప్పి. ఇంత టితో అయిపోయిందనడానికి వీల్లేదు. ఇది సంతతవాహిని. భావుక జగత్తు యొక్క మనస్సు దీనికి ప్రమాణం

ఏచిత్తసంస్కారము కవిత్వపరమా ర్థమో, అది సంపాదించు కొనేందుకు ప్రయత్నముచెయ్యాలి నీవది సంపా దిస్తే నీకు భావజగత్తు, క్రియాజగత్తు రెండూ వశమవుతాయి తక్కువ ఆవ రణలో నీవున్నన్నాళ్ళూ కవిత్వమనే మహాకళయొక్క ఫలితం నీవనుభ వించలేవు ఈ మార్గంగా రావలసిన వైశాల్యం నీమనస్సుకు రాలేదు వీడు అభ్యుదయ కవి నేను చదువను వీడు భావకవి. ఆవెర్రి నాకక్కర్లేదు. వీడి వన్నీ సనాతన భావాలు. నాకనవసరం. ఇల్లానే వూహించినన్నాళ్ళు నీకాచిత్త సంస్కారం కలగదు ఆకవి గొప్ప వాడయితే ఆ గ్రంథం ఆనందదాయి అయితే, వాడు అభ్యుదయకవో, భావ కవో మరేకవో నీకు పట్టదు. ఆ గ్రంథం చదవటంమూలంగా వచ్చేఆనందం స్వీక రిస్తావు ఈ ఆనందం ఎలాంటిదో ఇది వరకే చెప్పబడ్డది

అది ధనమువంటిది. వడ్లమ్మితే నేమి పెసలమ్మితే నేమి, కందులమ్మితే నేమి. ధనమెటువంటిది? ఆ ధనముతో నీవు మళ్ళీ వడ్లేకొనాలా? మళ్ళీ పెసలే కొనాలా? నీకిష్టం వచ్చిన పౌంటెన్ పెన్ కొనుక్కో. గడియారం కొనుక్కో ఇది ఉత్తమ కవిత్వం చదువడం మూలంగా, ఉత్తమ కావ్యంచదవడం మూలంగా, వచ్చేలాభం ఈ లోకంలో నీకు యిష్టానిష్టాలున్నవి. వాటిని గూర్చి వ్రాసిన పుస్తకాలే చదివితే అది ఎల్లాంటి దంటే అగమ్మకాశైన కొడుక్కి లక్ష రూపాయిల ఆస్తివ్రాసిపోవడం వంటిది. అప్పుడు నీవు పరమసామాన్యుడవు. ఉత్తమ కవితానుభూతిపొందదగిన వాడివికాదు నీమనస్సుకు జగద్వైశా ల్యము రాలేదు మళ్ళీ చెబుతున్నాను,

అవైశాల్యం నిన్ను నీమార్గంలోనుంచి తప్పించేదికాదు ఎవడూ ఎవణ్నీ వాడి వాడి మార్గంలోనుండి ఆఖరుకు బ్రహ్మ కూడా తప్పించలేడు. ఎవడైనా తప్పితే వాడి చిత్తసంస్కారమే చేస్తుంది. ఆ చిత్త సంస్కారం బలిష్ఠంకావడానికి ఉత్తమ కవిత్వం సహాయమవుతుంది

ఇది పరమార్థం. ఇందులో తక్కువ తక్కువ తరగతులు లేవనికాదు ఒకా నొక తరగతికి తక్కువ పడితే మాత్రం అది కవిత్వం కాదు. అది అనుభూతికాదు. ఈతరగతులనుగురించి పోట్లాడు కోవడం గూడా వుంది అది నిజంగా నిర్ణయించేది కాదు. ఇక్కడికి కవిత్వం, ఇక్కడికికాదు అనేస్థూలమైన హద్దులూవున్నవి. జీవితంలో పరిస్థితులు అనుకూలించాలి. మంచితో సంబంధం కలగాలి అది మారాలి. ఇదంతా ఛాన్స్ ఈ ఛాన్స్‌ను ఎవరు పరిహరిస్తారు? దేశ కాలాదులు నిబంధిస్తవి. కనుక మనము ఉత్తమ కవిత్వాన్ని చూడటానికి ప్రయత్నము చేస్తూవుండటమే. మరి అన్యము లేదు మరియెల్లా ఆస్థితి పొందినట్లు అని ప్రశ్నవేస్తే, దానికి హృదయమే సాక్షి. పనసతొన తిన్నప్పుడు దాని విలక్షణమైనరుచి నాలుకకే తెలుస్తున్నది ఆస్వాదిస్తావు; ఆనందిస్తావు ఈఆస్వాదన. ఆనందము, యెలా వచ్చినవి? కమలాలు, బత్తాయిలు అనేక జాతుల మామిడిపండ్లు నీవు తినివుండి, ఆరుచి కంటే విలక్షణమైనరుచి ఇక్కడ పొందావు. పొందడమంటే అరుచిని విడిగాభావించావు. ఆభావించడంలోనాలుకనీకు సహాయకారి అయింది అల్లాగా ఉత్తమ కవిత్వాన్ని ఆస్వాదించేందుకు నీమనస్సు నీకు సహాయకారి కావాలి ఎన్నడూ ఏ పండు మొగిమూ ఎరుగని వాడికి జహంగీరు మామిడిపండు ముక్కగోసి వాడిచేతిలో పెడితే వాడు తియ్యగావున్నదంటాడు. భిన్నరుచులను యెరిగివుండి, ఆస్వాదించేనేర్పు వుండి, ఆభావనచేసే వాడికే ఆ పనసతొన తీపి ఉత్తమంగా వున్నది అని తెలుస్తున్నది. అల్లాగే ఉత్తమ కవిత్వం కూడాను

ఎంతసేపూ ఈ చిత్తసంస్కారాన్ని గురించే అనటం కాదు. దీనిలోనే సర్వమూవున్నది సంఘంలో నీబ్రతికే బ్రతుకు, సంఘాన్ని నీవు తీర్చేతీర్పు అన్నీ దీనిని బట్టే చక్కగా పరిష్కృతాలవుతాయి సంఘం కశ్మలంగా వుంది దీనికినీవు ఎదురు తిరిగావు అవతలవాడెదురుతిరిగితే ఇవతలవాడు బిగవడం సామాన్య జంతులక్షణం. పసిపిల్లలు పెంకిపట్టు పడతారు. ఎవరు నేర్పారు జంతులక్షణం. కనుక ఈజంతు లక్షణాన్ని దాటి ఆ కశ్మలంగావున్న సంఘాన్ని బాగుచేయటానికి ఉత్తమ కవిత్వం సహాయపడుతుంది. అధమ కవిత్వంలో నీవు చెపితే నీమాట ఎవడూ వినడు. పైగా కోపాలు వస్తయ్. ఉత్తమ కవిత్వమంటే ఎన్ని శబ్దాలున్నా, ఎన్ని చమత్కారాలు చేసినా మెత్తని ముద్ర పాఠకునియొక్కయు, శ్రోతయొక్కయు మనస్సులమీద నాటడమన్నమాట ఇట్లా చెప్పడం సులభంగాని వ్రాయడం కష్టం. అర్థంచేసుకోవటం కష్టం. ప్రయత్నం దానికోసము.

మనుషులు కాదు, మరలు !

శ్రీమతి 'మణిమాల'

"రమా ! — రమా ! లే ! అతిధు లొచ్చారు మనఇంటికి" అంటూ ప్రభాకరం నిద్రలేపాడు.

"ఏమిటండీ నన్నునిద్రపోనివ్వండి" అని కప్పుకున్న శాలువ తలదాకా లాక్కొని పక్కకు ఒత్తిగిలి పడుకుంది రమ.

ప్రభాకరం. "అతిధు లొచ్చారంటే మరి ప్రక్కకు తిరిగి పడుకున్నావు, లే—ఇంక".

"అర్ధరాత్రి అతిధులేమిటండీ! ఊహూ నేను నమ్మను పోండి" అన్నది రమ.

ప్రభాకరం : "నిశాచరులు నిశీధి సమయంలో రాక మరెప్పుడు వస్తారు ? అయినా ఇప్పుడు తెల్లవారు ఝాము నాలుగున్నర అయింది. లే, మనఇంటికి వచ్చిన అతిధులు సామాన్యులుకారు. పోలీసు అతిధులు. ఇప్పుడైనా నమ్ముతావా ?"

శాలువ తీసేసి చటుక్కున లేచింది రమ. మంచం పక్కనే మేజామీద ఎలక్ట్రిక్ దీపం వెలుగుతున్నది. కళ్ళు తుడుచుకొని భర్తను తేరిపారచూచింది.

"ఏం ? అలా చూస్తున్నావు. ఇంకా నిద్రమంపుపోలేదా ?" అని చిరునవ్వు నవ్వాడు ప్రభాకరం.

"అబ్బ :—అయితే పోలీసు అతిధులే వేంచేశారు మన ఇంటికి ఎంత అదృష్ట మండీ !" అంటూ, తలకట్టు, చీరె సవరించు కొన్నది రమ.

"సోదా చేస్తామంటూ వచ్చారు కాని, అదొకసాకు. అసలు నన్ను అరెస్టు చెయ్యడానికే వచ్చారు ఇలాంటివి మనకు పరిపాటే. లేచి, నా బట్టలూ, పక్కా సర్దేసెయ్యి రమా !" అని చెప్పాడు ప్రభాకరం.

చుట్టుపక్కల ఇండ్ల దీపాలుకూడా వెలిగి, చీకటి పరుచుకొని ఉన్నట్టున్న ఆవరణలో వెలుతురు డాగులుడాగులుగా పడుతున్నది.

"అలాగే ఉండండి. పిల్లల్ని లేపాలి" అంటూ పిల్లల మంచాల గగ్గరకు వచ్చింది రమ.

"శశీ !—రవీ !—తారా ! లేవండి!"

"నాన్నగారికోసం ఎవరో వచ్చారుట. ఊరికి వెళ్లాలిట, లేవండి. త్వరగా ఊ . లేచిరాండి" అని ఒక్కొక్కర్నీ నిద్ర లేపి ముంగురులను సర్ది, నీళ్ళతో వాళ్ళ కళ్ళు తుడిచింది రమ.

అలస్యమైపోతున్నా, పాపం ఆవేదన కారణమనుకొని మేడమెట్లు దిగిపోతున్నాడు ప్రభాకరం. రమ కూడా భర్త వెంట ఒక్కొక్క మెట్టే దిగుతూ క్రిందికి వచ్చింది. హాల్లో లైటు వెలిగే సరికి ఇద్దరు యువకులు - పోలీసు ఉద్యోగస్థులు "రమాదేవిగారూ Good

Morning" అంటూ లోపలికి వచ్చారు.

"నమస్కారం. నా పేరు కూడా మీకు తెలిసిందన్నమాట మీకిది సుప్రభాతం కదూ!" అని పకపక నవ్వింది రమ

"సుప్రభాతమా?— కాదు. మాకిది దుర్దినం. మేము చేసుకున్న పాపం.. క్షమించండి" అన్నాడు ఒక పోలీసు ఉద్యోగి

ఇంతలో ప్రభాకరం అడ్డువచ్చి, "రమా! వారిని ఏమీ అనకు వారి విధి వారు నెరవేర్చుకోవాలి కదూ" అని మందలించాడు

"లేదండీ వారిమీద నాకేం కోపం! ఇంత చిన్నతనంలోనే వారికి ఈ దుర్గతి పట్టిందేమా అని పరితపిస్తున్నాను. అంతే"

రమ: "మిస్టర్ "

"ఆఁ"

"మీ పేరెందుకులే.... నాకవసరంలేదు కూడా. తమ్ముడంటే చాలుకదూ" అంటూ రమ ఆఫీసు గదికి వెళ్ళింది కిటికీతలుపులుతెరచి బయటకుచూచింది వరండా దీపం వెలుతురులో ఇంటిని చుట్టముట్టి సాయుధులై బారులు తీరి నిల్చున్న పోలీసులు కనిపిస్తున్నారు. తమ బంగళా ఆవరణలో ఒక గుంపు, ఇరుగు పొరుగు ఇండ్లను చుట్టి మరో గుంపు "ఈమాత్రానికే ఇంతమంది పోలీసులా" అనినవ్వుతూ రమ పోలీస్ ఉద్యోగులను గదిలోకి రమ్మనింది వాళ్ళు వచ్చినపని పూర్తి చేసుకోమని చెప్పింది. ఇంతలో అక్కడికి వచ్చిన శశి రవి తమ ఇంటి చుట్టూ నిల్చున్న పోలీసులను చూస్తున్నారు. చిన్నకూతురు తార మాత్రం వాళ్ళను చూసి జడిసింది తల్లిదగ్గరకు పరిగెత్తుకొచ్చి చీరె కుచ్చెళ్ళలో తలదాచుకొన్నది "చిట్టీ, జడుస్తావేం. నిన్నేమీ చెయ్యరమ్మా వాళ్ళు; మనఇంట్లోకి దయ్యమొచ్చిందేమోనని వెతకటానికి వచ్చారు" అని రమ తారను దగ్గరకు తీసుకుంది

"శశీ. రవీ, మీరిద్దరూ నాన్నగారి బట్టలూ, పెట్టీ సర్దండి. పక్కకట్టండి ఏం" అంది రమ పరిస్థితులనుగ్రహించుకొన్న వాళ్ళిద్దరూ ఉడుపుల గదిలోకి వెళ్ళిపోయారు.

ప్రభాకరం పోలీసు ఉద్యోగులను చూచి పకపక నవ్వుతున్నాడు ఎందుకా అని ఇద్దరూ తలెత్తిచూచారు.

"మీకెంత తెలివితేటలులేవు! మీరు వస్తారని మాకు ముందే తెలుసు కాని దూరదృష్టి ఉన్నవాళ్ళం మేము మీ రేకాయితాలకోసం, పుస్తకాల కోసం వచ్చారో వాటిని మచ్చుకు లేకుండాచేసి ఒకనెల అయింది. అయితేనేం—నిరాటంకంగా సోదాచేసుకోండి. కాని మీఅజ్ఞానానికి నాకు నవ్వొస్తున్నది. మరో మాట-అసలు మీరు వచ్చింది మరోపనికి అనికూడా నేనెరుగుదును తెలుసా"

"సిద్ధమవుతున్నాను" అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు. పోలీసు అధికార్లు ఇద్దరూ కొయ్యబారి నిల్చున్నారు

ఇంట్లో గదులన్నీ తలుపులు తీసి, బీరువాలు, పెట్టెలు తెరిచి చూపెట్టి సోదాచేసుకోమనింది రమ

ఒకపోలీసు ఉద్యోగికి 30 ఏండ్లు ఉంటాయి. రెండో ఉద్యోగి 25 ఏండ్ల వాడు. మంచి పొడగరి, స్ఫురద్రూపి

ముసల్మాను. అతని ముఖంలో, పలు కులో, మార్దవం తొణికిసలాడుతున్నది

"ఎక్కడో చూచినట్టుంది ముఖం తనతో ఇందాకటినుంచీ ఎంతో వినయముగా మాట్లాడింది ఇతనే — ఎవరా ఇతను?" అని రమ ఆలోచించుకొన్నది. కాని గుర్తుకు రాలేదు పోలీసులు ఇల్లంతా సోదా చేశారు క్రింద గ్రంధాల గదిమాత్రం మిగిలిపోయింది. ఇంతలో ముసల్మాను ఉద్యోగస్థుడు. రవిని తన వెంట రమ్మని, మేడమెట్లు ఎక్కసాగాడు. రవి అతనివెంట వెళ్ళాడు మరో ఉద్యోగి గ్రంధాలున్న గదిలోకి వెళ్ళి, రమకు ఒకకుర్చీవేసి, కూర్చోమని కోరాడు. రమ కూర్చున్నది. అక్కడి గ్రంధాలను పరిశీలిస్తూ, కొన్ని వైద్య గ్రంధాలనుచూచి "మీపిల్లల్లో ఎవరండీ మెడికల్ కాలేజీలో చదువుతున్నది?" అని అడిగాడు.

"నా పెద్దకూతురు శశి, నాకుమారుడు రవి ఇద్దరూను," అని జవాబు చెప్పింది రమ సంతోషంతో.

ఆ ఇన్స్పెక్టర్ ఇంతలో ఒకపెట్టెను చూచి తనదగ్గరకు లాక్కొన్నాడు రమ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వసాగింది. చప్పుడువిని ప్రభాకర్ గదిలోకివచ్చి, "రమా! ఏమిటి ఈవేళాకోళం, వాళ్ళను నెమ్మదిగా సోదా చేసుకోనివ్వవూ మరి" అన్నాడు.

పాపం ఇంత కష్టపడి ఇల్లంతాసోదా చేస్తే, చివరకు వాళ్ళకు చిక్కింది ఏమిటో కాస్త చూడండంటూ రమ మరల నవ్వసాగింది.

ఇన్స్పెక్టరు పెట్టెమూతను తెరిచాడు వట్టి ఎముకలు! — మానవ అస్థిపంజరం. వైద్య విద్యార్థులకు పనికివచ్చేవి. కిటికీలోనుంచి తెల తెల వెలుతురు వస్తున్నది ఇన్స్పెక్టరు ముఖం వెల వెలబోయింది ప్రభాకరుని ముఖంలోని వింత కాంతి, పెదిమలమీద చిరునవ్వు చూచి పోలీసు అధికారులు లజ్జతో తల వంచుకున్నారు

ఇంతలో మేడమీదికి వెళ్ళిన ముసల్మాన్ పోలీసు ఉద్యోగి క్రిందికి దిగి వచ్చాడు. ఎవరితోనూ మాట్లాడలేదు. హాల్లోకివచ్చి ఒక కుర్చీలో జేరగిలబడి నిట్టూర్పు విడిచాడు

ఇప్పటికి సోదా పూర్తిఅయింది మొదటి పోలీసు ఉద్యోగి రమా-ప్రభాకరులను చూచి, "ఏమండీ ప్రభాకరం గారూ! స్నానంచేసి, కాఫీ పుచ్చుకోండి మీరు మావెంట రావలసిన పనిఉంది" అని మెల్లగా అన్నాడు. "నేను సిద్ధంగా ఉన్నాను"అని జవాబు చెప్పి, రమను కాఫీ తయారు చేయించమన్నాడు ప్రభాకరం. వంటగదిదగ్గరకు వెళ్ళి తటాలున తిరిగి వచ్చింది రమ.

"ఏ సెక్షన్ క్రింద నాభర్తను అరెస్టు చేశారు? ఏదీ వారంటు చూపెట్టండి"అని పోలీసు అధికార్లను ప్రశ్నించింది ఆమె కంఠంలో, కళ్ళల్లోధైర్యం ప్రతిధ్వనించి ప్రతిబింబిస్తున్నది ఎంతో గంభీరంగా మాట్లాడు తున్నది.

రెండవ అధికారి తలవంచుకుని చూస్తూకూర్చున్నాడు. మొదటిఉద్యోగి "రమాదేవిగారూ ఏసెక్షన్ ఐతే ఏమిటి? మేముచెప్పలేం. అరెస్టుమాత్రం.... " రమ ఆయనవాక్యం పూర్తిచెయ్యక

ముందే అడ్డువచ్చి. "సెక్షన్ కూడా చెప్పరూ? అసలుమీకు తెలిస్తేగా చెప్పటానికి ఇకవారంటుకూడా లేదూ? ఇంత అరాచకం! పైగా ప్రజాప్రభుత్వం అంటూ డప్పులు వాయించుకోటం కూడాను. ఛీ! సిగ్గు! సిగ్గు!" అని మళ్ళీ వంటగది దగ్గరకువెళ్ళింది

ఇంతలో ప్రభాకరం పిల్లలతో పరిహాసాలాడుతూ వాళ్ళందించిన ఖద్దరు చొక్కా, ఖద్దరు ఉత్తరీయం వల్లెవాటు వేసుకున్నాడు. హాలుకు, ఆఫీసుగదికి మధ్య నిల్చున్నాడు ఒక ట్రేలోమూడు కప్పులు కాఫీని ఉంచుకుని అక్కడకు వచ్చింది రమ తమ్ముడూ అని ప్రత్యేకంగా ఒక్కొక్కర్నీసంబోధిస్తూ కాఫీని అందించబోయింది పోలీసు ఆఫీసర్లు ఇద్దరూ రమవంక నివ్వెరపోయి చూస్తున్నారు

"మామీదగూడా మీకింతదయా!" అన్నారు వాళ్ళిద్దరూ. కాఫీఅందుకుంటున్నప్పుడు వాళ్ళచేతులు గడగడ వణకసాగాయి.

వాళ్ళిద్దర్నీ రమ కాఫీ తాగమంది. ప్రభాకరం దగ్గరకు వచ్చింది "ఏమండీ నా చేత్తో కాఫీని.... మరెప్పుడో!" "రమా నీచేతి కాఫీని మరెన్నాళ్ళకో"

ఇద్దరి పెదిమలు ఒకసారి కదిలాయి! ఇద్దరిమాటలూ ఒక్కసారి వెలువడ్డాయి ఇద్దరిముఖాలమీదా ఒక్కసారి మబ్బులు కమ్ముకున్నాయి!

ఒకరి నొకరు ఒక్కక్షణం చూచుకొన్నారు!

రమ తలవంచుకొని "పుచ్చుకోండి ...కాఫీ" అని అందించింది. ప్రభాకరం చేతిమీద రెండు అశ్రుకణాలు రాలాయి.

"రమా ఏమిటది?" అన్నాడు ప్రభాకరం ఇంతలో రమ తన నోటిమీద వేలుపెట్టుకొని, 'ఊరుకొమ్మని' సౌజ్ఞ చేసి, వంటగదిలోకి వెళ్ళిపోయింది

పెట్టె, పరుపులు పనివాళ్ళు వసారాలోకి తెచ్చిపెట్టారు 'రమా' అని పిలిచాడు ప్రభాకరం, రమ వచ్చింది. ఆమె ఎంతో ప్రసన్నంగా ఉంది.

"రమా! మన మేడమీద పతాకాన్ని ఎగురవెయ్యి. మనందరం సెల్యూట్ చెయ్యాలి" అన్నాడు ప్రభాకరం

చెంగున ఒక గంతువేసి శశి, రవిం తారలు మేడమీదకు వెళ్ళారు. పతాకాన్ని ఎగురవేశారు. అన్నివైపులా అరుణ కాంతులు అల్లుకపోయినై అంతరిక్షంలోఎగిరే అరుణపతాకను చూస్తున్న రమా—ప్రభాకరుల కళ్ళలో అమరజ్యోతి ప్రజ్వలిస్తున్నది అక్కడ గుమిగూడిన ప్రజలముఖాల్లో ఆశారేఖలు మిలమిల్లాడుతున్నాయి. రమా—ప్రభాకరులు; పిల్లలు "స్వతంత్ర భారత్‌కు జై! అరుణ పతాకకు జై!" అని సెల్యూట్ చేస్తూ జయధ్వానాలు చేశారు

"స్వతంత్ర భారత్‌కు జై! అరుణ పతాకకు జై!" అని అన్నిమూలలా మారుమ్రోగింది

ప్రభాకరం పిల్లలొక్కరొక్కర్నీ ముద్దుపెట్టుకొని వీపుమీద నిమిరాడు. రమ వైపుకు మళ్ళి, చేతిని పట్టుకొని "రమా! సెలవు —" అని రమ

ముఖాన్ని ఒక్క క్షణం చూచాడు రమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

ఈ దృశ్యాన్ని చూస్తూ ఉన్న మొదటి ఉద్యోగి, రెండవ ఉద్యోగిని "హమీద్! సిగరెట్టు ఇవ్వరా" అని అడిగాడు హమీద్ కంటనీరు తుడుచుకుంటూ 'ఒరే! నువ్వు మనిషివి కాదూ! మిషన్ పుత్రా?' అని ఏవగించుకొన్నాడు

మొదటిఉద్యోగి చేతి బెత్తం ఊపుతూ బొమ్మల్లే నిల్చున్నాడు! ఇద్దరు ఇన్‌స్పెక్టర్లూ, ప్రభాకరం మెల్లిగా అడుగు సాగారు. గేటుదాటేసరికి రమ ప్రభాకరం, పిల్లలు చుట్టూ జనం గుంపులు గుంపులుగా చేరారు.

బయట భూతంలాగా నిల్చుని ఉన్న లారీలో ప్రభాకరాన్ని ఎక్కించారు అటూ ఇటూ సాయుధులైన పోలీసులు నిల్చున్నారు

ప్రభాకరం పిల్లల వంక చూస్తూ నిల్చున్నాడు

రమ రెండడుగులు ముందుకు వేసే సరికి లారీ ప్రక్కకు తిరిగి పోయింది ప్రభాకరం వంకే చూస్తున్న ప్రజలు జయజయధ్వానాలు చేస్తున్నారు.

చుట్టుపక్కలవాళ్లు, అక్కడ గుమికూడిన కూలినాలి చేసుకునే పాటకజనం, పట్టపగలు ఇట్లా అన్యాయంగా, కారణమైనా చెప్పలేనప్పుడు ప్రజలకు తల్లో నాలుకలాగా, చేదోడువాదోడుగా ఉండే ప్రభాకరాన్ని పట్టుకపోవడం అన్యాయమని అసహ్యించుకుంటున్నారు

ఒకరు : శాసనం! — దేశరక్షణ శాసనం, ప్రజాసేవకుల నిర్బంధించను చేశారట

మరొకరు : "దేశం మేలుకేనట — ఈ దుర్మార్గం!"

లారీచక్రాల గరగర వినిపిస్తున్నది

ఆ గుంపులో ఇంకొకరు "వీళ్ళు మనుషులు కాదు మరలరా"

"ఒక్క రమకేకాదు—ప్రజలందరికీ" లారీచక్రాల గరగర దూర దూరంగా వినిపిస్తున్నది. వాళ్ళకు ప్రభాకరం ఇంకా కళ్ళకు కట్టినట్టున్నాడు!

అంతరిక్షంలో ఎగిరే అరుణపతాక— ప్రజలందరి హృదయాల్లో ఆశారేఖల విరజిమ్ముతూ, రీవిగా ముందు దారి చూపుతున్నట్టు, రమ్మని వేయిచేతులతో పిలుస్తున్నది!

బానిసల కథ

'శ్రీ విజయ్'

కత్తిబట్టిన ప్రజల
వాళ్ళు నరికేవాళ్ళు
రాజ్యాలు గెలిచినా
రాళ్ళ నేలాలిరా ।

నాయకుల కంఠరాలు
నులిమి వేసిన నేడు
దీపాలు సూపినా
తీరమెక్కదు నావ ।

గుడిలోని లింగాలె
గుడిని మింగిన నాడు
రక్షణా శాసనం
భక్షణోపాసనే ।

" అవ్వ రాట్నం వడికి
అలసి పోయిందట ।
పాప తన నీడకై
పరువు లెత్తాడట ।"

కథ కంచికీ
గువ్వ
పొదరింటికీ ...

2

బానిసలు పోరారు
మానవత్వం కొరకు
మానవులె పగవారి
సేనలో జేరారు ।

తెల్ల రాకాసులకి
తంతివెళ్ళిందీ,
మానవుల జాతినే
మసిజేసినారు ।

"చదరంగమున రాజు
చిక్కులో పడ్డాడు
ఆట మరచిన సాని
వోడంది మద్దెలను"
కథ కంచికీ
గువ్వ
పొదరింటికీ.

3

సెలయేటి అలకూడ
చెప్పినది యీకథలు;
తనదారిపొడుగునా
నరులు నౌకర్లేట ।
సెలయేటి గుండెలో
శల్యాల పోగులే
నరుల రక్తం నాళ
నాళాన చూపింది;
పరతంత్ర ముక్తికై
తనదరిని బలియైన
దాస దాసీ జనపు
బాస లివియే నంది ।
"పంజరంలో చిలుక
బ్రతుకు కలవడి పోయి
తలుపు తెరచిన నాడు
గిలగిలా గింజుకొనె "
కథ కంచికీ
గువ్వ
పొదరింటికీ.

కావ్య ప్రయోజనం

శ్రీ కనకదండి గోపాలకృష్ణ శాస్త్రి

మానవుడు మొట్టమొదట పశువు అయే పుడుతున్నాడు. కాని—పరమేశ్వరుడు మానవ పశుసామాన్యమైన శక్తులన్నిటికంటె మానవునికి బుద్ధిని అధికంగా యిచ్చాడు. ఈబుద్ధిసహాయం వల్ల మానవుడు పశుత్వాన్ని విడిచి మానవత్వంలోకి మేలుకొని, మానవత్వాన్ని అతిక్రమించడానికి ప్రయత్నించడమే జీవితంయొక్క పరమావధి.

పశువులా జన్మించినా — పరిసరంయొక్క బలంవల్ల బుద్ధిని విజృంభింపచేసికొంటూ పరివర్తనాన్ని పొందుతాడు

శిశువుపొందే పరివర్తనాన్ని చూస్తున్నాము. శిశువు ఆహారం తీసుకొనడం మొదలు సమస్తాన్ని పరిసర బలంవల్ల నేర్చుకొంటున్నాడు. అంటే — తన బుద్ధిని క్రమంగా వికసింపచేసుకుంటున్నాడు క్రమంగా తనకిష్టమైన ఆహారాదులు "నాకుకావాలి ఉండాలి" అవి సంపాదించుకుంటున్నాడు. కాని—పరిసరంలోనుండి తనకు అవి ఎలారావాలి? ఏ అర్హత, అధికారంవల్ల వస్తాయి? పరిసరానికి తనఅవసరాలని తీర్చడంలో గల బాధ్యతఏమిటి? వీనికన్నింటికి సమన్వయం ఎక్కడ? అనేదృష్టి లేకుండా, కేవలం స్వార్థపరత్వంతో పూర్తిగానిండిపోయి వుంటాడు. కనుక ఇంకా అతడు మానవుడు అనిపించుకోలేడు. ఆస్వార్ధపరత్వాన్ని విడిచి, తోడిమానవుని కష్టసుఖాలలో భాగస్వామి అయి, వారు తన కష్టసుఖాలలో భాగస్వాములు అయేలా చేసుకోవడం నేర్చుకోవాలి. అప్పుడు మానవుడు అవడం నేర్చుకున్న వాడవుతాడు

అయితే — పశుత్వము, మానవత్వము, మానవత్వమును అతిక్రమించడము అను ఈ మూడు అవస్థలకీ ఇక్కడనుండి ఇక్కడికి ఈ అవస్థఅని నిర్ణయించడానికి, భేదాన్ని నిరూపించడానికి స్పష్టమయిన సూత్రాలు లేకపోయినా — అనుభవంలో అందరికీ తెలిసిన విషయమే.

అయితే — ఈ మూడు అవస్థలు మానవునియందు బాల్య, యౌవన, కౌమారాల్లాగ ఒకటి అయాక మరియొకటి క్రమంగా వస్తూండే పరిణామములవంటివికావు. ఈ మూడూ జీవితం పొడుగునా ఎప్పుడూ వుండేవే అంటే— జీవితం పొడుగునా ప్రతివ్యక్తీ ఒకొక్కప్పుడు పశువు, ఇంకొకప్పుడు మానవత్వాన్ని అతిక్రమించినవాడు. మరొకప్పుడు మానవుడు క్రమరహితంగా అవుతూనే వుంటాడు.

మానవత్వాన్ని నేర్చుకున్నాడంటే— తనదగ్గరనుండి తన కుటుంబము, తన

గ్రామము, తన దేశము, సమస్త ప్రపంచమువరకు తనకష్ట సుఖాలను ఇతరులకు పంచుతూ, ఇతరుల కష్టసుఖాలను తాను పంచుకొంటూ ఉంటాడు. అలాగే తుదకు పోయినవాడు — మానవత్వాన్ని పొందినవాడు — ప్రపంచంనుండి తన దేశము, తన గ్రామము, తన కుటుంబము, తానువఱకు దిగిపోతూ ఉండడం కూడా ఒక్కొక్క స్థితిలో అవసరమవుతూ ఉంటుంది. అటూ, ఇటూ, కూడా మానసిక పరివర్తనం అవసరము. మనో వైశాల్యం లేకపోవడం వల్లనే స్వార్థపరత్వం వస్తుంది. మానవత్వమన్నా, నాగరికత అన్నా ఇదే.

కొన్ని జంతువులకేనా, పక్షులకేనా కొద్ది అహారాన్ని పడవేస్తే ఒకదాన్ని ఒకటి తన్నుకొని, పొడుచుకొని, తినడానికి ఎలా ప్రయత్నిస్తాయో మన మెరుగుదుము మానవుడయితే ఎలా ప్రయత్నించాలో, ప్రయత్నిస్తూన్నాడో మనకి తెలుసు

ఇక — ఈ మనోవైశాల్యానికి — బుద్ధి వికాసానికి — పరిసరం ఒకసహాయము. అంటే — ప్రకృతి, తోడి మానవుల ప్రవృత్తి నివృత్తులు చూచి నేర్చుకోడానికి కొంత సహాయపడతాయి

రెండు: సాహిత్యము. ఇది ఎలా తోడ్పడుతుంది అనేది ఆలోచించి పరిశీలించవలసిన ఒక సాధన

సృష్టిలోని చేతనాచేతనాత్మకమైన ప్రతి పదార్థము మనోభావములు, వాని పరస్పర సంఘర్షణములు సర్వావస్థల్లోను నిత్య నూతనంగా కనబడుతూ చేసే అనిర్వచనీయ మయిన మహానందాన్ని అనుభవింపగల ఒక దివ్యశక్తి మానవత్వాన్ని అతిక్రమించిన మానవుని హృదయానికి అలవడుతుంది. అది ఏకారణం వల్లనో కొలది వ్యక్తులకు మాత్రమే కలుగుతూ ఉండడం, విజృంభిస్తూ ఉండడము చూస్తూ ఉన్నాము. ఆలాంటిశక్తి కలవాణ్ణే కవి, ఋషి, ద్రష్ట అని వ్యవహరిస్తూన్నాము.

కవి రమణీయమైన ప్రకృతినీ, ప్రకృతిలోని సన్నివేశాలనీ చూచి ఆనందించి తన భావనా బలంవల్ల వాని సౌందర్యాన్ని రెట్టించి రెట్టించి మహానందాన్ని పొందుతూ ఉంటాడు.

అంతేకాదు - తోడిమానవులు కూడా తామా ప్రకృతి సన్నివేశాలని చూచినా, చూడక పోయినా తానసుభవించిన మహానందాన్ని అనుభవించాలనీ, దాని వల్ల తనకొక మహానందం రావాలనీ, పట్టుదలతో కవి తాను ఏ ప్రకృతి సన్నివేశాలను చూడడంవల్ల మహానందాన్ని పొందగలిగాడో, వానిని తన భావనా బలంవల్ల పునః పునః భావించి, ఉదాత్త పరచి దాన్ని స్ఫురింపజేసే ఆ ప్రకృతి సన్నివేశాలలోని ప్రధానాంశాలని శబ్ద రూపంలో చెప్తాడు దీనినే కవిత్వం, కావ్యం, సాహిత్యం అని వ్యవహరిస్తున్నారు ఇంచు మించు ఇవన్నీ పర్యాయాలననచ్చును

తాననుభవించిన మహానందాన్ని తోడి మానవులుకూడా అనుభవించక పోతే సహించలేడు కవి అందరు కూడా అనుభవించాలి అసలు - కవి ప్రకృతిలోని సన్నివేశాలని చూచి భావించి భావించి మహానందాన్ని పొంది

అక్కడితో ఊరుకోకుండా వాగ్రూపంలో దాన్ని ప్రకటించడం కోసం ప్రయత్నించడం ఎందుకోసం? ప్రయోజనం ఏమిటి? అంటే — సకల మానవహృదయాలకి వికాసం కలగజేసి, మహానందాన్ని పంచిపెట్టడం కోసం, దానివల్ల మళ్ళీ తానొక మహానందాన్ని పొందడం కోసమూను కవికీ ఇవే పరమప్రయోజనాలు. కవితకీ ఇవే ప్రయోజనాలు. స్వార్థరహితత్వమే కాకుండా స్వార్థం కూడా కవిని ఈ పనిలోకి పురికొలుపుతోంది అన్నమాట.

సహృదయుడు కవి భావనా బలంవల్ల ఉదాత్త పరచబడి, శబ్ద రూపంగా వ్యక్తీకరింపబడిన ఆ సన్నివేశాలని తన భావనలో విస్తృతి చేసికొంటే — అవి ప్రత్యక్షమయి కవి అనుభవించిన మహానందాన్ని సహృదయునికి కలుగచేస్తాయి ఈ పనిని సహృదయుడు మిక్కిలి జాగరూకతతో శ్రద్ధతో చేయాలి. లేకపోతే విఫలుడవడమే కాకుండా, ఒక్కొక్కప్పుడు కవిని నిందింపవలసిన వాడు కూడా అవుతాడు

ఇక్కడే ఉంది సునిశితంగా గ్రహించవలసిన మహాచిత్రం

అన్నానికి మొగంవాచి గుప్పెడు మెతుకులకు దీనంగా యాచిస్తూ జీర్ణవసనాలని ధరించి కృశించి ప్రతిద్వారానికి వీధిలో తిరుగుతున్న అనాధబాలికను, శుకమిధునంలాగ తీర్చిదిద్దినట్లుండి, మహావేశంతో శరీరం మరచిపోయి, ఉద్యానమధ్యంలో విహరిస్తూన్న యువతీయువకులను, పర్వతశిఖరం మీద చెట్లమరుగు నుండి మెల్లగా ఆకాశంపైకి వస్తున్న ఎర్రని పెద్ద చంద్రబింబమును చూచినప్పుడు కవీ, సామాన్యమానవుడుకూడా కన్నీరు విడిచిపెడతారు; పులకలు తొడుగుతారు ఏదో అవ్యక్తానందాన్ని పొందుతారు

కాని, సామాన్యమానవునిదృక్పథంలో నుండి దృశ్యంతొలగిపోగానే దానితో సంబంధం కూడా తొలగిపోతుంది. అయినాసరే — వానిమనస్సుమీద ఒక సందేశాన్ని ముద్రించి ఒక విక్రియను పుట్టిస్తుంది. ఆ సన్నివేశంలోని తీవ్రతను బట్టి మానవుని మానసికబలాన్ని బట్టి ఆ సందేశానికి దార్ఢ్యము, విక్రియకి సాంద్రత ఉంటాయి

కవి విషయంలో మాత్రం అల్లాకాదు. దృశ్యం దృక్పథంలోనుండి తొలగిపోయినా కూడా, తరువాత కవి తన భావనాబలంవల్ల దృశ్యాన్ని చిత్రించుకొని, చాలాకాలం మననం చేసి మహానందాన్ని పొందడంవల్ల ఆ సందేశం హృదయం మీద దృఢంగా పడుతుంది. విక్రియకూడా సాంద్రతమంగా ఉంటుంది. సందేశంవల్ల, విక్రియవల్ల కలిగే ఫలితాన్ని ఆనందరూపంలోకి పరిణమింపచేసికొంటాడు. అంతటితో ఊరుకోలేడు తనకి మహానందాన్ని ఇచ్చిన ఆ సన్నివేశాలని భావనాబలంవల్ల మరల మరల మననంచేసి, ఉదాత్తపరచి, దీనివల్ల కలగబోయే చిత్తవృత్తులు ఆనందరూపంలోనే భాసించేలాగున శబ్దరూపంగా ఇస్తాడు.

అయితే — లోకంలో చూస్తూఉండే సన్నివేశాలవల్లనూ, కవి భావనాబలంవల్ల ఉదాత్తపరుపబడిన సన్నివేశాల

ఎల్లనూ, కలుగుతూఉండే ఆనందంలో భేదం ఏమిటీ అనే విషయం తెలిసికో దగినది మాత్రం ఔను

లోకంలోని సన్నివేశాలు ఇంద్రియ ప్రవృత్తి కాలంలోమాత్రమే తీవ్రతతో హృదయానికి తాకి, సందేశాన్ని కొలది బలంతోనే ముద్రించి సుఖదుఃఖాలని యథాతథంగా కలిగించి ఇంద్రియ నివృత్తితో అంతమయిపోతాయి.

కావ్యంలోని సంఘటనలు ఇంద్రియ ప్రవృత్తి నిరపేక్షంగా, మృదువుగా, చిన్నగా హృదయానికి తాకి, భావనా బలంవల్ల ప్రపంచితములయి. సందేశాన్ని ఎన్నోరెట్లు తీవ్రతతో ముద్రించి, సుఖదుఃఖాలని ఆనందరూపంలోనే భాసింపజేస్తాయి భావనాబలాన్ని బట్టి స్థిరత్వానికి న్యూనాధికతలు ఉంటాయి

అసలు — మనస్సు ఒక చిత్రమయిన పదార్థం. మనస్సు ఒక సన్నివేశంవల్ల స్పందించినప్పుడు వెంటనే ఆగిపోదు ఆ స్పందనవల్ల. మరియొక స్ఫురణ కలుగుతుంది దానివల్ల మరొకటి, మరొకటి, మరొకటి. భావనాబలాన్ని అనుసరించి ఎడతెగకుండా అలా కలుగుతూనే ఉంటాయి. సామాన్యంగా ఈ స్ఫురణలు ఒకదానితో నొకటి సంబంధించియే ఉండి. సజాతీయములు కాతూ ఉంటాయి ఒక్కొక్కప్పుడు "ఒక దానివల్ల మరొకటి కలగడం" అనే సంబంధం తప్ప మరి ఏ సంబంధం లేకుండా విజాతీయమయిన స్ఫురణలు కూడా కలుగుతూ ఉంటాయి బుద్ధి వైశాల్యమన్నా, మనోవికాసం అన్నా ఇలాంటిస్ఫురణలు అనంతంగా నిరంతరంగా కలుగుతూ ఉండడమే.

అందువల్ల లోకంలోని సన్నివేశం కంటె, కవి భావనాబలంవల్ల ఉదాత్తపరుపబడిన సన్నివేశము హృదయానికి తాకగానే తీవ్రంగా పనిచేస్తుంది. అనంతమయిన స్ఫురణలను రేకెత్తిస్తుంది. ఈ స్ఫురణలన్నీ మనస్సుకి తీవ్రతని కలిగించి, ఆసందేశాన్ని కార్యరూపంలోకి తేగలిగేలాగ, తెచ్చేదాకా ఊరుకొని ఉండలేకుండేలాగ చేస్తాయి.

"అయ్యో! ఆ మఱ్ఱిచెట్టుకిందకే బాటసారులందరూఎప్పుడూవెళ్ళిసుఖంగా విశ్రమిస్తూ ఉంటారు. కొమ్మలమీద ఆకులలో దాగి, కాయలు తింటూ, ఎన్నో పక్షులు కిలకిలారావాలు చేస్తూఉంటాయి. నా దగ్గరకు ఎవ్వరూ చేరరు, ఏమి యోగము?" అని తుమ్మచెట్టు అనుకుంటూ ఉన్నట్లు కవి చిత్రించాడు. ఈ పద్యం వినగానే సహృదయుడు మనస్సులో సన్నివేశాన్ని చిత్రించుకుంటాడు. కవి తీవ్రంగా భావించినదవడంవల్ల సన్నివేశం మళ్ళీ ఉదాత్తతని పొంది మహాసందేశాన్ని ఇస్తోంది. తరువాత హృదయబలాన్నిబట్టి స్ఫురణలు అనంతంగా కలుగుతాయి. హృదయం మీద సందేశాన్నికూడా ముద్రిస్తుంది. ఈ చెట్టు ఇలా మాట్లాడడం అసంభవమని లోతుకిపోతాడు. వ్యర్థజీవియొక్క సంతాపమని స్పష్టంగా గోచరిస్తుంది. వ్యర్థజీవితం ఎంత నీచమయినదనీ, ఎంత దుర్భరమయినదనీ, తన కెప్పుడూ వ్యర్థజీవితం వలదనీ, ఇతరుల కెందరికీకూడా ఉండకూడదనీ, అందుకు ప్రయత్నించాలనీ, అందులో

అందరూ కూడా పాల్గొనాలనీ — ఇలాగ స్ఫురణలు అనంతంగా కలుగుతాయి.

సామాన్యంగా వ్యర్థజీవితాన్నీ, తుమ్మ చెట్టునీ అందరూ చూస్తూనే ఉన్నా, అందరి హృదయాలమీదా అవి చేసేపని తక్కువ. కవి హృదయంమీద ఆ సన్నివేశాలు అధికంగా పనిచేశాయి అందుకే కవి ఆ సన్నివేశాలని భావించి మహానందమగ్నుడు అయి, దానిని ఉద్దీపరిచి చక్కని వర్ణపద చమత్కృతులతో ఏదో మహాశక్తిని కలిపి కవిత్వంగా లోకానికి ఇచ్చాడు.

నిర్మలమయిన సరోవరోదకంలో — ఎంత లలితంగానేనా స్పందింప గలిగినంత నిర్మలమయినది — ఒక చిన్న రాతిని విసిరినప్పుడు ఆ దెబ్బ అన్ని వైపులకీ తరంగశ్రేణులను అనంతంగా కల్పించినట్లు సముద్రంలా పరుచుకుపోయి, నిర్మలము, ప్రశాంతము అయిన కవి హృదయంమీద ఎంత సామాన్యమయిన ప్రకృతి సన్నివేశాలయినా — అనంతమయిన స్ఫురణ పరంపరలని కలగజేయడం సకల హృదయ హృదయాలకీ అనుభవసిద్ధమే

ఒక విషయం మాత్రం మరిచిపోవడానికి వీలులేదు కవి ఆనందపరిణతి నిచ్చి వాగ్రూపంలో ప్రజానీకానికి అందజేసే ఈ సన్నివేశాలు, ఈ మానసిక భావాలు ఈ ప్రపంచంలోనివే; ఈ సామాన్య మానవులవే. అందేతనే— వానిని కవి తన దివ్యప్రతిభతో మిళితం చేసి తన వ్యక్తిత్వంతో చూపడమూ, సహృదయుడికి అవి ఏకొద్దిగానో అనుభవంలో ఉండడమూ-ఈ రెండూ కలిసే-కవితకి ఇలాంటి అపూర్వ సామర్థ్యాన్ని ఇస్తున్నాయి.

అయితే కవి ప్రతిక్షణం ఈ ప్రపంచంలో తటస్థించే సన్నివేశాలలో వేనిని గ్రహిస్తూంటాడు అనేదికూడా ఒక చిత్రమయిన సమస్య.

ప్రాణి సామాన్యానికి సమానమయిన లక్షణాలు అన్నింటికీ ఉన్నా, క్రిమి కీటకాదులు మొదలు మనుష్యుని వరకు అన్నీ తమ తమ జాతిలక్షణాల ప్రత్యేకతని కలిగి ఉంటూన్నట్లు, మానవ సమాన లక్షణాలుమానవులందరికీఉన్నా, ప్రతివ్యక్తీ కొన్ని లక్షణాలతో తన ప్రత్యేకతని కలిగి ఉంటూన్నాడు వ్యక్తిత్వం అంటే యిదే. ప్రతివ్యక్తికీ అతనికి ఇష్టమయిన వస్తువులు వేరు. ఆతని అభిరుచులు వేరు. అతని అభ్యాసములు వేరు ఇంత ఎందుకు-ప్రతివ్యక్తి సమస్తంలోను ఒక ప్రత్యేకతను కనబరుస్తూ ఉంటుంది, ఒకని తత్వం కులాసా ఒకని తత్వం బెంగ. ఒకని తత్వం దుఃఖం ఒకని తత్వం ఏమిటో? అందరికీ తెలిసినదే యీ అనుభవం

తన పరిసరంలో కవి నిత్యము, ప్రతిక్షణము అనేక సన్నివేశాలని ఎదుర్కొంటూ ఉంటాడు కాని—నిరంతరంగాను, తీవ్రంగాను హృదయానికి తాకేవానిని, తన అభిరుచికి, ఆదర్శాలకి తత్వానికి అనుకూలములయిన వానిని సన్నివేశాలనీ, మానసికభావాలనీ కవి సామాన్యంగా గ్రహిస్తూఉంటాడు. అవే సామాన్యంగా కవి హృదయంలో ప్రధానస్థానాన్ని ఆక్రమిస్తూ ఉంటాయి అంతేకాకుండా -వీనివల్ల కలిగే అనంత

మయిన స్ఫురణలలో కూడా కొన్ని నిలిచిపోయి ప్రధాన స్థానానికి వొస్తూ ఉంటాయి కాని—ఈస్ఫురణలు-కారణ మయిన లోకంలోనిసన్నివేశాలకి సంబంధించినవే అవుతూ వుండడంవల్ల సజాతీయాలే అవుతూవున్నా, ఒక్కొక్కప్పుడు సంబంధం ఏమీలేనట్లు విజాతీయ మయినవికూడా కలుగుతూ వుండడం కలదు

ఒక విషాద సంఘటన కవి దృష్టిని ఆకర్షించినప్పుడు — అతని హృదయానికి తాకినప్పుడు — దానివల్లకలిగే స్ఫురణలలో కొన్ని శృంగారానికి సంబధించినవికూడా ఉండవచ్చు. అవే కవిహృదయాన్ని వశం చేసుకొని ప్రధానస్థానం ఆక్రమించవచ్చు. అనుభవైక వేద్యమయిన విషయమయినా — సత్యమయిన విషయం మాత్రంకాను.

కవి హృదయాన్ని ఆక్రమించిన ఇలాంటి సన్నివేశాలనీ, స్ఫురణనీ మాత్రమే కవి భావనలో ఉదాత్తపరచి వాగ్రూపంలో ప్రపంచానికి ఇస్తాడు,

ఇంతకీ - ప్రకృతి సన్నివేశాలు, వానివల్ల కలిగే స్ఫురణలు కవి భావనలో నడబోతను — ఉదాత్తతను — పొందుతున్నాయంటే — అవి ప్రత్యేకతను విడిచి సాధారణతను పొందుతున్నాయి అన్నమాట. ఇంకా చెప్పాలంటే — ప్రత్యేక వ్యక్తులకు సంభవించిన సన్నివేశాలు సకలజన సాధారణాలు అయే లాగ కవి తనప్రతిభా విశేషంవల్ల చేస్తాడు. కవి, సహృదయులుకూడా సన్నివేశంతో ఐక్యతను పొంది ఒక అవస్థలో తామే సన్నివేశంలోని వ్యక్తులయిపోతూ ఉంటారు. అంచేత భావన వల్ల సన్నివేశాలు ప్రత్యగ్రతని పొందుతాయి. ఇందుమూలాన్నే — సన్నివేశంలోని ప్రతివిషయమూ ఆనందమయంగా పరిణతినిపొంది ఆనందాన్ని కలుగజేస్తుంది. అంతతః — సన్నివేశంలోని ఆనందప్రత్యగ్రతలవల్ల అది హృదయానికి హత్తుకొనిపోయి, సందేశాన్ని ముద్రించి దాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు ఉన్ముఖుడయేలాగ ప్రోత్సహిస్తుంది.

ముఖ్యంగా-కార్యప్రవణతకి—కార్యోన్ముఖత్వానికి - మనస్సుయొక్క పరివర్తనం చాలా అవసరం

శాసనం—ఆచరించేవాడికి ఇష్టంఉన్నా లేకపోయినా నిర్బంధించి బలవంతాన్ని కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది. మనః పరివర్తనం లేకపోవడంవల్ల ఆ కార్యం యొక్క ఫలితం ఎంత క్షేమకరంగా ఉంటుందో, ఎంతబలంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇంత మాత్రంచేత శాసనంయొక్క అవసరం, ఉపయోగం లేదనిమాత్రం దీని అభిప్రాయంకాదు.

హితుల బోధలవల్ల కూడా — అంత సుముఖుడు కాకపోయినా ఉన్ముఖుడు అవడానికి—కార్యావసరం, మొగమాటం పరిసరభీతి మొదలయిన వానిప్రాబల్యం బాగా పనిచేస్తుంది.

కవిత హృదయాన్ని మహానందంతో ముంచెత్తి, శుద్ధిచేసి, సాత్వికపరచి సందేశాన్ని ముద్రించడంవల్ల అలాంటి హృదయంతో సందేశంలోని హితత్వాన్ని గ్రహించి, సయుక్తికంగ తనంతటతానే బద్ధుడయి, కార్యాచర

జకి ఉన్ముఖుడవుతాడు. నిజంగా మానవుడులా వుండడాన్ని నేర్చుకొన్నవాడు అవుతాడు. ఇది ఇలా చెయ్యాలి, అది అలాచెయ్యాలి, కూడదు అనిశాసించకుండా— ఎలాచెయ్యాలో ఎందుకు చెయ్యాలో, ఎందుకు కూడదో వూహించుకొని కార్యప్రవణుడవటానికి, సత్యాన్ని గ్రహించడానికి హృదయాన్ని స్వాతికపరచి, సన్నివేశాన్ని మాత్రమే ఇవ్వడంచేత సందేశాన్ని ఎంతో బలంగా గ్రహించగలిగేలా చేస్తోంది కవిత. కాని— కవిత్వం అన్ని హృదయాలమీద ఒక్కలా పనిచెయ్యలేకపోతోంది సహృదయుని బుద్ధిబలాన్ని, వికాసాన్ని బట్టి వుంటోంది. సహృదయునికి కొంత బుద్ధివికాసమేనా ఉంటేనేగాని, కవిత బాగా పనిచేయలేదు కవిలో ప్రతిభ వుండవలసినట్టుగానే, సహృదయునిలో బుద్ధివికాసంకూడా కొంతవరకు అవసరం పరిచయంవల్లనే ఇదిలబిస్తుంది అందువల్ల బలవంతంగా కూడా కొంత వరకు కవితాపరిచయం ప్రజానీకానికి చాలాఅవసరంలాగ కనబడుతుంది.

> "కావ్యం యశసే ర్థకృతే వ్యవహార
> విదే శివేతర క్షతయే
> సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మిత
> తయోపదేశయుజే"

"యశస్సు, ధనము, వ్యవహార జ్ఞానము అమంగళ నాశనము తాత్కాలిక పరమసుఖము, ప్రియురాలివలె ఉపదేశము నిచ్చుట కావ్య ప్రయోజనములు" అని ప్రాచీనాలంకారికులు అన్నారు

మనిషికి భౌతికశరీరం వృద్ధిపొందాలంటే ఆహారం, నీరు, గాలి ఎలాగ తప్పని అవసరాలో అలాగే, భౌతిక శరీరానికి చోదకమయిన మనస్సుకికూడా సాహిత్యపరిచయం చాలా అవసరం.

అడుగడుగునా మహా క్లిష్టసమస్యలను ఎదుర్కొంటూ సహించలేక నలిగిపోతూ మహాంధకారంలో దేవులాడే ప్రజానీకానికి ఒక జ్యోతినిచూపి, ప్రతి మానవుడు "నేను మానవుణ్ణి" అని మేలుకోడానికి శంఖారావాన్ని ఊదేవాడు కవి ఒక్కడే. వాని సందేశాలే దారిచూపుతాయి

ప్రపంచానికిఅభ్యుదయాన్ని కోరియే- మహాద్రష్టలు ఋషులు వేద మంత్రాలు ఉచ్చరించారు. ఉపనిషత్తులు గానం చేశారు

మహాకవులు వాల్మీకి, వ్యాసుడు నాటి పరిసరంలోని ఎన్నో సన్నివేశాలని రామాయణ మహాభారతాలుగా రచించి అమరసందేశాన్ని చాటించారు.

కాళిదాసాదులు మహాకావ్యాలు, నాటకాలు మొదలయినవాని నెన్నింటినో మానవుని మానవత్వంలోకి మేలుకొలుపడానికి అందించారు.

> "పశ్యేమశరదశ్శతం
> జీవేమశరదశ్శతం
> నందామశరదశ్శతం
> మోదామశరదశ్శతం
> భవామశరదశ్శతం
> శృణవామశరదశ్శతం
> ప్రబ్రవామశరదశ్శతం
> అజీతాస్యామశరదశ్శతం
> జ్యోక్చ సూర్యం దృశే॥

అంధుడై, వ్యాధిగ్రస్తుడై ఎన్నో బాధలు పడ్డప్పటికీ “నేను ఎంతో సుఖజీవిని”

ఎస్. త్రిగోవ్

12 ఏండ్లు వచ్చేటప్పటికి ఆస్ట్రోవస్కీ 1919 లో రెడ్ - ఆర్మీలో వాలంటీరుగా చేరాడు. పదిహేనో ఏట రష్యా అంతర్యుద్ధంలో పాల్గొన్నాడు. తర్వాత మూడు సంవత్సరాలకు 'కీవ్' రైలు మార్గాన్ని నిర్మిస్తుండగా ఆయనకు జబ్బు చేసింది. బలహీనత, పక్షవాతం, క్రమంగా కీళ్ళ జబ్బువచ్చి, చూపుకూడా పోయింది. అయినా, ఎట్లాగైనా తన దేశానికి సేవచెయ్యాలనే దృఢసంకల్పంతో రచన చెయ్యడం మొదలుపెట్టాడు 'హవ్‌స్టీల్‌వాజ్ టెంపర్డ్'అనే ఆయన నవల్లో ఒక విప్లవకారుడి జీవితాన్ని చిత్రించాడు ఆకథలో నాయకుడు 'కోర్షెయిన్' తన జీవితాన్ని ప్రపంచంలోకల్లా ఉత్తమ కృషికి - పీడిత ప్రజా దాస్య విముక్తికి అర్పిస్తాడు.

1935లో ఆస్ట్రోవస్కీకి 'లెనిన్ పతకాన్ని' బహూకరించారు

1936 డిశంబరు22 న మరణించాడు ఆయన చెప్పిన 'నికొలాయ్ ఆస్ట్రోవస్కీ' నవల నిత్యమూ లక్షలాది ప్రజలు చదువుతూంటారు. 'హవ్ స్టీల్ వాజ్ టెంపర్డ్' అనేది ఆయన ప్రసిద్ధ నవల. ఈ నవలనుగూర్చి పాఠకులు వారివారి రాజకీయ స్థాయికి అనుగుణంగా భిన్న భిన్న అభిప్రాయాలు కలిగి ఉండొచ్చు కాని, అందరూ ఆస్ట్రోవస్కీ రచనలో స్వార్థంలేకుండా ఉన్నతాశయసిద్ధికోసం నిరంతరం పోరాటాలు సాగిస్తూ శ్రమించే రష్యన్ విప్లవకారుణ్ణి ఆదర్శప్రాయంగా చిత్రించాడని అంగీకరిస్తారు.

మృత్యువుతో సమరం

ఆస్ట్రోవస్కీ తన రచనల్లో తన జీవితానుభవాలనే చిత్రించాడు. నవలలోని సంఘటనలు, ఆయన జీవిత విశేషాలని తరచు పాఠకులు అనుకోవడంలో అసత్యం ఏమీలేదు ఈ రచయితకున్న సహనమూ, ఆశయాలకోసం పోరాడాలనే పట్టుదలా, ఉత్సాహమూ, ఉద్వేగమూ, ఈయన సృష్టించిన కథా నాయకుడు 'కోర్షెయిన్'లో తీర్చిదిద్దినట్లు కనిపిస్తుంది నిరంతరం వ్యాధిగ్రస్తుడై బాధలు పడుతూనే మృత్యువును జయించి, కోర్షెయిన్, ఆస్ట్రోవస్కీలాగానే జీవితాన్ని పునరుజ్జీవింప జేసుకుంటాడు అనంతమైన కార్యరంగంలోకి అడుగు పెడతాడు

ప్రసిద్ధ ఫ్రెంచిసాహిత్యవేత్త 'రోమా రోలా' ఆస్ట్రోవస్కీకి ఒకలేఖలో ఇలా వ్రాశాడు "నీజీవితంలో నీవు ఎన్నో కష్టాలు, బాధలు అజ్ఞాతంగా అనుభవిస్తున్నప్పటికి అవి వేలాది ప్రజలకు దీపికలై దారిచూపుతున్నై. మృత్యువుతో

నిత్యం సమరం సాగించే లక్షలాది ప్రపంచ ప్రజాకోటికి నీజీవిత విశేషాలు గుణపాఠాలవుతున్నై. కష్టాలతో కాకలు తీరిన నీజీవితం, పటిమా, అచంచల విశ్వాసం, విముక్తులై స్వతంత్రజీవితం గడుపుతున్న మీ ప్రజా జీవితంలో ఒక భాగంగావుంది అజేయులైన నీదేశీయుల అమరచరిత్రలో నీదొకఘట్టం. నీ కోఉంది నీదేశం"

బ్రతకాలనే ఆకాంక్షతో ప్రభుత్వాన్ని తమహస్తగతం చేసుకున్న ప్రజల త్యాగపటిమ, అమోఘమైన వారిసంఘటితశక్తినీ తన రచనలో ప్రస్ఫుటం చేశాడు ఆస్ట్రోవస్కీ

ఇంకా రెండునెలలకు చనిపోతాడనగా 'ప్రవదా' విలేఖరి ఆయన్ను కలుసుకున్నాడు. అప్పట్లో ఆస్ట్రావస్కీ 'బారన్ అవ్ ద స్టారమ్' అనేనవల వ్రాస్తున్నాడు. విలేఖరి అడిగినప్రశ్నకు జవాబుచెప్తూ ఆయన "నేను ఎవేవి వ్రాయాలనుకున్నానో నీకు చెప్పాలంటే వాటివిషయం మాట్లాడుతూ నన్నునేనే మరచిపోవాల్సి వస్తుంది. నీకు ఆశ్చర్యం కలుగుతుందికూడా ఇప్పుడు వ్రాస్తున్న నవలకాక, పిల్లలకు ప్రత్యేకంగా ఒకటి వ్రాయాలనివుంది 'కోర్షయిన్ సుఖపడుతాడు' అని ఇంకోనవల వ్రాయాలి ఇతివృత్తం నామొదటి నవలకు ఒక రకంగా అనుబంధంగా వుంటుంది అన్నాడు.

కళాతృష్ణ

"అన్నింటికన్నా నాకు ఎంతో ఇంకా చదవాలని గాఢమైన కోరికఉంది మేధస్సును ఎంతో వికసింప జేసుకోవాలి. తుదిక్షణం వరకూ ఎన్నోవిషయాలు తెలుసుకుంటూ, ఎంతో కృషిచెయ్యాలి. ఇదేమంత క్లిష్టమైనవిషయంకూడా కాదు. పెంపొందాలంటే చదవటం ఎంతో అవసరం. నా కోర్కెలన్నీ తీరాలంటే కనీసము నేను పది సంవత్సరాలైనా ఇంకా జీవించాలి

నిజం చెప్పాలంటే అందరికన్నా ఎక్కువకాలం బ్రతకాలని నాకోరిక. మన దేశంలో జీవితంఎంతో సుఖమయంగా, అనుభవయోగ్యంగా ఉంది" అనికూడా ఆయనే చెప్పాడు।

దైహికంగా ఆస్ట్రావస్కీ చాలాబలహీనుడు. వ్యాధులతో ఎన్నోబాధలు పడ్డాడు పాములాంటి మృత్యువు పడగ క్రిందనే ఆయన పడక. అయినా ఆయన మృత్యువును ఎంతో అసహ్యించుకొనేవాడు చావంటే లెఖ్కచెయ్యకుండా సంతోషంగా కృషి సాగించాడు.

తనలో ఉండే శక్తులన్నింటినీ వికసింపజేసుకొని తన సోదర ప్రజలకు సేవచెయ్యడంకంటే మానవుడికి మరో సుఖం ప్రపంచంలో లేదనీ, ఇట్లా బ్రతికి ఉన్నప్పుడేకాదు, చనిపోయిన తర్వాత కూడా సేవ చెయ్యగలుగుతాడనీ పదేపదే చెప్పేవాడు అసమానమైన తన కృషిద్వారా, ఆయన ఈనాటికీ ప్రజాసేవ చేస్తూనే ఉన్నాడు। ఆయన చనిపోయి పదేళ్ళయినప్పటికీ, ఇప్పటికీ ఆయన కృషి ఫలం ప్రజలు అనుభవించనిరోజు ఒక్కటికూడాలేదు.

రెండో నవల వ్రాసేటప్పుడు ఆయన "మనయువకుల్లో ధైర్య స్థైర్యాలను,

ధర్మనిరతిని, గాఢంగా పెంపొందించాలి నిస్పృహ, నిరాశ ఆవరించుకున్నప్పటికీ మనసైనికుడు ధైర్యంగా దానిని భేదించుక రాగలిగేట్టు చెయ్యాలి కుతుకలో ఊపిరి ఉన్నంతవరకూ 'ఓటమి' అనేది మనకు ఉండకూడదు. ఇది నా దృఢనిశ్చయం. ఈఆశయానికి నా జీవితాన్ని ప్రాకారంగా నిర్మిస్తాను నా కలాన్ని ఇందుకే వినియోగిస్తాను" అన్నాడు.

కమ్యూనిజం ఆయువుపట్టు

ఆస్ట్రొవస్కీ మంచి గుండెకలవాడు ఆయన సాహస కృత్యాలు ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటుంటారు కాని ఆయన రచనల్లో ధీరలక్షణం ఒక్కటే ప్రత్యేకంగా కనబడదు. అది జీవితంలో మిళితమై ఉంటుంది. ఉద్వేగ రచనలన్నింటిలోనూ చావులేని, చావని ధైర్యశాలురు కనిపిస్తారు చావును జయించే సంజీవిలాగా ఉంటుంది జీవిత చిత్రణ ఈ పటుత్వం. ఈ ఉత్తమ ఆశయాలన్నింటికీ ఆయువుపట్టు ఆయన కమ్యూనిస్టు దృక్పథమే। కమ్యూనిస్టు చైతన్యం ఆయనలో అభివృద్ధి చెందిన కొద్దీ భావన విశాలమై, సమృద్ధమైంది. కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికే ఆయన కలాన్నీ, బలాన్నీ అంకితం చేశాడు

కమ్యూనిస్టు ఆశయంలో ఆయన విశ్వాసం ఏమాత్రం సడలినప్పటికీ, దుస్సహమైన దైహిక బలహీనతకు లోనై, రచన సాగించేవాడే కాదు. తన ఉన్నతాశయానికై రచన సాగించబట్టే, రచన చేస్తూ దైహిక బాధలను మరచిపోగలిగాడు.

1936 అక్టోబరు నెల్లో ఒక ఇంగ్లిషు పత్రికా విలేఖరి ఆస్ట్రొవస్కీని కలుసుకొని, "కమ్యూనిస్టు కాకపోయినా మీరు ఉత్తమ రచయిత కాగలిగే వారే కదా!" అంటే - ఆయన ఇట్లా చెప్పాడు: "కమ్యూనిస్టును కాకపోతే రచయిత అయ్యేవాణ్ణే కాదు!"

ఆస్ట్రొవస్కీ సృష్టించిన కోర్చాగిన్ పాత్రలాగానే ఆయన నిరంతరం శ్రమించే కమ్యూనిస్టు. కమ్యూనిస్టు సహచరులందరికీ సీసమెత్తు తీసిపోకుండా ఆయన కార్యక్రమం కొనసాగించేవాడు.

"ధైర్య, శౌర్యాలకు — రహస్య జీవితం గడుపుతూ, విప్లవకార్యక్రమం కొనసాగించే కమ్యూనిస్టులే నాకు ఆదర్శం" అని ఆయన వ్యక్తంచేశాడు. జారు చక్రవర్తుల ముష్కర పరిపాలనలో బోల్షివిజాన్ని తుడిచిపెట్టాలని జైళ్ళు, తుపాకులు, దేశాంతరవాసం, ఉరిశిక్షలు, ఉక్కుచట్టాలు విచ్చలవిడిగా ప్రవేశపెట్టబడినప్పటికీ సత్యంకోసం, న్యాయమైన హక్కులకోసం, కోటానుకోట్ల ప్రజల సుఖమయ జీవనం కోసం బోల్షివిక్కులు అడుగడుగునా అగ్నిజ్వాలలకు ఆహుతి అవుతూనే తమ కృషి సాగించారు విజయం తథ్యమనే అచంచల విశ్వాసం ఈ విప్లవకారులకుంది. దేశాన్ని రాక్షస రాచరికం నుంచి విముక్తంచేసి, భూతలస్వర్గంగానిర్మించుకోగలమనే నమ్మకంతో వెనకడుగు వెయ్యకుండా ముందుకు నడిచారు.

ఆ విశ్వాసమే ఆస్త్రొవస్కీ చూపుల్లో, పలుకుల్లో, నడకలో కనిపిస్తుంది. ఒక్క రష్యన్ జీవితాన్నే కాదు - ఈయన స్పెయిన్, చైనా ప్రజల పోరాటాలను అర్థంచేసుకొని వాటికి తనరచనలో జీవం పోశాడు

సుఖమంటే ఏమిటి ?

ప్రపంచంలో సుఖాన్ని, ఆనందాన్ని ఇచ్చేవి ఎన్నోఉన్నై. తన కుటుంబ సౌఖ్యంకోసం, తనసౌఖ్యంకోసం పాటుబడేవాళ్ళు కొందరుంటారు. తనొక్కడికోసం ఈసుందరజగత్తు నిర్మించబడిందనే సంకుచితదృష్టి కొందరికి ఉంటుంది.

సత్యం కోసం, న్యాయం కోసం, మానవత్వంకోసం, తోటి కోటాను కోట్ల సోదర మానవుల సుఖమయ జీవితం కోసం, తనసర్వస్వం త్యాగంచేసి, కృషి చేసేవాళ్ళు కొందరుంటారు — ఆస్త్రొవస్కీ ఈవర్గానికి చెందిన రచయిత.

75 సంవత్సరాలనాటిమాట. కారల్ మార్క్స్‌ను 'కుమార్తె' 'సుఖమంటే ఏమిటి ?' అని అడిగితే, ఆయన 'పోరాటం' అని జవాబు చెప్పాడు. ఈ మనకుకూడాఇదేలక్ష్యం. విషాదమయ జీవితం ఏదంటే — కృషి, పోరాటం, సాగించే దార్ఢ్యతలేని జీవితం" అనేవాడు ఆయన ఏదో ఒక్క క్షణంలో ధీరుడైన వ్యక్తికాదు. అంధత్వం, పక్షవాతం, దైహిక బాధలతో పోరిపోరి సానలు తీరిన యోధుడు. జీవితాంతం వరకూ విప్లవ కార్యాచరణలో నిమగ్నుడై 'తన్నుతాను మరచి' చైతన్యవంతులైన ప్రజలతో శ్రుతి కలిపాడు

ఆస్త్రొవస్కీ, కోర్నెయిన్‌లను చూస్తే స్టాలిన్ ఒకసారి—"ప్రజలు ఎన్నికష్టాలు వచ్చినప్పటికీ తుపానుమధ్యలో ఉన్నప్పటికీ, గాలికి రేగిన ఆకులులాగా కలత పడకూడదు. తుఫానులో సైతం నట్టనడి సముద్రంలోనుంచి తమ నావ నడుపుక పోయేట్టుండాలి" అన్నమాటల్లో చెప్పిన నైతికబలం గలిగిన వ్యక్తులు స్ఫురణకు వస్తారు ఎన్నోకష్టాలు. అంతరాయాలూ దాటుకొని తన తెప్పను దరికి చేర్చాడు ఈ రచయిత కష్టాల వల్ల ఆయన మనస్సు ఏమాత్రం చలించలేదు. కాగా అవి ఆయన సున్నితమైన మనస్సుకు ఎంతో పదును పెట్టినైకూడా.

ఆస్త్రొవస్కీ జీవితం, రచనలు, సోవియట్ల రాజ్యాంగ నీతికే వన్నెలు దిద్దుతున్నై ఆయన రచనలు చదివిన దేశంలో ఈ తరంలో కొషిరాయ్, జినియా, జోయాలవంటి పదహారేండ్ల వీరులు ఊరూరా ఎందరో ఉన్నారు.

ఈ యుద్ధంలో నాజీ నరహంతల నెదిరించి, అజేయమై నిలిచిన రష్యాకు ఆస్త్రొవస్కీవంటి రచయితలే జీవం !

★

రేపు మనది!

శ్రీ 'మురళి'

స్వార్థపరులు కొందరు ఈ
లోకంలో కట్టుకొన్న
అంతస్థుల అట్టడుగున
మగ్గుతున్న మానవులారా!

ఎన్నాళ్ళిటు అట్టడుగున
చిక్కి చిక్కి చివికి చివికి
శిథిలమైన జీవితాలు
జీవింతురు యుగయుగాలు?

యుద్ధాల్లో మీ ప్రాణాలు
గొప్పోరికి సోపానం
యుగ యుగాల మీకష్టం
జగతి గడచుటకు మూలం॥

కాలం లోకాలకు మీరే నోయ్
జీవం జీవం జీవాలకు మీరేనోయ్
గడువను క్షణమైనగాని
కాలం మీరుండనిచో॥

రండీ ఓ మానవులారా
లెండీ ఓ మానవులారా
ఎన్నాళ్ళీ కష్టాలిటు
తెలుసుకోండి! మీశక్తి——

వాళ్ళిచ్చిన వన్యాయం
పండిన పాపపు భువనాల్
పునాదులే బ్రద్దలుగా
కూల్చి లేచి నిలువండీ!

కట్టండీ ఆనేలన
వెనుక ఒకరికిచ్చిన మీ
చెమటతోడ, మీకొరకై
నిత్యమంగళాలయముల్॥

మార్చండీ ఈభువినే
మనకై ఒక స్వర్గంగా!
'నిన్న' గడచిపోయిందిక
'రేపు' మనది లేలెండోయ్!

శబ్ద ప్రపంచం

శ్రీ డి. ఏ. ఏ. ఎస్. నా యణరావు

"......యౌవనగుణాలయ వీణియ మీటుచున్ దినాయాసముదీర్ప నిర్జన వనాంతర సీమల నబ్బెనేని వహ్వా! సులతాను భోగవిభవంబుల గోరెడి మూఢుడుండునే!

వీణియ నిస్వనాలు ఏవో హృదయ తంత్రులను మీటుతూ హాయిని కూరుస్తాయి ఆ హాయిలో దినాయాసాన్నే కాదు; ప్రపంచాన్నే మరచిపోవచ్చును కోయిల కుహూ కుహూరావాలు కవుల హృదయాన్ని కలవరపరుస్తాయి. విరహానుతప్తుల గుండెలను చీలుస్తాయి. సన్నిహితంగా ఉన్న ప్రేయసీ ప్రియులకైతే ఉత్సాహాన్ని ఇనుమడింప చేస్తాయి. శబ్దంలోని మధురిమ కవులను, ప్రేమానురాగులనే కాదు. పిచ్చివాండ్రను, రోగులను కీటకాదులను కూడ ఉత్సాహపరుస్తుంది మధురమైన సంగీతంద్వారా మనస్సుకి హాయిని కూరుస్తూ వుంటే, కొన్ని మానసిక రోగాలు కుదుటబడటానికి, భౌతిక రోగాలుకూడ మనస్సు ఉత్సాహంగా ఉండటంమూలాన్న త్వరగా తగ్గటానికి, అవకాశా లున్నాయి. పాములవాడు నాగస్వరం అలాపిస్తుంటే నాగుపాము తన దుష్టత్వాన్నికూడ మరచిపోయి, ఆమధురిమలో లీనమైపోతుంది. తేనెటీగలు దోమల ఝంకారములు మన చెవికింపును గూర్చినా, కూర్చకపోయినా వానిప్రియుల నాకర్షించడానికి నికి వస్తాయి కృత్రిమంగా ఝంకారాన్ని పుట్టించి ప్రేమావేశులయిన దోమల నాకర్షించి మోసపుచ్చ గలుగుతున్నారు శాస్త్రజ్ఞులు. అన్నిరకముల జీవులను ఆకర్షించగలిగిన, ఉత్సాహ పరచగల్గిన, ఈ శబ్దం ఏమిటి? ఎలా ఉద్భవిస్తుంది?

శబ్దమన్నది వస్తువు యొక్క స్పందనం (Oscillation) వల్ల కలుగుతుంది ఒక ఊయల అటూ ఇటూ ఊగడాన్ని స్పందించడం అంటారు. ఊయల మధ్యనుండి బయలుదేరి ఒక చివరికివెళ్ళి అక్కడినుండి రెండవ చివరికి వెళ్ళి, మళ్ళా మధ్యకు వచ్చినప్పుడు ఒకస్పందనం లేక ఆందోళనం చేసిందంటారు. ఊయల ఒకస్పందనం చెయ్యడానికి పదిపదిహేను సెకండ్లు పట్టవచ్చును ఇలా మెల్లగా కాక, కొన్ని వస్తువులుజోరుగా స్పందిస్తూ వుండవచ్చును ఒకవస్తువు స్పందించునపుడు అది సెకండుకు ఎన్నిమారులు స్పందిస్తుందో ఆసంఖ్యను పౌనఃపున్యము (Frequency) అంటారు సెకండుకి వందసార్లు స్పందిస్తే పౌనఃపున్యము నూరు ఒకచోట శబ్దముద్భవిస్తుంటే అక్కడ ఏదో వస్తువు అతి జోరుగా స్పందిస్తూంది అనవచ్చును. శబ్దమంటే వస్తుస్పందనమే. స్పందనమే లేకపోతే శబ్దమేలేదు. వస్తువు స్పందిస్తున్నపుడు

అది మామూలు చోటినుండి ముందొక ప్రక్కకు, తరువాత ఇంకొకప్రక్కకు వెడుతుందికద. అది మామూలు చోటి నుండి ఒకప్రక్కకువెళ్ళే అత్యధిక దూరాన్ని స్పందనపరిమితి (Amptitude) అంటారు.

ఒకబిందెను ఏ గళానుతోనో తట్టి నపుడు ఒకశబ్దంపుడుతుందిబిందెనుండి. దానికి కారణం ఆ బిందెరేకు స్పందించడమే బిందెను చేతితో ముట్టుకుంటే స్పందనం ఆగిపోతుంది. అందువల్లనే గళాను తగడంవల్ల వచ్చిన శబ్దం వెంటనే ఆగిపోతుంది ఊయల స్పందిస్తున్నప్పుడు అది అటూ ఇటూ కదలడం కంటికి స్పష్టంగా అగపడుతుంది. కాని బిందెరేకు అటూ ఇటూ ఊగులాడడం అగపడలేదే అని అడగవచ్చు కొందరు బిందెరేకు స్పందిస్తున్నప్పుడు అది అటూ ఇటూ ఎక్కువదూరం కదలదు అతి కొద్దిగా కదులుతుంది. కంటికి కనపడనంత కొద్దిదూరం అటూ ఇటూ కదులుతుంది ఊయల స్పందనానికి దీని స్పందనానికీ ఇంకోభేదం ఉంది. ఊయల అంతాకూడా అటూఇటూ కదులుతుంది బిందె అడుగు భాగం కదలదు అంచులవద్ద ఎక్కువగా స్పందిస్తుంది బిందె వేరువేరు భాగాలు వేరువేరు దూరాలు స్పందిస్తాయి స్పందనపు పరిమితి అతి తక్కువగా — అంగుళంలో కోటవవంతు భాగం — ఉన్నాసరే, శబ్దం వినపడుతుంది.

ఏదేనా వస్తువు స్పందిస్తున్నప్పుడు అది సెకండుకి చేసేస్పందనములు లేక పౌనఃపున్యము 20 కి పైనున్నప్పుడే అది కలుగజేసిన శబ్దాన్ని మన శ్రవణేంద్రియము గ్రహించగలదు మళ్ళా పౌనఃపున్యం దరిదాపు 20,000 కు మించినప్పుడు శబ్దమేమీ వినబడదు వస్తువులు వేరువేరు పౌనఃపున్యాలతో స్పందించగల శక్తి కలిగి ఉండవచ్చును. కాని వాటి పౌనఃపున్యము సుమారు 20 కి 20 000 కి మధ్యగానున్నప్పుడే మన శ్రవణేంద్రియము ఆ వస్తువుల నుండి శబ్దముద్భవిస్తున్నట్లు గ్రహిస్తుంది వస్తువు ఇతర పౌనఃపున్యాలతో స్పందిస్తున్నప్పుడు శ్రవణేంద్రియము గ్రహించగల శబ్దమేమీ ఉండదు

శబ్దముద్భవిస్తున్నప్పుడు దాని తీక్ష్ణత (Intensity) చాలా కొద్దిగా ఉన్నా, చెవి దానిని గ్రహించగలదు తీక్ష్ణత, అంటే శబ్దంలో ఎక్కువ తక్కువలు, స్పందనపు పరిమితిని బట్టి ఉంటుంది. స్పందనపు పరిమితి ఎక్కువగా ఉంటే, తీక్ష్ణత ఎక్కువగా ఉంటుంది, అంటే శబ్దం పెద్దగా వినపడుతుంది. తీక్ష్ణత ఒక హద్దును దాటి మరీతక్కువగా ఉన్నట్లయితే చెవి దానిని గ్రహించలేదు. స్పందనపు పరిమితి అంగుళంలో కోటవవంతు భాగమున్నా, చెవి ఆశబ్దాన్ని వినగలదు. అంతకంటే బాగా తక్కువగా ఉంటే వినలేదు ఆ చిన్నశబ్దానికి లక్షకోట్లరెట్ల పెద్దశబ్దాన్నికూడా వినగలదు కాని తీక్ష్ణత అంతకంటె ఎక్కువయినప్పుడు చెవి దానిని వినలేదు. అంత పెద్దశబ్దం చెవిలో ఒకవైపు ఒత్తిడిని విపరీతంగా ఎక్కువచేసి, పోటును కలుగచేస్తుంది అంతేగాని అది చెవిచే శబ్దంగా గ్రహింపబడదు.

శబ్దము అనేక పౌనఃపున్యాలలో ఉండగలదు కదా వేరువేరు పౌనః పున్యాలుగల శబ్దాలు చెవిచే వేరువేరుగా గ్రహింపబడతాయి. చెవికి కొన్ని పౌనః పున్యాల శబ్దంమీద పక్షపాతముంది. 1000 – 4000 మధ్య పౌనఃపున్యాలు గల శబ్దాలను చెవి అతిసుఖవుగా గ్రహిస్తుంది. పౌనఃపున్యం 1000 కంటెబాగా తగ్గుతున్న ప్పుడు, ఎక్కువ తీక్షత ఉంటే గాని, చెవిచే గ్రహింపబడదు. అలాగే పౌనః పున్యం 4000 కంటె హెచ్చుతున్నప్పుడుకూడా తీక్షత ఎక్కువ ఉంటేగాని గ్రహించబడదు.

సంగీత పరికరణాలలో వీణ, ఫిడేలు మొదలయినవి కొన్ని ఒక తీగను మీటడంవలన శబ్దాన్నిస్తున్నాయి. తీగను బిగించి మీటడంవలన అదిస్పందిస్తుంది. అది ఏ పౌనః పున్యంతో స్పందిస్తుం దన్నది దాని పొడవును, బిగింపును, బరువునుబట్టి ఉంటుంది. పొడవుతక్కువయితే దాని పౌనఃపున్యం ఎక్కువగా ఉంటుంది. వేరు వేరు రకాలుగ తీగలను మీటడంవలన వేరు వేరు పౌనః పున్యాలతో శబ్దాలను సృజించ వచ్చును. పౌనః పున్యం హెచ్చినపుడు స్థాయి (pitch) హెచ్చుతుంది అలా వేరువేరు స్థాయిల శబ్దాలను సృజించ వచ్చును. తీగకలిగించే శబ్దం చాలా తక్కువగా ఉంటుంది. కాని తీగ బిగించబడిన కట్టె పెట్టె అంతలోనుకూడా బలవంతపు స్పందనాలు ప్రేరేపింప బడతాయి. అది అంతాకూడా స్పందించి శబ్దాన్ని ఎక్కువగా కలుగ చేస్తుంది.

మద్దెల, డప్పు మొదలయిన కొన్ని పరికరణాలతో తోలు చర్మం స్పందించి శబ్దాన్ని కలుగచేస్తుంది. బాకా, ఫ్లూటు మొదలయిన పరికరణాలలో గాలిని ఊదుతూ, గొట్టంలోని గాలినిస్పందింప చేస్తారు. ఆ స్పందిస్తున్న గాలి భాగం పొడవును మారుస్తూ వేరు వేరు పౌనః పున్యాల శబ్దాలను కలుగచేస్తారు. ఇలాగ తీగలనో, రేకులనో, గొట్టాలనో, గాలినో స్పందింప చేయడం వలన శబ్దాలను పుట్టించవచ్చును.

మనిషి తన గొంతుక నుండి శబ్దాన్ని కలుగ చేయడంలో స్వర తంత్రులు (Vocal cords) అనేవి రెండు సహాయపడుతున్నాయి. ఇవి కంఠభాగంలో ఉంటాయి. ఊపిరితిత్తుల నుండి వచ్చే గాలిప్రవాహం ఈతంత్రుల మధ్యగానున్న సన్నని దారిగుండా వస్తూ వీటిని స్పందింప చేస్తుంది. ఇవి స్పందిస్తూ ఆ ప్రాంతంలోనున్న గాలిని స్పందింప చేస్తాయి. అలాగ గొంతుక ప్రాంతంలో శబ్దోత్పత్తి జరుగుతూంది. స్వరతంత్రులలో బిగింపును అక్కడి కండరాలు మార్పగలవు. ఆ బిగింపు మారడంవలన వేరు వేరు పౌనఃపున్యాల శబ్దాలురాగలవు. స్త్రీ స్వరం పురుషస్వరం కంటె హెచ్చుస్థాయిలో ఉంటుంది. దీనికి కారణం స్త్రీల స్వరతంత్రులు పొట్టిగా ఉండటమే. చిన్నపిల్లల స్వర తంత్రులుకూడా పొట్టిగా ఉండడం వలన వారిస్వరం హెచ్చుస్థాయిలో ఉంటుంది. మగవాని స్వరంలో చాలమట్టుకు శబ్దం 120 ప్రాంతాల పౌనః పున్యం కలిగి ఉంటుంది. స్త్రీ స్వరంలో పౌనఃపున్యం దరిదాపు దీనికి రెట్టింపుంటుంది. స్త్రీ

స్వరం ఎక్కువ పౌనఃపున్యం కలిగి ఉండుటచేత పురుషుని శ్రవణేంద్రియానికి ఇంపుగా ఉండడమేకాక, ఎక్కువ సుళువుగా గ్రహింపబడేదిగా కూడా ఉంటుంది. అందువలన స్త్రీ మాట్లాడినపుడుగాని, పాడినపుడుగాని అందరికీ వినబడడాన్ని మగవానికంటె తక్కువ శక్తితో సాధిస్తుందన్నమాట. బలలకు ప్రకృతి కూడా సాయపడుతూంది.

ఒకచోట వస్తు ప్రకంపనంవలన శబ్దోత్పత్తి జరిగినప్పుడు అది నలుదిక్కులా వ్యాపించి దూరాన్నున్న శ్రవణేంద్రియాలచే గ్రహింపబడడం చూస్తున్నాము. శబ్దంఎలా వ్యాపిస్తుంది అన్న విషయం తెలిసికోదగ్గది ఒకచోటినుండి ఇంకొకచోటికి శబ్దం వ్యాపించడానికి మధ్యలో ఒక యానం (medium) ఏదో పదార్థం ఉండడం ముఖ్యం సాధారణంగా గాలి ద్వారా శబ్దం ప్రయాణం చెయ్యడం మనం చూస్తున్నాము శాస్త్రజ్ఞులు ఒక గాజు పాత్రలోనుండి పంపులద్వారా గాలినంతా పైకితీసేసి అందులో కొట్టుకుంటున్న ఎలెక్ట్రిక్ బెల్‌పుట్టించే శబ్దం పైకి వినబడదని చూపెట్టేరు ఏ యానం లేక పదార్థం లేకపోతే శబ్దం వ్యాపించలేదు. కాంతి శూన్యంలోనుండి కూడా ప్రయాణం చెయ్యగలదు కాని, శబ్దం ఏదో ఒక యానంగుండానే ప్రయాణం చెయ్యగలదు. శబ్దం గాలిలోనుండే కాక నీటిలోనుండి, లోహాలలోనుండి, ద్రవాలలోనుండిఅనేకరకాలైనపదార్థాలగుండా ప్రయాణం చెయ్యగలదు.

శబ్దం ఒక పదార్థంగుండా ప్రయాణం చేసినపుడు అది ఏ వేగంతో చెయ్యగలదన్న దాన్ని శాస్త్రజ్ఞులు పరిశీలించారు. గాలిలో అది సెకండుకి సుమారు 1100 అడుగులు ప్రయాణం చేస్తుంది కాంతి సెకండుకి 186000 మైళ్ళు ప్రయాణం చేస్తుంది. ఈ రెండింటి వేగాలకి ఎంత తేడాఉందో! మేఘాల సంఘర్షణవలన శబ్దం, కాంతి ఒక్కమారు పుడతాయి కాని మెరుపును మనం ముందుగా చూస్తాము తరువాత కొన్ని సెకండ్లకి పిడుగు శబ్దాన్ని వింటాము శబ్దం మెల్లగా ప్రయాణం చెయ్యడమే దీనికి కారణం ఈ మెఱుపు, పిడుగులు మన దగ్గరకు వచ్చే మధ్య కాలమెంతో కొలిస్తే, ఆ మేఘాల సంఘర్షణ మనకెంత దూరంగా కలిగిందో లెక్క కట్ట వచ్చును.

శబ్దం గాలిలోకంటె నీటిలోను, లోహాలలోను ఎక్కువ వేగంతో ప్రయాణం చేస్తుంది. గాలిలోకంటె, నీటిలో సుమారు ఐదురెట్లెక్కువ వేగంతోను, ఇనుములో 16 రెట్లెక్కువ వేగంతోను ప్రయాణం చేస్తుంది. ఒక పొడుగు ఇనపకడ్డీ చివర నొకడు చప్పుడుచేసి, రెండవచివర నొకడు వింటూంటే, ముందుగా లోహంగుండా ప్రయాణం చేసిన శబ్దం వినపడుతుంది. తరువాత గాలిలోనుండి ప్రయాణం చేసిన శబ్దం వినబడుతుంది. యానాన్ని బట్టి శబ్దం వేగం ఇలా ఎక్కువగా మారుతుంది

వస్తువు ప్రకంపించినపుడు చుట్టూ ఉన్నగాలిలో కొన్ని మార్పులు వస్తాయి. ఆ మార్పులద్వారానే శబ్దం వ్యాపిస్తుంది. వస్తుప్రకంపనవల్ల గాలిలో

కూడా ఒక కదలిక వ్యాపిస్తుంది వస్తువు కదలడంవలన దాని ప్రక్కనున్న గాలి ఒకచోట గుమిగూడుతుంది. కాని, ఆ ప్రక్కన గాలి పలచబడి పోవడం మూలాన్న అక్కడి నుండి కదలిపోయి పల్చబడిపోతుంది. ప్రక్కను మరొకచోట గుమిగూడు తుంది. మళ్ళా అక్కడ పల్చబడిపోయి, ఆ ప్రక్కను గుమిగూడుతుంది. ఇలాగ ఈ కదలిక త్వరత్వరగా సెకండులో 1100 అడుగుల దూరం వ్యాపిస్తుంది. గాలిలోని ఈ మార్పులే శబ్దవ్యాప్తి.

గాలిలోని ఈ మార్పులు చెవిదాకా వచ్చేటప్పటికి చెవిలో టింపానమ్ (tympanum) అనే పొర పీటి కను గుణ్యంగా స్పందిస్తుంది. దాని ప్రకంప నలు ఒక ఎముకద్వారా లోపలి చెవికి వెళ్ళి అక్కడి నాడులను ప్రేరేపిస్తాయి. నాడులలోని ప్రేరేపణలను మెదడు శబ్దంగా గ్రహిస్తుంది. ఒక చెవి పని చేయక ఒకేచెవి పనిచేసినా, శబ్దం విన బడుతుంది కాని అది ఏదిక్కునుండి వస్తూందో గ్రహించలేము. రెండు చెవులద్వారా శబ్దాన్ని వన్నప్పుడు అది ఏ దిక్కునుండి వస్తూందో గ్రహించే శక్తి కలుగుతూంది మెదడుకి

స్పందనాన్ని గ్రహించడంలోనే శ్రవణశక్తి ఇమిడివుంది. టింపానమ్ అన్న పొర బ్రద్దలయితే, స్పందనము లోపలిచెవికి వెళ్ళలేదు కనుక శబ్దాన్ని చెవితో వినడంపడదు. కాని చెమిటివారు కొంత తర్ఫీదుతో శబ్దాన్ని పళ్ళద్వారా వినవచ్చును. బిథోవెను అను ఇంగ్లీషు సంగీతకుడు జీవితంలో చాలాకాలం బ్రహ్మ చెముడు కలిగిఉండేవాడు. కాని సంగీతపరికరణానికి అనివున్న చేతి కర్రను తన పళ్ళమధ్య నొక్కడం ద్వారా అతడు శబ్దాన్ని వినేవాడు. అతడు ఎన్నోపాటలు వ్రాసి ఇంగ్లీషు సంగీ తంలో చిరస్థాయమైన పేరు గణించు కొన్నాడు

సంగీతస్వరాలు చెవి కింపుగా ఉండి ఆహ్లాదాన్ని కలుగజేసే శక్తి కలిగి ఉండగా, బడబడధ్వనులు కర్ణకఠోరం గాను, బాధాకరంగాను ఉంటాయి. అప శ్రుతులతోగాడి తీక్షణంగాఉండేధ్వనులు వినడానికి చికాకుగా ఉండడమేకాక, మనిషిని నిరుత్సాహపరుస్తాయి. ఫాక్టరీ లలో కార్మికుల చురుకుదనము అక్కడి యంత్రాలు పుట్టించే ధ్వనివలన తగ్గి పోతూందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. పెద్దపెద్ద పట్టణాలలో యంత్రాలవలన వచ్చే ధ్వనిని తగ్గించడానికి కృషి చేయ బడుతూంది.

ప్రకంపిస్తున్నవస్తువు పౌనఃపున్యము 20 కి 20000 కి మధ్యగా నున్నప్పుడు మాత్రమే మనశ్రవణేంద్రియము శబ్దాన్ని వినగలదని ఇదివరకు తెలిసికొన్నాము. కాని పౌనఃపున్యం 20000 కి ఎక్కు వగా ఉన్నప్పుడు మనకు వినబడని శబ్దతరంగాలు వ్యాపిస్తాయి వాటిని అశ్రవణశబ్దతరంగాలు (ultrasonic waves) అనవచ్చును పౌనఃపున్యం చాలా హెచ్చినపుడు వందకోట్లకి దాటి నపుడు వానిని హైపర్ సానిక్సు (Hypersonics) అంటారు. ఈ తరం గాలలో శబ్దాన్ని మన శ్రవణేంద్రియం గ్రహించలేదు.

క్వార్ట్జ్, టూర్మలిన్ అనే స్ఫటికాలు (crystals) ఒక అసాధారణగుణం కలిగి ఉన్నాయి. వాటిని గట్టిగా నొక్కితే వానిలో కొద్దిగా విద్యుత్తు పుడుతుంది. దానిని పీడన విద్యుత్తు (Piezo electricity) అంటారు. నొక్కడానికి బదులు వానిని విద్యుత్పరికరణాలతో కలిపి, విద్యుత్ప్రవాహంలో కొన్ని మార్పులు తెస్తే, అవి స్పందిస్తాయి అలాగ విద్యుత్ప్రవాహంలో మార్పులద్వారా వాటిని స్పందింప చేస్తే. పౌనఃపున్యము సెకండుకి లక్షలు. కోట్ల ప్రాంతంలో ఉంటుంది పౌనఃపున్యం ఆ స్ఫటికం దళసరినిబట్టి ఉంటుంది. వాటిమూలంగా అలాగ అశ్రవణ శబ్దతరంగాల నుద్భవింపచేయ డానికి వీలవుతూంది.

ఈ తరంగాలు శ్రవణానికి ఉపయోగ పడకపోయినా ఇంకా అనేక విధాలుగా ఉపయోగ పడుతున్నాయి. ఒక చోటి దృశ్యాల నింకొకచోట అగపడ చేసే టెలివిజనుకు ఇవి ఉపయోగ పడుతున్నాయి. ఇవి గాలిలో కంటె నీటిలో ఎక్కువ సుళువుగా ప్రయాణం చెయ్యగలవు. గాలిలో ప్రయాణం చేస్తూంటే వీటి తీక్ష్ణత త్వరలో తగ్గిపోతుంది. కాని నీటిలో అంత త్వరగా తగ్గిపోదు. ఈతరంగాలను సముద్రం నీటిలోకి పంపితే, వానిదారిలో మంచు గుట్టలుకాని, సబ్ మెరైనులుకాని ఉన్నప్పుడు ప్రతిఫలిస్తాయి. తరంగాల నొక చోట ఉద్భవింపచేసి ప్రసరింప చేసినప్పుడు, అవి ప్రతి ఫలనముద్వారా, అక్కడికే తిరిగి రావడానికి పట్టిన కాలాన్ని కొలవడంద్వారా, ప్రతిఫలిస్తున్న వస్తువు ఎంత దూరంలో ఉందో లెక్క కట్టవచ్చును. ఇలాగ ఇప్పుడు ఓడమార్గంలో మంచుగుట్టలు మొదలైన అడ్డంకులుంటే ముందుగానే తెలుసుకోడానికి వీలవుతూంది. యుద్ధనౌకలు ఈతరంగాల ఉపయోగంద్వారా శత్రువుల సబ్ మెరైనులు వస్తూంటే ముందుగా గుర్తించడానికి వీలవుతూంది ఈ తరంగాలను క్రిందివైపుకి పంపితే, సముద్రపు లోతును తెలిసికోడానికి వీలవుతూంది. నీటి అడుగున భూతలాన్ని తాకినపుడు ప్రతిఫలిస్తాయి. అవి ఓడదగ్గరకు తిరిగి రాడానికి పట్టిన కాలాన్ని కనుగొనడంద్వారా సముద్రం లోతు తెలుస్తుంది మామూలు శబ్దతరంగాలు కూడా పైచెప్పిన పనులకు కొంతవర కుపయోగ పడతాయికాని, ఈ అశ్రవణశబ్ద తరంగాలు ఎక్కువ నైపుణ్యంతో పని చేస్తాయి. కనుక ఇవే ఇప్పుడెక్కువ ఉపయోగంలో ఉన్నాయి. పెద్ద పెద్ద ఓడలన్నీ ఈతరంగాలను పుట్టించడానికి, పైపనులను చేయడానికి, అవసరమైన పరికరణాలన్నీ కలిగి ఉంటాయి.

ఈ అశ్రవణ శబ్దతరంగా లింకా అనేకపనుల కుపయోగ పడుతున్నాయి. లోహాలలో పగుళ్ళు ఉంటే వీటి మూలంగా తెలిసికోవచ్చును. కొన్ని లోహ మిశ్రమాలను (Alloys) తయారు చెయ్యడంలో ద్రవస్థితిలోఉన్న లోహాలలోకి ఈతరంగాలను పంపడంద్వారా వాటిని బాగా మిళితంచేసి, చల్లారిస్తే, మిశ్రమమంతా సమాన పక్కీలో బాగా వస్తుంది ద్రవాలలోఉన్న వాయువులను ఈతరంగాలవల్ల తరిమివేయ వచ్చునని

కూడా తెల్పిసింది లోహాలు ద్రవ స్థితిలోనుండి ఘనీభవిస్తున్నప్పుడు యీ తరంగాలద్వారా వానిలో నేమి వాయువులుండకుండా తరిమివేయడం వలన, ఆ లోహాలలో లోపాలేమీలేకుండా చేయవచ్చును. ఇంక లోహపరిశ్రమలో ఈతరంగాలెంతో ఉపయోగపడుతున్నాయి

ఈ తరంగాలు చిన్నచిన్న జీవాలను హతమారుస్తాయి. చిన్నచేపలు, కప్పలు ఉన్న కుండీలలోపని నీటిలోనికి ఈ తరంగాలను పంపితే అవి చనిపోయేయి రక్తకణాలుగూడ వీటివలన విభజింపబడిపోతాయి. ఈ తరంగాలమూలంగా పాలను క్రిమిరహితంచేసి శుభ్రపరచడానికి అవకాశాలున్నాయి.

శబ్దంగురించి తెలిసిన సంగతులన్నీ ఆలోచిస్తే, శబ్దమన్నది ఒకచలనశక్తి అని బోధపడుతూంది ఒకచోట ఒక ఒకవస్తువు చలనం కలిగి స్పందిస్తే, చుట్టూవున్న గాలికూడా చలిస్తుంది. అందుమూలంగా చెవిలోని పొరల నాడులు స్పందిస్తాయి స్పందించే వస్తువు చుట్టూవున్న వస్తువులను స్పందింపచేసే యీశక్తే శబ్దశక్తి. నాద మంటే చలనశక్తి. చలనమే ప్రకృతికి మూలం కనుకనే నాదాన్ని ప్రకృతికి ఆదిగా తీసుకున్నారు మన ప్రాచీన తత్వజ్ఞులు.

★

బానిసత్వం

శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలు

బానిసత్వంలోని బాధలన్నీ ఎరిగి
ఏల బ్రతకాలిరా బానిసల్లే నీవు ?

ఏడాది కొకసారి
ఏరువా కొస్తుంది
ఒక్కనాడయినాను
సౌఖ్యమెరిగున్నావ ? ॥బా॥

కాస్తకూ కూస్తకూ
కసరి కొట్టేదొరల
చిలిపి జీవాల, ఆ
కొలువు ఎన్నాళ్ళురా ? ॥బా॥

పాటుపడి పాటుపడి
పంట పండిస్తావు
కడుపు కాల్చుకునేటి
కర్మమే మొచ్చింది ॥బా॥

పాలకై ఏడ్చేటి
పాపణ్ణి వోదార్చు
ఇంటిలో యిల్లాలి
కంటనీరెన్నాళ్ళు ? ॥బా॥

నరకంకాళం

శ్రీ ముట్నూరు సంగమేశం

ఇది వికారావతార సంపద; రసమ్ము
పిండి విడిచిన పిప్పి; ఊపిరి విధించి
నిలువబెట్టిన బొమ్మ; ఎముకల పతాక;
ధనమదాంధుల రాజ్యవిధాన ఫలము.

ప్రభువు లిందరి మాంస సంపదలనెల్ల
చవులు మెచ్చుచు నోరార చప్పరించి,
పట్టి కలనెత్తు రాఖరిబొట్టు పిండి
త్రేన్పులురలంగ త్రావి సుదించినారు

నరపిశాచుల కియ్యది నాట్యశాల
అధికృతుల కాలితాపుల కాటబంతి,
ఎండవానల కిరవైన బండిగూడు
క్షుత్పిపాసలు వ్రేలాడు చూరుపట్టు.

నీటి సంపద నిండారు నేత్రయుగము.
కర్కశత్వమ్ము తొణుకారు కర్ణపుటము
వ్యధలు పదిలించుకొన్నట్టి హృదయపేటి
కలవు పిత్రార్జితము లిందు నిలచె నివియె॥

సవరణ 'అభ్యుదయ' మార్చి సంచిక 22 వ పేజీలో ప్రచురించబడిన 'జనులంతా నీవారలె!' అన్న గేయం శ్రీ మటిరెడ్డి వెంకటరంగయ్యగారు వ్రాశారు కాని, కొన్ని ప్రతుల్లో శ్రీ పూసపాటి నాగేశ్వరరావుగారు వ్రాసినట్లు పడింది; విషయసూచికలోను అలాగే పడింది. కాన పాఠకులు గమనించాలని ప్రార్థన.

— సంపాదకుడు, 'అభ్యుదయ'

కరువొచ్చింది

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

కరువొచ్చింది

పంటలు పండినా గింజలు కళ్ళాలు దాటగానే మాయమయినా కరువొచ్చింది

పైరు పచ్చగా పెరిగినప్పుడూ, కంకులు బరువుగా వొంగి తనను ఏపుగా పెంచిన భూదేవికి జోహారు చేసినప్పుడూ, బంగారుగింజలు కనకవర్షం లాగా జలజలా రాలినప్పుడూ, కళ్ళ పండువుగ చూసిన పేదప్రజకు కన్ను పొడుచుకున్నా గింజ కనిపించలేదు

రైతు కూలీల తపఃఫలితాన్ని గద్దలు తన్నుకుపోయినా కాటకం వచ్చింది

పేదప్రజలు అలజడిపడ్డారు గగ్గోలు పెట్టారు పళ్ళు పటపట కొరికారు నోళ్ళు తెరిచి, మూయటం మరిచిపోయినారు వాళ్ళ కళ్ళల్లో దైన్యమూ ఆశా, ఆగ్రహమూ, నిరాశా కనిపించి, ఆఖరుకు కళ్ళల్లోఉన్న దీపం కాస్తా ఆరి, కొడిగట్టింది.

చుట్టపుచూపుగా వచ్చిన మృత్యుదేవతకు చక్కని సన్మానం జరగటం వల్ల పోనీఅని ఉండిపోయి తన రాక మూలమూలలా తెలియజేసింది

బుద్ధిమంతులంతా చేరి పరిస్థితుల మీద తమ అసమ్మతి తెలియజేయడానికి బహిరంగసభ చేయాలని తీర్మానించారు ఇంటింటా పోయి ప్రచారం చేశారు చదువుకున్నవాళ్ళంతా ఉద్యమాన్ని బలపరిచి ఆశీర్వదించారు కరపత్రాలు పంచిపెట్టబడ్డాయి

కరువు పోగొట్టడానికి ఒక తాత్కాలిక సంఘం నియమించబడ్డది కార్యక్రమమంతా వారిచేతుల్లో ఉంచబడింది. ఈ సంఘం బహిరంగసభలు ఏర్పాటు చెయ్యడానికి పూనుకున్నది ప్రజలలో ఆశ రేకెత్తింది.

దేశంలో ఉన్న కవులూ, విజ్ఞానులూ, శాస్త్రవేత్తలూ, సంఘసంస్కర్తలూ, బీదవాళ్ళ ప్రతినిధులూ — వేలాదివేలుగా వచ్చి తాత్కాలికసంఘంలో చేరారు.

తిండిదొంగలే కరువుకు కారణమని అందరూ ఆమోదించారు "తిండిదొంగలు నశించాలి!" అనే నినాదం తాత్కాలిక సంఘంలో ఏకగ్రీవంగా ఆమోదించబడింది

ఈ ఆందోళన తిండిదొంగలకు నచ్చలేదు వాళ్ళు రాజకీయతంత్రాలన్నీ వినియోగపరిచి, కరువు నిర్మూలనోద్యమాన్ని అణచడానికి ప్రయత్నాలు ప్రారంభించారు కాని ఈ ఉద్యమం ఆగేది కాదు. దీనికి ప్రజలఅండ ఉంది

ఈసంగతి గ్రహించి తిండిదొంగలు కొత్తఎత్తు వేశారు జిత్తు పారింది విత్తు మొలిచింది అది విషపుచెట్టు

దాని విషఫలితాలు మొదటి బహిరంగ సభనాడే బయటపడ్డాయి.

ఈ బహిరంగసభకు పేదప్రజలు లక్షలాదిగా వచ్చారు — తమ విమోచన కొరకు జరిగే తీర్మానాలు చెవులారా విందామని.

అధ్యక్షుణ్ణి తాత్కాలిక సంఘ కార్యదర్శి సూచించాడు. మరెవరో ఆమోదించాడు. అధ్యక్షుడు లేచి నిలబడి "సోదరులారా! మనం ఇక్కడ ఎందుకు చేరామో మీరంతా ఎరుగుదురు. మనం ఇక్కడ జరపబోయే తీర్మానాలు సమాజ యొక్క శాంతి భద్రతలను పెంపొందించేవిగా ఉండాలి. సర్వేజనా స్సుఖినోభవంతు," అని కూర్చున్నాడు.

ఒక కవిగారు లేచి ఆకలిని తిడుతూ, కొన్ని పద్యాలు చదివాడు. మరో కవిగారు లేచి మృత్యువును తిడుతూ మరి కొన్ని పద్యాలు చదివాడు. అందరూ హర్షించారు. కాని పేదల ప్రతినిధులకిందులోని చమత్కారం అవగాహన కాలేదు. ఆకలిని తిట్టడందేనికి? ఆకలి లేకపోతే ఎట్లా? చావును తిట్టడం మాత్రం దేనికి? మనుష్యులు చావకుండా ఎట్లా?

అయినా వారు శాంతంగా విన్నారు.

ఒక పెద్దమనిషిలేచి ఈ విధంగా తీర్మానం ప్రతిపాదించాడు.

"పేద ప్రజలు కరువుతో బాధపడుతున్నమాట నిజం. ఇది భగవంతుడు దేశానికి పెట్టిన విషమ పరీక్ష. పేద ప్రజలు ఈ పరీక్షకు నిలబగాలంటే ఆధ్యాత్మికబలం సాధించాలి. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఉపదేశించినట్లు ద్వంద్వాలను విసర్జించి, పంచతన్మాత్రలకు వశుడు గాక, కూర్మంవలె అంగాలన్నీ ముడుచుకున్నట్లు ముడుచుకుంటే ఎవరినీ బాధించనేరదు."

ఈతీర్మానాన్ని (?) బలపరుస్తూ మరో పెద్దమనిషి ఈవిధంగా చెప్పాడు.

"సోదరులారా! మనం ఒక్కవిషయం గ్రహించాలి. కరువు కన్న కూడా కరువుభయం మనను చాలా కుంగదీస్తుంది. మన స్తత్వవేత్తలీ విషయం రుజువు చేస్తారు. ఈపాటి కరువుకే ఇంతమంది చచ్చారంటే వెనకటి మహా ఋషులు కందమూలాలు తినీ, జలభక్షణ చేసీ, వాయుభక్షణచేసీ, అన్నేసివేలఏళ్ళు, పుట్టలు పెరిగేలాగా ఎట్లా తపస్సుచేయగలిగారు?. సోదరులారా! మనపేద ప్రజలు కర్మసిద్ధాంతం గుర్తించినవారై, కరువు పరిస్థితుల అర్థంచేసుకున్నవారై, కర్తవ్యం అవగాహన చేసుకున్నవారై, సాధ్యమైనంత తక్కువ ఆహారంమీద- వీలయితే గుక్కెడు నీళ్ళుతాగి-కేవలం జీవించి ఉండగలందులకు మాత్రమే భోజనం చేస్తూ — ఇదిమంచి ఆరోగ్య సూత్రం. కావలిస్తే వైద్యులనడగండి! కరువును ధైర్యంగా ఎదిరించి, యింత కన్న ఘోరమైన కరువు వచ్చినా తట్టుకోగలమని రుజువు చేస్తారు గాక ..యీ తీర్మానం అందరూ బలపరచవలసిందని కోరుతున్నాను."

ఆతరువాత క్రమంగా ఈక్రింది తీర్మానాలుప్రతిపాదించబడిఆమోదించబడినై.

1 దేశమంతటా రాంభజనలు జరపాలి.

2 దేశం నడిమధ్య ప్రాంతంలో ఒక ఎకరం మేర హోమగుండం తవ్వి

బ్రహ్మాండంగా యజ్ఞం చెయ్యాలి

3 దేశభక్తు లెవరూ పూటకు పావు శేరు బియ్యంకన్న తినకూడదు. (దీన్ని అర్థశేరుకు పెంచమని తెచ్చిన సవరణ నెగ్గింది)

4 పేద ప్రజలు సృష్టాన్నాలు మానాలి ఎవరూ అన్నం పారెయ్యరాదు (ఆ విధంగా పారేసిన అన్నాన్ని మాదాకవళం వాళ్ళకి వెయ్యొచ్చుననే సవరణ ఆమోదించబడింది.)

5 పేద ప్రజలు శరీరవ్యాయామం చేసి బలాఢ్యులగా ఉండాలి

ఈ విధంగా ఇంక చిల్లర తీర్మానాలు—ఎవరూ అబద్ధం ఆడరాదనీ, తిండి దొరకని పక్షంలో ఆకో అలమో తినాలిగాని నిరసన వ్రతంచేసి చావరాదనీ, సాధ్యమైనంత వరకు అందరూ బ్రహ్మచర్యం అవలంబించాలనీ మాంసాహారం వర్జించాలనీ, దేశభక్తుల తా గీతాపారాయణ చెయ్యాలనీ — కూడా జరిగినై.

తీర్మానాల అనంతరం కరువు నిర్మూలన మహాసభ (సంవత్సర చందా ఒక అణా, పోషకులకు బేడ, రాజపోషకులకు రూపాయి. యావజ్జీవ సభ్యత్వానికి నూటపదహార్లు) ఒక కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అందులో రాజపోషకులూ, యావజ్జీవసభ్యులూ మాత్రమే ఎన్నుకోబడ్డారు

పేదవాళ్ళ ప్రతినిధులంతా చేరి వేరే ఒకసభ పెట్టారు జరిగిన సమావేశాన్ని ఖండించారు. ఇందులో సరిఅయిన తీర్మానం ఒకటికూడా జరగలేదు కరువు కారణాలు చర్చించబడలేదు. తిండి దొంగలను ఎదుర్కొనే కార్యక్రమం ఇవ్వబడలేదు జరిగిన తీర్మానాల ఏ ఒకటికూడా అసలు సమస్య నెదుర్కోదు సరిఅయిన తీర్మానాలు కొందరు ప్రతిపాదించగా మహాసభాధ్యక్షుడు వాటిని శాంతిభద్రతలకు హాని కరంగా ఉన్నాయని తోసేశాడు.

పేదల ప్రతినిధుల సమావేశంలో కొన్ని తీర్మానాలు చేయబడినై.

"తిండిదొంగలను మహాసభ ఎదిరించాలి; శిక్షించాలి ఆహారపదార్థాలు సంపాదించడానికీ, ప్రజలకు న్యాయంగా పంచడానికీ ఉపసంఘాలు నియమించాలి ఇందులో ప్రజా ప్రతినిధులే ఉండాలి"

ఈ తీర్మానంచూసి మహాసభ కార్యవర్గం మండిపడింది.

"వీళ్ళకేం చెబుతారు, రేపు యజ్ఞం చేయడానికి మోతుబరులు వందలకు వందల పుట్లు ధాన్యం విరాళం ఇస్తున్నారు. తిండిదొంగలు నశించాలి అని మనం అన్నట్టయితే పెద్దవాళ్ళకు కోపం వచ్చేస్తుంది. మనం సామంతో వారి హృదయాలు కరిగించాలి హృదయాలు కరగగానే దేశం మళ్ళీ సుభిక్షం అవుతుంది

"అదీకాక, మనలో అంతో ఇంతో ధాన్యం దాచుకున్న వాళ్ళం ఉన్నాం. మనమూ తిండిదొంగలమేనా మరి! ఆ మాట అని మనం మన ధాన్యం బయట పెట్టేస్తె ఎవరి కడుపునిండుతుంది? మనమూ మన భార్యలూ, బిడ్డలూ మాడడమే కాని మరేమీ జరగదు" అన్నాడు అధ్యక్షుడు.

క్రమంగా మహాసభలో కొన్ని తర

గతులేర్పడినై ఆధ్యాత్మిక వాదులూ, తాత్విక వాదులూ, కార్యవాదులూ ఎవరికి వారయినారు. కరువుదారిన కరువు చెల రేగుతూనేఉంది

ప్రజలంతా మహాసభను నమ్ముకుని ఉన్నారు. నిస్పృహా, ఆశా, ఈ రెంటి మధ్యా వారు త్రిశంకు స్వర్గంలోఉన్నారు ఉద్యమం ఎంతకాలం సాగినా తిండి దొంగలపని బాగానేఉంది. వారి ప్రతి నిధులంతా క్షామనివారక మహాసభలో ఉన్నారు క్షామ నివారణకుగాను ఉప సంఘాలు నియమించబడినై ఉప సంఘాల్లోస్థానాలకోసం కలతలూ, చీలి కలూ, పోటీలూ సాగినై.

"ఈకలతలూ, చీలికలూ, పోటీలూ ఏమిటి?" అన్నారు కొందరు.

"రాజకీయ చైతన్యం బాగా సాగు తున్నదన్నమాట!" అన్నారు తెలిసిన వాళ్ళు.

పేదవాళ్ళ పరిస్థితి నానాటికీ హేయ మైన స్థితికి వచ్చింది వాళ్ళ ప్రతినిధులు ప్రజల సమైక్యపోరాటం సాగితేనేగాని ఈ క్షామం నివారణకాదని అలజడి ప్రారంభించారు

వెంటనే తిండి దొంగ ప్రతినిధులు పేదల ప్రతినిధులు దేశ ద్రోహులని ప్రచారం ప్రారంభించారు.

దేశంలో కల్లోలం హెచ్చిపోయింది.

"ఈకల్లోలాల కన్నిటికీ కారణం ఎవరు? పేదల ప్రతినిధులమని చెప్పు కుంటూన్న దేశద్రోహులు వారిని నమ్మకండి ప్రజలు చాలా మంచివాళ్ళు. వారికి శాంతి భద్రతలు ఇష్టం క్షామ నివారణార్థం వాళ్ళెన్నాళ్ళయినా త్యాగ యుతంగా వస్తులుంటారు. ఈ దేశ ద్రోహులు వాళ్ళకి తిండిజ్ఞానకం చేస్తు న్నారు క్షామనివారక సభనుపడగొట్టటం వాళ్ళపనిగా పెట్టుకున్నారు దేశంలో అశాంతీ, అరాచకమూ విజృంభించి ఆనం దించాలని వీళ్ళదుర్బుద్ధి" అని మహా సభ ప్రకటించింది.

పేదల ప్రతినిధులు దేశద్రోహులుగా నిర్ణయించ బడ్డారు

"మేము మీవాళ్ళం! మీరంతా పెద్దలు మీరు ముందుండి మాకు దారి చూపకపోగా. తిండి దొంగలు ఆడించే ఆటలు ఆడుతున్నారు ప్రజలు కరువు నెదుర్కొనే కార్యక్రమం ఇవ్వక, మమ్మల్ని వేటాడటం ఒక ఉద్యమంగా చేస్తున్నారు. ఈవిధంగా ప్రజలను మభ్యపెట్టటం ద్రోహం!.... రండి! మన మంతా కలిసి తిండి దొంగల్ని ఎదు ర్కొందాం" అన్నారు పేదల ప్రతి నిధులు.

వీళ్ళ కేకలు ఊరికేపోలేదు వీటిలో ఉన్న సత్యాన్ని పేదప్రజలు అర్థంచేసు కున్నారు. క్షామ నిర్మూలనాసక్తి కలవా రంతా అర్థం చేసుకున్నారు. మహా సభలో క్షామాని కనుకూలంగా ఉన్న మురా, చెరువెండితే చేపలు బయట పడ్డట్టు, బయటపడ సాగారు.

వీళ్ళు తిండి దొంగల ప్రాబల్యం చూసుకుని ప్రజలను ఆఖరుసారి వంచిం చటానికి కొన్ని నినాదాలు తయారు చేశారు.

"దేశ ద్రోహులు నశించాలి ధర్మం వర్ధిల్లాలి. దాసపరులకుజై! ధర్మాత్మ లకుజై! భూతదయకుజై!"

ఈ నినాదాలతో పేదల ప్రతినిధుల మీదికి మూఢ ప్రజని రెచ్చగొట్టటానికి ప్రయత్నించారు

కొంతకాలం అందరికీ మతులు పోయినట్టు కనపడ్డది

"ఈ అన్యాయంకన్న కరువేబాగుంది. పేదల ప్రతినిధులమని పేరుపెట్టుకుని వీళ్ళంతా సంక్షోభం తెస్తున్నారే!" అని తెలియని విద్యాధికులు వాపోయినారు

కాని ఇంత సంక్షోభమూ కరువును పారదోలే ప్రయత్నంలో ప్రజలకూ ప్రజాద్రోహులకూ మధ్య జరిగే సంఘర్షణలలో ఏర్పడ్డదని మందమతులకుకూడా తెలిసి రాసాగింది

తమను తిండిదొంగలెంత యుక్తిగా వంచించారో కనుక్కున్నారు మహాసభ వారు వారిలో ప్రజాహితం కోరిన వారంతా క్షామ నివారణోద్యమంలో ప్రజల పక్షంగా నిలిచారు

"ఇంకా దారుణం హెచ్చిపోతుంది చూస్తూఉండండి!" అన్నారు తిండి దొంగల ప్రతినిధులు మారువేషాలతో ప్రజలమధ్య తిరుగుతూ. యదార్థానికి అటువంటిదేమీ జరగలేదు.

అకస్మాత్తుగా తిండిదొంగలు మాయమైనారు. చూస్తూండగానే లక్షలకు లక్షల బస్తాల ఆహారధాన్యం నడివీధిలోకి నడిచి రాసాగింది.

కరువు అదృశ్యమయింది.

మృత్యుదేవత వెళ్ళివస్తానని కూడా చెప్పకుండా అదృశ్యమయింది

దేశంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లినై

*

స్థానిక సంఘాలకు —

'అభ్యుదయ'లో స్థానిక సంఘాల కార్యక్రమాన్ని వివరిస్తూ ప్రతి నెలా ఒక సమగ్రమైన నివేదిక ప్రచురిద్దామనుకొన్నాం అన్ని స్థానిక సంఘాలు తమ తమ కార్యక్రమాన్ని గూర్చి — సభలు, సమావేశాలు, గోష్ఠులు, వర్ధంతులు — వివరంగా రిపోర్టులు పంపాలని ప్రార్థన.

దలవాడ పిచ్చయ్య
కార్యదర్శి
ఆంధ్ర అభ్యుదయరచయితల సంఘం

బులెటిన్

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో అభ్యుదయ సాహిత్యోద్యమం ఎలా పెంపొందుతున్నదో వివరిస్తూ అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఒక 'బులెటిన్' ప్రచురిస్తుంది.

విడిప్రతి వెల అర్ధరూపాయి

మొదటి బులెటిన్ వెలువడింది.

కావలసినవారు .—

'అభ్యుదయ' మేనేజరుకు వ్రాయండి

ఆవేదన

శ్రీ 'శిరి'

ఏవో వేదనలు
భావావేశములు
బ్రదుకుకడలిలో
పాయని రొదలూ ॥

లోకంబేయొక
ఆకటి కడుపై
అరచిన అరుపులు
ఆరని అగ్నులు
దోపిడితత్వం
తొలగించుటకై
లోకపుటాకలి
బోకార్చుటకై
కారినరక్తం
రాలినజీవం
తొత్తులచేతుల
విలవిలలాడే
సోదరిశీలం

ధర్మరాజ్యముల
న్యాయపాలనము
రక్తముకండలు
రాల్చిశ్రమించియు
అన్నంబడిగిన
ఆర్తులజంపే
వీరయోధులకు
విక్టరిక్రాసులు
జాతులనడిపే
జగన్నాయకుల
ప్రజమనంబుల
పండితకర్తల
మతవిద్వేషపు
మారణహోమం
ప్రజాప్రభుత్వం
శాంతిస్వతంత్రం

ప్రజలకష్టముల
పాలుపంచుకొని
బాధలుతీరే
బాటలుజూపిన
ప్రజాహితులకు
బహుమానంబులు
చీకటికొట్లూ
చిత్రహింసలూ

లోకంబంతా
అగ్నిగుండమయి
కుళ్ళుసమాజం
కుమిలే వాసన
సామ్రాజ్యత్వము
చల్లేఅగ్నుల
శ్రామికవర్గం
అరుణోదయమున
కాశాపయనం
ఈ యమలోకం గని
యేడ్చేగుండెల
దూసుకపోయే
తుపాకిగుండ్లూ ॥ఏవో॥

సోవియట్ సాహిత్యాభ్యుదయం
కొన్ని సమస్యలు

విక్టర్ నికోలయేవ్

సోవియట్ ప్రజలు మొన్నటి మహాయుద్ధంలో సాధించింది తమ సాయుధ బలాలయొక్క విజయం మాత్రమే కాదు; సోవియట్ రష్యాలోని సోషలిస్టు జీవిత విధానంవల్ల పెంపొందిన నీతి నియమాలయొక్కా, సంస్కృతియొక్కా విజయంకూడా.

ఇవాళ సోవియట్ జీవితంలో మానసికాభివృద్ధి కోసం చూపబడుతున్న శ్రద్ధ గమనించదగ్గది. ప్రజల విద్యా సంస్కృతులను మనస్సులో పెట్టుకొని నాయకులు పనిచేస్తున్న దేశంలో ఇలా శ్రద్ధ చూపడం సర్వ సాధారణమైన విషయం.

కోటాను కోట్ల ప్రజల మానసికాభివృద్ధి: యుద్ధకాలపు కష్టాలనన్నిటినీ ఎదుర్కోడానికీ, విజయం సాధించడానికీ రష్యన్ ప్రజల కాధారభూతమైన ఏ ఆదర్శాలు వున్నవో, వాటిదృష్టిలో యువకులకు నిరంతర శిక్షణ – ఇవే సోషలిస్టు దేశం ఇంకా అభివృద్ధిచెందడానికి అవసరమైనవి యుద్ధానంతర దేశాభివృద్ధిలోను, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే వీరోచిత కర్తవ్యంలోను, సాహిత్యానికి ముఖ్యమైన స్థానం వుంది.

సాహిత్య, నాట్య, చలన చిత్ర రంగాలలో పనిచేసేవారితో సంప్రదించి సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ 1946లో కొన్ని నిర్ణయాలు ప్రకటించింది. ఈ నిర్ణయాలు కళలకూ, సాహిత్యానికీ ఉన్న బాధ్యతల స్వభావాన్ని తెలియజేస్తాయి ప్రమాదకరమైన లేక అసమర్థమైన కొన్నిరచనలను స్పష్టంగా విమర్శించడంద్వారా, ఏయే ధోరణులు సక్రమాభివృద్ధికి నిరోధకాలో కూడ తెలియజేస్తాయి.

అన్నాఅఖ్మటోవా, మైకేల్ జోషెంకోల అభివృద్ధి నిరోధక రచనలను ప్రచురించిన 'జ్వెజ్దా', 'లెనిన్‌గ్రాడ్' అనేరెండు లెనిన్‌గ్రాడ్ పత్రికలమీద సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి ఆంద్రీ ఝుడనోవ్ ఇచ్చిన నివేదిక ఇందులో ప్రధానమైనది.

"సోవియట్ రచయితలూ, మేధావంతులూ నేడు ప్రధమ శ్రేణిలో ఉన్నారు. నేటి శాంతిపరిస్థితుల్లో వారి బాధ్యతలు మరీ అధికమైనాయే గాని, తగ్గిపోలేదు, ఈ మాట ప్రత్యేకం సాహిత్యానికి వర్తిస్తుంది. సోవియట్ ప్రజలుగానీ, రాజ్యాంగంకానీ, పార్టీగానీ, మనసాహిత్యం సమకాలీన పరిస్థితుల నుంచి తప్పుకోవాలని కోరడంలేదు. సోవియట్ జీవితంలోని వివిధ ఘట్టాల్లోను బలంగా మనసాహిత్యం ప్రవేశించాలని కోరుతున్నారు.

"ప్రజల నైతిక రాజకీయ ఐక్యతను బలవత్తరం చేయడంలోను, ప్రజాసమీకరణంలోను, ప్రజలకు విద్యా సంస్కారాలను సమకూర్చడంలోను సాహిత్యం నిర్వహించే పాత్రనూ సాహిత్యం యొక్క మహత్తరమైన చారిత్రకసందేశాన్ని బోల్షివిక్కులు స్పష్టంగా గుర్తిస్తారు. సాహిత్యానికి మహోన్నతస్థానం ఇస్తారు. ఉత్తమసంస్కృతిని పెంపొందించడం సోషలిజం ప్రధాన బాధ్యతల్లో ఒకటి కనుక అలాంటి ఉత్తమసంస్కృతి దినదినాభివృద్ధి చెందాలని పార్టీ కేంద్ర కమిటీ కోరుతున్నది" అని ఝదనోవ్ చెప్పాడు.

సోవియట్ సాహిత్యంలోని అభ్యుదయ ప్రజాస్వామిక సాంప్రదాయాల్లో నూరేళ్ళ అనుభవం మీదట, సాహిత్యాన్ని దాని బాధ్యతల్ని గురించిన ఈ బోల్షివిక్ దృక్పథం ఏర్పడింది. రష్యాలో నవ్యసాహిత్యానికి ఒక స్వరూపం కల్గించి మొదలు— అంటే, 18వ శతాబ్ది చివరినుంచీ-ఉత్తమ రచయితలందరి రచనల్లోను స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న ప్రజల సాంఘిక సమస్యలు ప్రతిబింబించాయి. ఈ సాంప్రదాయాన్ని జీర్ణించుకున్న సోవియట్ సాహిత్యం— ప్రజలతోపాటుగను, వర్గరహిత సమాజాన్ని నిర్మిస్తున్న ప్రజారాజ్యమైన సోవియట్‌తో పాటుగాను — పెంపొందుతున్నది. పుష్కిన్, రడిషేవ్‌లనుంచీ మాక్సింగోర్కీదాకా అనేక తరాల అభ్యుదయ రచయితలు కన్న కలలు సోవియట్ సమాజవిధానంలో ఫలించాయి.

"ప్రజాస్వామిక దృక్పథంలోను, శాంతియుతంగా సాంఘిక జీవిత సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నంలోను, మానవత్వధర్మాలను ఆదేశించడంలోను, స్వాతంత్ర్యానికి అంకితమైన కావ్యగీతాల్లోను, ప్రజాజీవితము నందలి అభిరుచిలోను.... విశ్వశ్రేయస్కరమయిన నిరంతర సత్యాన్వేషణంలోను — సోవియట్ సాహిత్యం బలవత్తరమైన" దని మాక్సిం గోర్కీ పూర్తిగా న్యాయదృష్టితోనే వ్రాశాడు.

సోవియట్ ప్రజా నాయకులైన లెనిన్, స్టాలిన్లు సాహిత్యంయొక్క అద్భుతమైన సాంఘిక ప్రాముఖ్యాన్ని ఎల్లప్పుడూ గుర్తించారు. ఉత్తమ రచయితల రచనలు సామ్యవాదాన్ని గట్టిగా బలపరచడంకూడా గమనించారు.

ఏమైనా వర్గసమాజంలో దాని అంతరంగిక వైరుధ్యాలు ఉండనే ఉంటాయి. దాని సాహిత్యం కూడా చీలిపోయే ఉంటుంది. ప్రజలను దోచుకుబతికే అధికార వర్గాలవారు సాహిత్యాన్ని మలినపరచారు; సాహిత్యంలో కొంతభాగం అభివృద్ధి నిరోధకభావాల ప్రచారానికి వినియోగించుకున్నారు.

రాజకీయాలతో సంబంధం లేనట్లు, 'కళ కళకోసమే' ననే ముసుగు వేసుకున్నప్పటికీ, సాహిత్యం రాజకీయాలకు దూరమైంది కాజాలదు. ఏ రాజకీయాలతోను — అంటే ఏ ప్రజల కష్టసుఖాలతోను—ఏమీ సంబంధం లేదని ప్రచారం చేయడంలోనే ఒక తంతువుంది. అభ్యుదయ భావాలనుగానీ, అభివృద్ధినిరోధక భావాలనుగానీ, ప్రజల్లో వ్యాప్తం చెయ్యడానికి ప్రతి కళారూపమూ ఒక బలమైన

సాధనం అక్టోబరు విప్లవం రోజుల్లో - 1905 విప్లవం విఫలం కావడంతో, రాజకీయంగా అసంతృప్తి కలిగిన కాలంలో-సర్వత్రా లభించే సర్వసాధారణమైన కళారూపాలన్నీ బూర్జువా సమాజ పతనానికి సంబంధించినవే. సాంకేతికవాదులు (Symbolists) వాళ్ళలోనుంచి పుట్టుకొచ్చిన ఆదర్శవాదులు(Acmiests) భవిష్యద్వాదులు (Futurists) ఆనాటి సాహిత్య వాతావరణమంతా ఆక్రమించారు వీళ్ళ సంస్థలూ, ఆవరణలూ అల్పమైనవే కాని, అత్యధికమైన ప్రచారం పొందారు. నాటకాలు చూసే మధ్యతరగతివాళ్ళనూ, పతనమైపోతున్న సాహిత్యగోష్ఠులనూ ఆకట్టుకున్న ఈ సాహితీపరుల సాధన అనుమానాస్పదమైంది ! రష్యన్ బూర్జువా విజ్ఞానవంతుల చరిత్రలో "ఈ పదేళ్లూ బొత్తిగా ప్రతిభాశూన్యమైన"వని గోర్కీ అన్నమాట సరీగ్గా సరిపోయింది ఈ ధోరణులకు అధినాయకులైన మెరెజ్‌కోవ్‌స్కీ, గిపియస్, సొలొగబ్‌ల యొక్క తక్కువరకం తదితరుల యొక్క రచనలు ప్రజలమీద ద్వేషాన్ని అసహ్యాన్ని వెల్లగక్కాయి. రష్యా చరిత్రలో ప్రజలు నిర్వహించే పాత్ర ప్రబలంకావడం చూసి, భయాన్ని సైతం ప్రదర్శించాయి పతనమౌతున్న పాశ్చాత్య 'వేదాంతు' లిప్పటికీ ప్రస్తుతించే మెరెజ్‌కోవ్‌స్కీ, స్వాతంత్ర్యం కోసం పురోగమిస్తున్న ప్రజలు పైకి దూకుతున్న రాక్షసులంటూ, సన్నిహితమైన విప్లవానికి సంధిప్రలాపాలతో స్వాగతమిచ్చాడు

ప్రజలకు దూరమై, ప్రజలమీద కత్తిగట్టిన ఈ సాహితీపరులు రష్యన్ సాహిత్యం యొక్క, ప్రపంచసాహిత్యం యొక్క ప్రజాస్వామిక యథార్థ కళా సంప్రదాయాలకు పూర్తిగా వ్యతిరేకమైనారు సాంఘిక సిద్ధాంత కళా విషయాల్లో తమ బలం కోసం నియోకాంటియన్లు, నీచియను మొదలైన అభివృద్ధి నిరోధకుల భావాల ఆసరా తీసుకోసాగారు. 19, 20 శతాబ్దాల మలపులో పాశ్చాత్య దేశాల కర్మ సిద్ధాంతవాదులు వ్రాసిన రచనల్లోనుంచి వీళ్ళు తమ రచనలకు ఉదాహరణలు వెతుక్కున్నారు ఆ కర్మ సిద్ధాంతవాదుల మూడోతరం పిల్లలో, నాలుగోతరం పిల్లలో అయిన వీళ్ళు సాహిత్యంలో నూతన సృష్టి చేస్తున్నట్లు నటించారు ; కాని, ఆ ప్రాత నీచియన్లయొక్క, తరువాత వచ్చినవారియొక్క ఉచ్ఛిష్టాన్ని మాత్రమే వీళ్ళు నెమరువేస్తున్నారు

ఈ నిర్జీవ వాతావరణంలో అనేకమంది మహాకవులు కలంసాగక చచ్చిపోయినారు. ఈ పాపంకూడా, ఇంకా అనేక పాపాలతోపాటు వీళ్ళమీదే పడుతుంది

కాని, ఈ పతిత వాతావరణాన్ని ఛేదించుకోగలిగిన అలెగ్జాండర్ బ్లాక్ వంటి కళాకారులు మానవత్వంమీద, ప్రజలమీద, భక్తిప్రపత్తులుగల సాహిత్యం సృష్టించారు అభ్యుదయ సాహిత్య పంథా చారిత్రకంగా సరైనదనే సత్యాన్ని ఈ విషయమే స్పష్టపరుస్తుంది

ఇలాంటప్పుడు బోల్షివిక్ విమర్శ

కులూ, మాక్జింగోర్కీ ఈ జీవంలేని సాహిత్యానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడారంటేను; పూర్వ సాహిత్యం లోని ఉత్తమ సాంప్రదాయాలను కాపాడి, పునరుద్ధరించారంటేనూ; ఆశ్చర్యంలేదు. కాని ఊరికే, పునరుద్ధరించడంతోనే సరిపోదు ధనికతత్వం సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశిస్తున్న సమయంలో సంఘం చిన్నాభిన్నం కావడంతో పూర్వ సాహిత్యం పతనమైపోయింది. కనుక ఈ కొత్త సాంఘిక జీవితం పునాది అయినప్పుడు మాత్రమే కళా సాహిత్యాల పునరుద్ధరణ సాధ్య పడుతుంది

'వ్యక్తిగత ఆస్తి' అనే వ్రణం మానిపోయిన సమాజంలో సాహిత్యం యొక్క ప్రత్యేక స్వభావాన్ని గూర్చి లెనిన్ "అక్టోబరు సోషలిస్టు విప్లవా" నికి పన్నెండేళ్ళ పూర్వమే ఇలా సూచించాడు:

"లోభమూ, ఆశా కాక, సామ్యవాద భావమూ, కష్టజీవులయందలి సానుభూతీ అంతకంతకూ కొత్తశక్తుల్ని ప్రసాదిస్తాయి కనుక ఈ సాహిత్యం స్వతంత్ర సాహిత్య మవుతుంది. అంతేకాదు, మత్తెక్కి, సొక్కి, సోలిన నాయికలకు వింజామరలు వీచదు కనుక, పీడాకరంగా తెగబలిసిన ఏ పదివేలమంది పైవాళ్ళకో దాసోహ మనదు కనుక; దేశానికి జీవమూ, శక్తీ, భవిష్యత్తూ అయిన లక్షల, కోట్ల కష్టజీవులకు సేవచేస్తుంది కనుక — ఈ సాహిత్యం స్వతంత్ర సాహిత్యమవుతుంది."

ప్రజలకు కమ్యూనిస్టు విజ్ఞానం కలిగించడానికి కృషిచేస్తూ, లెనిన్ చూపిన మార్గాన, ప్రపంచ ప్రజానీకంపట్ల తన సేవాధర్మాన్ని నిర్వర్తిస్తూ, అభ్యుదయ సాహిత్యంగా తానిచ్చిన సందేశానికి సోవియట్ సాహిత్యం గర్విస్తున్నది

తమ భూమికి తామే యజమానులైన ప్రజలూ, ముఖ్యంగా యువకులూ – తాము పుస్తకాల్లో చదువుతున్న విషయాలకూ, సినీమాల్లోను, నాటకాల్లోను చూస్తున్న విషయాలకూ సంబంధం లేకుండా ఉండలేరు. కనుక, సోవియట్ ప్రజాసంస్థలూ, సోవియట్ విమర్శకులూ, కళాసృష్టియొక్క పరమార్థమైన తాత్విక నైతిక సూత్రాలను కనిపెట్టి వుండాలి. కళారూపాల విషయంలో తమ కోర్కెలను తెలియ జేయాలి ఏ రూపంలో నైనాసరే వచ్చే అల్పమైన అసభ్యమైన విషయాలకు వ్యతిరేకంగాపోరాడాలి. కళా సాహిత్య రంగాల్లో కలిసిమెలిసి కళా సృష్టిచేస్తున్న వారు నిర్మాణాత్మకమైన విమర్శాదృష్టితో' సోవియట్ కళారూపాలన్నీ సామ్యవాద మానవత్వ లక్ష్యాన్ని పొందే విధంగా, అన్యోన్యం తోడ్పడాలి

సోవియట్ కళాసాహిత్యాల్లో కొన్ని ముఖ్యమైన విజయాలు సాధించాం. సాహిత్య రంగంలో ఉదాహరణకు మాక్సింగోర్కీ వ్రాసిన 'ఆర్టామనోవ్స్'; 'బైస్టాండర్';అలెగ్జి టాల్‌స్టాయ్‌వ్రాసిన 'ది రోడ్ టు కాల్వరీ'; 'ఇంపీరియల్ మెజెస్టీ' (పీటర్ ది గ్రేట్); మైకేల్ షోలకోవ్ వ్రాసిన 'అండు క్వయెట్‌ఫ్లోస్ ది డాన్' 'సాయిల్ అప్ టర్న్డ్' అనే నవలలూ; ఈ మధ్యనే అలెగ్జాండరు

ఫెడయేవ్ వ్రాసిన 'ది యంగ్ గార్డు' అనే నవల మహత్తరమైనవి

ఇటీవల కానీస్‌లో జరిగిన అంతర్జాతీయ సినిమా ప్రదర్శనంలో సోవియట్ చిత్రాలకే ఎక్కువ బహుమతులు వచ్చాయి అందులో 'ది గ్రేట్ టర్నింగ్ పాయింటు' కు ప్రథమ జాతీయ బహుమతీ, 'ది స్టోన్ ఫ్లవర్' కు ఉత్తమ వర్ణ చిత్ర బహుమతీ, 'ది నన్సీ ట్రైబ్' కు ఉత్తమ శాస్త్రీయ వైజ్ఞానిక చిత్ర బహుమతీ, 'బెర్లిన్'కి ఉత్తమ వార్తా చిత్ర బహుమతీ వచ్చాయి

నాటకరంగంలో సోవియట్ సాధించిన విజయాలు ప్రపంచమంతా గుర్తించింది. సోవియట్ నాటక రంగంలో నటనా చాతుర్యం ఉన్నత స్థాయికి చెందిందని అందరికీ తెలుసు. యుద్ధ కాలంలో అలెగ్జాండర్ కార్నిచక్ వ్రాసిన 'ఫ్రంట్'; కాన్‌స్టాంటిన్ సిమనోవ్ వ్రాసిన 'ది రష్యన్స్'; లియోనిద్ లియనోవ్ వ్రాసిన 'ఇన్వేషన్' అనే నాటకాలు ఎక్కువమంది ప్రేక్షకులను ఆకర్షించాయి. ఎక్కువ ప్రచారంలోకి వచ్చాయి

కళలకంత ఉన్నతస్థానం ఇస్తున్న దేశంలో, కళలు వైజ్ఞానికంగా ప్రధాన పాత్ర వహిస్తున్న దేశంలో కొందరు రచయితలు కొందరు నాటక, చలనచిత్ర బాధ్యులు తమకర్తవ్యంలో బాధ్యతారహితంగా ప్రవర్తించినప్పుడు — ప్రజలు అసమ్మతి చూపడం సహజం; ఉచితం కూడా.

సోవియట్ రచయితలను గురించి మాట్లాడుతూ, స్టాలిన్ "రచయిత మానవ హృదయ నిర్మాత" అని అన్నాడు

అయినప్పుడు, మానవ హృదయానికి సక్రమంగా విద్యావిజ్ఞానాలు కలిగించడానికి బదులు, దాన్ని వికలం చేయడానికి రచయితలకు అధికార మిస్తారా? కష్టాలతో కూడినదే అయినా, మహత్తరమైన నిర్మాణ కార్యక్రమంలో ముందుకు నడుస్తున్న ప్రజలకు తోడ్పడడానికి తమ కళాదృష్టిని వినియోగించడానికి బదులు, వారిని దిగలాగడానికీ, వారికి వ్యతిరేకంగా పనిచేయడానికీ రచయితలకు అనుమతినిస్తారా?

రష్యన్ కళాసాహిత్యాల మహత్తర సంప్రదాయాల మధ్యగానీ, లియో టాల్‌స్టాయ్ మాక్సింగోర్కీల సంప్రదాయాల మధ్య గానీ, సామ్యవాద మానవత్వం, పతనదశలోని బూర్జువా సమాజంలో మానవ జీవిత విచ్ఛిత్తి — ఈరెంటి మధ్యలోగానీ ఏ సంప్రదాయం తీసుకోవాలన్నా, ఈనాడు సోవియట్‌లో జీవిస్తున్న కళాసాహిత్య కారులకు ప్రత్యేకంగా చిక్కులేమీలేవు.

దీనితోనే తెలుస్తుంది — మైకేల్ జోషెంకో, అన్నాఅఖ్మటోవాల రచనలు — రెండూ విభిన్న దృక్పథాలను ప్రదర్శిస్తున్నా, రెండూ సోవియట్ సాహిత్యానికి విరుద్ధమైనవి కావడం వల్ల బహిరంగంగా ప్రజల అసమ్మతిని ఎదుర్కోవలసి వచ్చిందని.

మనిషిని వికారంగాను, నీచంగాను, వివర్ణంగాను చిత్రించడం రచయితకు ఉచితంగా ఎన్నడూ పరిగణించబడలేదు. అదీ, ఈరోజున — మంచిని

నమ్మలేక, మానవుణ్ణి పాతాళానికి పడగొట్టదగునేది ఎంత ప్రమాదకరమో, ప్రజలు ఫాసిజానికి వ్యతిరేకంగా జరిపిన ఘోర పోరాటానుభావాల ద్వారా తెలుసుకొన్న ఈ రోజున — మానవ స్వభావాన్నే నిందించే రచయితకు అభ్యుదయ రచయితల సంఘంలో స్థానం లేదు.

1943 లో, యుద్ధం తీవ్రంగా జరుగుతున్న రోజుల్లో, జోషెంకో 'బిఫోర్ సన్‌రైజ్' అనే ఒక కథ ప్రచురించాడు. దాన్ని అందరూ వింతగా చెప్పుకున్నారు. దానిమీద తీవ్రమైన విమర్శలు చేశారు. సోవియట్ ప్రజలు తమ సర్వశక్తుల్నీ యుద్ధరంగంలోను, కార్మిక రంగంలోను సమీకరించి వున్నప్పుడు, ఏ దేశద్రోహో, సంఘబహిష్కృతుడో మినహా దేశంలోని ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడూ తమ భావాలనూ, అనుభవాలనూ అన్నింటినీ మానవజాతి భవిష్యత్తును నిర్ణయిస్తున్న మహాయుద్ధాలమీద కేంద్రీకరించి వున్నప్పుడు —స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం అయిపోయిన కొద్దిరోజులకే — ఈ కథ వెలువడింది. తన వెనుకటి జీవిత గాథ వివరాలను వెతుక్కోడానికీ నీచమైన ప్రేమవ్యవహారాల్లో నోటితీట తీర్చుకోడానికీ, మానవహృదయంలో జాంతవికమైన ఒకానొక భయం సహజంగా వుందనీ, అదే అతని చేసే పనులనూ, పొందే ఉద్రేకాలనూ నిర్ణయిస్తుందనీ ఒక సిద్ధాంతం స్థాపించడానికీ; — స్పష్టంగా ఫ్రాయిడ్ ప్రభావంలోనే-జోషెంకో ఈ కాలాన్ని వినియోగించాడు. కాని, భయంతోకాక, నిర్భయత్వంతో బ్రతుకుతున్న సోవియట్ పౌరుల్లో ఏ చీకటి కోణంలోని అజ్ఞాత ఉద్రేకాలమీదనో ఏకాంతంగా తమ మనస్సును కేంద్రీకరించకుండా, తమ దేశంకోసం, సమస్త జాతుల స్వాతంత్ర్యంకోసం చేసే పోరాటంలో చైతన్యంతో, స్వార్థరహితంగా తమ జీవితసర్వస్వాన్ని సమర్పించిన సోవియట్ పౌరుల్లో — జోషెంకో రచన అసహ్యాన్నీ, అసంతృప్తినీ రేకెత్తించింది

తన ఈ రచనను అందరూ ఖండించడంవల్ల జోషెంకోలో ఒక మార్పు వస్తుందని ఎవరైనా ఆశించవచ్చు. కాని మానవుడ్ని అవమానిస్తూ ఆ పాత పతనధోరణిలోనే రచన సాగించాడు తన 'కోతికథ' (Adventures of an Ape) ల్లో యుద్ధకాలపు నానావస్థలూ భరించిన ప్రజానీకాన్ని బహిరంగంగా అవహేళన చేసాడు. ఇది సోవియట్ ప్రజల ఆగ్రహానికి గురిఅయింది

ఈ రకం 'సాహిత్యసృష్టి' జోషెంకోకు కొత్తకాదు 'సెరేపియన్ బ్రదర్స్' అని పేరుపెట్టుకున్న ఒక రచయితల కూటంలో ఇతను (తన ఇరవయ్యేళ్ళ వయస్సప్పుడు) సభ్యుడు. రాజకీయాలకు సంబంధం లేని రచన చెయ్యాలని ఈ కూటమి ప్రచారం చేసింది. "నేను నా గురించి ఇది చెప్పుకోగలను నేను కమ్యూనిస్టును కాను, సోషలిస్టు విప్లవకారుణ్ణి కాను, రాచరిక వాదినీ కాను, నేను కేవలం రాజకీయంగా ఏ నియమమూ లేనివాడిని"

ఈ కూటంలో నుంచి కొంతమంది

రచయితలు, 'సెరేపియన్ ఋషి' ప్రపంచానికు స్వస్తిచెప్పి వెళ్ళిపోయారు. కాని జోషెంకోమాత్రం అదే ఊహల ఎడారిలో ఇంకా బ్రతుకుతున్నాడు తనంతటతానే చెప్పుకొన్నట్లు 'రాజకీయంగా ఏ నియమంలేని' ఈ రచయిత సోవియట్ మానవుణ్ని వికృత హాస్య ధోరణిలో చిత్రించాడు కాని, నిజానికి సోవియట్ మానవుడిస్వభావ జోషెంకో రచనల్లోని ప్రధాన పాత్రల స్వభావానికి పూర్తిగా విరుద్ధం అయినప్పటికీ పశుత్వాన్ని విమర్శించడమనే సాకుతో జోషెంకో ఇదంతా చేశాడు తతిమ్మా ప్రజలు ఇంకా ఉన్నారనికూడా గమనించనంతగా తన ఒకేఒక కుత్సితమైన మూర్ఖపు పశువులాంటి పాత్రలో జోషెంకో మునిగిపోయాడంటే, మానవత్వాన్ని అవహేళనచేసే అతని హాస్యాన్ని చిరకాలంగా ప్రేమిస్తున్న వారుకూడా కాదనలేరు

1905 విప్లవంతో బెదిరిపోయి రష్యన్ మేధావులు అభివృద్ధి నిరోధకపంకంలోకి కొట్టుకుపోయిన రోజుల్లో అన్నా అఖ్మటోవా రచన మొదలుపెట్టింది వినాశాన్ని సూచించే అపశకునాలూ, వ్యభిచారాన్ని ప్రేరేపించే అభూత కల్పనలూ ఆనాటి పతనమవుతున్న సాహిత్యానికి చిహ్నాలు. ఈ లక్షణాలన్నీ అన్నా అఖ్మటోవా రచనల్లో వున్నాయి.

సాహిత్య గోష్టులను విషపూరితం చేసిన పతిత సాహిత్య పంథాలన్నిటినీ, అన్నా అఖ్మటోవా, ఈశతాబ్ది తొలిదశాబ్దుల్లో, సోవియట్ రాజ్యాంగం ఏర్పడ్డాకకూడా, తనరచనల్లో ప్రదర్శించింది' ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ ప్రభావంతో ఆమె వ్రాసిన కొద్దిగీతాల్లోకూడా తన అభివృద్ధి నిరోధకమైన ఉపేక్షాభావాన్నీ, నీతిబాహ్యతనూ ఆమె ప్రదర్శించినట్లు కన్పించదు.

మరీ ఈమధ్య వ్రాసిన గీతాలు ఆమె పూర్వ వాటికి నకళ్ళు? ఈ నొక 'అపస్మార స్థాయి' నని అఖ్మటోవా వ్రాసుకొని ఎంతోకాలం కాలేదు ప్రపంచాన్ని గురించీ, నవీన కవుల్లో తన స్థానాన్ని గురించీ ఆమె అభిప్రాయాన్ని తెలిపే ఈవాక్యాలు గమనింపదగ్గవి

జోషెంకో, అఖ్మటోవాలు ప్రజలకేమి చేసారు? తమ భవిష్య జీవితపథాలను స్పష్టమైన చైతన్యంతో తెలుసుకొని, నిష్కల్మషులుగాను, వీరులుగాను పెంపొందవలసిన యువజనాన్ని ఆకర్షించడానికి వీళ్ళ దగ్గిర ఏముంది? — అని ప్రశ్నించడానికి సోవియట్ ప్రజాసామాన్యానికి పూర్తిహక్కువుంది

జోషెంకో అఖ్మటోవాల రచనలు ప్రమాదకరమైనవి—వీరుడైన మానవుడి మహత్తత్వాన్నీ, నిర్మాతయైన మానవుడి ఘన సత్త్వాన్నీ చెడగొట్టడంవల్ల మాత్రమే కాదు; మన సంఘ జీవితానికి విరుద్ధమైన జీవిత దృక్పథాలను యువకుల్లో ప్రవేశపెట్టడంవల్ల మాత్రమే కాదు; ప్రజలకు నిజమైన సేవ చేయాలనే మహత్తర బాధ్యతనుంచి సాహిత్యాన్ని దిగలాగడంకంటె వారేమీ చెయ్యలేదు. గనుక; కళల పేరిట మోసానికీ, నీచమైన మూర్ఖత్వానికీ సాహి

త్యాన్ని త్రిప్పడంకంటె మరేమీ చేయలేరుగనుక।

తమ రచనల్లో తర తరాలనాటి నిరుపయోగమైన చెత్తనంతా పునరుద్ధరించే ప్రయత్నాలున్నాయని విమర్శకులు ఎత్తి చూపినప్పుడు ఏదో సాహిత్యంలో అక్కడక్కడా కొద్ది కొద్దిగా వున్న అప్రధాన విషయాలను ఎత్తి చూపుతున్నారని జోషేంకో, అఖ్మటోవాలు తమ్ముదాము కూడా ఓదార్చుకోలేరు. ఈ నిరుపయోగమైన తుక్కు భావాలు తమంతట తామే అదృశ్యమైపోయి, నూతన అభ్యుదయ భావాలకు దారి తీయవు

ఇవాళటి మన ప్రపంచంలో గతమంతా ఇంకా ప్రతి చోటా గతించిపోలేదు యూరోపంతటా తలెత్తుతున్న నూతన ప్రజాస్వామిక పంధాలకు వ్యతిరేకంగా ఈ గతం ఎంత ఘర్షణ పడుతుందో అంత ఆవేశంతోటి తన్నుతాను సమర్థించుకో జూస్తుంగి ఇలా గతించింది, బ్రతికున్నదాన్ని కబళింప జూసే ఈ అభివృద్ధి నిరోధక ధోరణులను పాశ్చాత్య అభ్యుదయ సాహిత్యం ఒక కంట కనిపెడుతూనే వుంది. సోవియట్ రచయితలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. నూతన జగత్తుయొక్క యాధార్ధ్యాన్ని సాహిత్యంలో ప్రతిఫలింప జేయాలంటే, అది కృత్రిమ కళా రూపాలద్వారా సాధ్యం కాదని సోవియట్ రచయితలు గుర్తించారు. ఈ కృత్రిమ కళా రూపాలు, వాటిని సృష్టించిన వాళ్ళ చేతుల్లోనే గతించాయి అలెగ్జాండర్ ఫెడయేవ్ అనే సోవియట్ నవలా కారుడు మాస్కో రచయితల సమావేశంలో ఈ సమస్యను స్పష్టపరిచాడు

"నూతన జగత్తును చిత్రించడమనేది మనం ఏ కళారూపాన్ని స్వీకరిస్తామనే సమస్యతో చాలా సన్నిహిత సంబంధం కలిగివుంది కళారూపాలకు సంబంధించినంతవరకు సోవియట్ రచయితలం యధార్థంగా నూతన రూపాలను ప్రవేశపెట్టామనీ, సంప్రదాయవాదులింకా వెనుక చూపుతో అనాగరికంగా వున్నారనీ మనం మరచిపోగూడదు. ఈ కళారూపాలను దృష్టిలో పెట్టుకొని విప్లవానికి క్రితమూ, విప్లవ కాలంలో వచ్చిన రష్యన్ సాహిత్యంలోనూ, పశ్చిమ యూరప్ సాహిత్యంలోను కనిపించే ఒక నియమంలేని అనేక పంధాలను పరిశీలిస్తే, మొట్టమొదట పరస్పర విరుద్ధాలైన రెండు ధోరణులున్నట్లు గోచరిస్తుంది; కాని నిజానికి ఈ రెండూకూడా మన సాహిత్యానికి ప్రమాదకరమైన ధోరణులే. ఇందులో మొదటిది కరుడు కట్టుకుపోయిన గణాచారి కవిత్వమూ, సమాసజటిలమైన ఇనప వచనమూ, నిజమైన వాస్తవికం అంటే వాస్తవమైన అన్ని సమస్యలనూ స్వతంత్రంగా, సహజంగా ఉద్ఘాటించడమే; కళారూపాలను ఎల్లప్పుడూ నూత్నసృష్టి చేయడమే

"పుష్కిన్ గోగోల్ టాల్‌స్టాయ్, బాల్జాక్, నెక్రాసోవ్, సాల్టికోవ్ షెడ్రిన్ మొదలైన వెనుకటి వాస్తవికవాదుల రచనలకంటె, వివిధ ధోరణులూ కలిగి తేలికగా నడిచే కళారూపాలను ఎవరైనా ఊహించడం సాధ్యమేనా? స్వతంత్రం

గాను, సమగ్రంగాను చిత్రిస్తుందిగదా గోర్కీ రచన! కళారూపం దాని పట్టు వదలి, సడలి జారిపోవడం కాదు: కొత్త భావాలకూ, కొత్త విషయాలకీ స్వతంత్రంగా సమగ్రమైన రూపకల్పన చేయడమే ఈ నూతన కళారూపాల ప్రయోజనం

"ఇక రెండో ధోరణి పూర్తిగా భావకవిత్వం ప్రత్యేకం నేటి పశ్చిమ యూరపియన్, అమెరికన్ నవీన రచయితల రచనల్లో కనుపించేవిధంగా — కళారూపమనేదే రూపుమాసిపోవడం

"ఉత్తమ సాహితీగుణం కోసం, ఉత్తమ కళారూపం కోసం కృషి చేస్తున్న మనం, కొత్తభావాలతో కొత్త రకం మనుష్యులతో, వాస్తవమైన నూతన సిద్ధాంతాలతో బయల్దేరాలి. ఈ దృష్టితో మన సాహిత్యంలోని ఉత్తమవిషయాల నన్నిటినీ పరిశీలిస్తే, ఆ కళారూపాలన్నీ ఒకే పట్టాల మీద నడవలేదనీ, ప్రత్యేకం పరిశోధించవలసినవేననీ చెప్పవచ్చు" అని అలెగ్జాండర్ ఫెదయేవ్ అన్నాడు

యధార్థమైన పరిస్థితులలో మానవ జీవితాన్ని చిత్రించడంలో రష్యన్ వాస్తవిక రచయితలు చూపిన అమోఘమైన చాతుర్యమూ, స్టెండాల్ రచనల్లోని ఉద్రేకమూ, బాల్జాక్ రచనల్లోని నిర్మాణశక్తీ — ఇవన్నీ — బూర్జువా సమాజంలోను, సంస్థల్లోను, నీతి నియమాల్లోను ఉన్న కుళ్ళును బట్టబయలు చేయడానికే కేంద్రీకరించబడ్డాయి. ఈ గొప్ప కళాకారులందరూ బూర్జువా సమాజంలో నుంచి వచ్చిన తిరుగుబాటు దారులు. బూర్జువా సమాజంయొక్క సర్వసాధారణమైన అయోమయ తత్వాన్నీ, ప్లాటర్టు చెప్పినట్లు, పొట్టకోసం డబ్బుకోసం ఆశయాలన్నిటినీ కేంద్రీకరించుకున్న మానవుని స్వార్థాన్నీ — ఈ రచయితలు అంగీకరించలేదు.

ఈ బూర్జువా సంకెళ్ళనుంచి సమాజాన్ని విడిపించిన సాహిత్యమే సోషలిస్టు వాస్తవిక సాహిత్యం గతించిన బూర్జువా సమాజానికి ఆనాటి ఉత్తమ రచయితలకూ మధ్య ఉన్న వైరుధ్యం ఈ క్రొత్త సమాజంలో రచయితలకూ సమాజానికీ మధ్యలేదు.

ఒక ఉత్తమమైన మేధావంతమైన నూతన సమాజనిర్మాణంకోసం ఉత్తమ రష్యన్ ప్రజాస్వామిక రచయితలు తమ రచనలద్వారా ఆనాటి పాత సమాజాన్ని పడద్రోయడానికి ప్రయత్నించారు కాని నేడు ఈ నూతన సమాజం నెలకొల్పబడిన పిమ్మట ఉత్తమ రచయితలందరూ ఈ సమాజాన్ని బలపరచడానికీ, ప్రజలు కమ్యూనిజంవైపు పురోగమించడానికీ తమ మేధశ్శక్తితో తోడ్పడుతున్నారు.

సోవియట్ పౌరునియొక్క సాధనల నన్నిటినీ సరిగా అర్థంచేసుకొని, నిజాయితీతో వాస్తవాన్ని చిత్రించడమే సోషలిస్టు వాస్తవిక కళాసాహిత్యాల పరమ ప్రయోజనం.

వెనుక భావకవుల ప్రత్యేకలక్షణమై వారిని వాస్తవ జీవితానికి దూరం చేసిన ఊహాగానం (భవిష్యత్తులో సుఖస్వప్నాలు గనడం), ఇవాళ, సోషలిస్టు వాస్తవిక సాహిత్యానికి స్వతస్సిద్ధమైన

ప్రత్యేక లక్షణ మవుతున్నది అయితే ఇది ఎంతమాత్రం అసాధ్యమైన ఆశయ సిద్ధికోసం కలవరించడం మాత్రంకాదు. ఇదీభవిష్యత్తునుగూర్చిన సుఖస్వప్నమే కాని, దీని పునాదులు వర్తమానంలో బలంగా ఏర్పడివున్నాయి

"ఈయుగంలో ప్రధానమైన సంఘర్షణ, నూతన సోషలిస్టు జీవిత విధానానికి పాతభావాలతోను, పాత సిద్ధాంతాలతోను కలిగే సంఘర్షణ, అనేకరూపాలు పొందుతుంది. గతాన్ని అంటే విరుద్ధ విషయాన్ని చిత్రించేటప్పుడు, సాంప్రదాయకంగా గతాన్ని చెప్పేటప్పుడు (కొత్తదాన్ని చిత్రించేకంటె గతాన్ని చిత్రించడంలోఎక్కువ సంప్రదాయాలున్నాయి)—కొత్తదాన్ని అంటే అనుకూలమైన దాన్ని చిత్రించడంలో సిద్ధహస్తుడయ్యేదాకా ఈ పాతకొత్తల సంఘర్షణకు రచయిత తన రచనల్లో ఏమి పరిష్కారం చూపగలడు? వర్తమాన యధార్థజీవిత సూత్రాలనుపూర్తిగా అవగతం చేసుకుని, ముందుకు చూసే రచయితే ఈయుగసంధిలోని మహత్తరమైన పోరాటాల కష్టసుఖాలనూ, తీవ్రతనూ చిత్రించగలడు ఇందులోనే విప్లవ భావుకత్వంయొక్క, సోషలిస్టు వాస్తవికతయొక్క ప్రత్యేకలక్షణాలన్నీ కనిపిస్తాయి" అని ఫెడయేవ్ అదే సమావేశంలో అన్నారు

గొప్ప గొప్ప నిర్మాణ కార్యక్రమాల ద్వారా పొందగల ప్రయోజనాలన్నీ ఇవాళ సోవియట్ ప్రజల కళ్ళ ముందున్నాయి కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే ఈఉత్తమ కర్తవ్యంలో కళా సాహిత్యాలు అద్భుతమైనపాత్రవహించవలసివుంది. కళాసాహిత్యాలనుగురించి రచయితల సమావేశాల్లోను నాటక చలన చిత్ర పత్రికా రంగాల్లో పనిచేసే వారిసమావేశాల్లోను పరిశోధక సమావేశాల్లోను జరిగే విపుల చర్చలనుబట్టి చూస్తే, మన సాహిత్య కళా కారులు నేటి వైజ్ఞానిక బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారో వ్యక్తమవుతుంది.

★

కృతజ్ఞత

మహాసభా సంచికలో ప్రచురించిన ఫొటోలు, ఈసారి వేసిన అబ్బాస్ ఫొటోనూ శ్రీమతి శైలాసయ్యద్‌గారు మా కిచ్చారు ఇంకా మా కిచ్చిన ఫొటోలున్నాయి. అవన్నీ ముందుముందు ప్రకటిస్తాం క్రితం సంచికలో పేరు ప్రచురించడంలో పొరపాటు దొర్లింది అందుకు వారిని క్షమించమని కోరుతున్నాం ఆమె స్వయంగా మహాసభకు వచ్చి మాకీ ఫొటోలు తీసి యిచ్చినందుకు కృతజ్ఞత తెలియజేస్తున్నాం.

— సంపాదకులు



లోధ్ర

ప్రతివనితకు గర్భకోశ
సంబంధమైన
వ్యాధులనుండి విముక్తి
నొసగి ఆనందం
చేకూర్చుతుంది

కేసరీకుటీరం
లిమిటెడ్, మద్రాసు

ఆంధ్ర తమిళ, నైజాం రాష్ట్రాలకు
ఏజంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు
సికిందరాబాదు _ మధుర - బెజవాడ

స్వర్ణోత్సవ - ఆగమనసందర్భంలో



పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతము

ఏబదియేండ్లుగా ప్రజాలోక
మునకు సేవజేయుచు, ప్రజల
ఆరోగ్యమును పెంపొందిం
చుచు, ఆనంద సంతృప్తులను
కల్గించి, ప్రజానురంజకమైన
దని వెల్లడించుటకు గర్వించు
చున్నాము.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
... నగర్... మద్రాసు.

కుష్ఠు-బొల్లి

మొదలగు సకల మేహములకు, ఇతర చర్మవ్యాధులకును, సెగ, సవాయి మొదలగు వ్యాధులకు

గ్యారంటీచికిత్స !

బ్రాంచ్

బెజవాడ

గాంధీనగరం

★

వాల్తేరు

ఆర్ యస్ పోస్టు

★

ఆఫీసులు

సికింద్రాబాద్

3560. కింగ్సువే

★

కటక్

బక్సీబజార్

" మునిగిపోదామనుకున్నాడు "

●

హెచ్ బావాజీ దేహాలో,

కెల్లంబల్లి, చామరాజనగర్ పోస్టు, మైసూరు — కెల్లంబల్లి 10-1-1945

అయ్యా,

క్రిందటిసారి మీవద్ద తెప్పించిన అత్యద్భుత కుష్ఠు రోగనివారిణి మొదటిసారిగా కగ్గిల్లా వాడాడు. ఆయన అమితానందంతో నాదగ్గరకువచ్చి, తన శరీరంమీది మచ్చలను నాకు చూపించాడు. మీ మందు ఒక్కసారిగా దేవరకే మచ్చలు దాదాపు నయమయిపోవటం నాకాశ్చర్యం కలిగింది ఇప్పుడు ఆయనమనిషి మొత్తంపూర్తిగా మారిపోయినట్లున్నాడు ఆయన మీమందు పుచ్చుకోక ముందు తనవ్యాధి నయంకాదనే నిరాశవల్ల నీటిలోపడి చనిపోదామనుకున్నాడు. ఇప్పుడటువంటి భావాలు ఏమీ లేవు ఆయన కృతజ్ఞతాభివందనాలను నేను మీకుతెలియజేస్తున్నాను. మళ్ళీ మీ మందును వి పి ద్వారా పంపగోరుతున్నాను.

మీ విశ్వాసపాత్రుడు,
(సం) హెచ్ బావాజీ దేహాలో

పెద్దతెలుగు క్యాటలాగు, 10 భాషల్లో క్యాటలాగులు, యోగ్యతాపత్రములు

ఉచితము !!

రెడ్డి & కో.,

(రిజిష్టర్డ్)

H. O. గోపాలపురం

(వయా) తణుకు, తూర్పు గోదావరి

Editor, Printer & Publisher C Pitchayya
Secretary, Andhra Progressive Writers' Association Governorpet Bezwada

అభ్యుదయ ప్రచురణలు : త్వరలో !!

శ్రీ వుప్పల లక్ష్మణరావుగారి

ఉత్తమ నవల

అతడు - ఆమె

ఉత్తమ సంస్కారంకోసం అడుగడుక్కీ

నిత్యజీవితంలో సంఘర్షణ ముందుకుపోవాలనే తహ తహ

అనుక్షణం ఆశలతో అల్లుకుపోవాలనే అనురాగం

నిత్య నూతనంగా ఈ నవల ప్రదర్శిస్తుంది!

మేనరికం

[సాంఘిక నాటకం]

రచయిత

శ్రీ నాగభైరవ శివరామకృష్ణయ్య

మంగళ సూత్రాలతో మనుషులకు సంకెళ్ళు వేయాలనే

సనాతనాచారంమీద, వేడిరక్తం పొంగే యువహృదయంచేసే

తిరుగుబాటు!

కొత్త జీవితానికి కొత్త బాట!

ఈ నాటకానికి కథావస్తువు!

మీ కాపీకోసం ముందుగా వ్రాయండి!!

సుప్రసిద్ధాంధ్ర చారిత్రక పరిశోధకులు

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి

ఆంధ్రదేశ చరిత్ర

ఇంతవరకూ ఆంధ్రులకు సరియైన చరిత్రలేదు!

ఆంధ్రుల కళా సంస్కృతులకు రూపులేదు!!

ఆంధ్రుల చరిత్రనూ, కళా సంస్కృతులనూ తెలుసుకోవాలంటే

'ఆంధ్రదేశ చరిత్ర' చదవండి

త్వరలో వెలువడుతుంది! వెల. రు 2/-

"పాలూ నేయీ కొందరి కిచ్చి
పల్చని గంజి లేకెందరినో
పస్తులతో పడి చావమందువా?"

స్వతంత్ర ఫిలిమ్సు లిమిటెడ్

వారి

ద్రోహి

డైరక్షన్:
ప్రసాద్

సినేరియో
తాపీ

స్టుడియో:
శోభనాచల

నటీనటకులు

రాజ్యం, వరలక్ష్మి
ప్రసాద్
ప్రకాశరావు
ప్రభాకరరావు
రాళ్ళభండి
శివరావు

వివరాలకు

స్వతంత్ర ఫిలిమ్సు లిమిటెడ్ :: మద్రాసు 17

ఆంధ్ర & రాయలసీమ డిస్ట్రిబ్యూటర్సు

ప్రీమియర్ ఫిలిమ్సు లిమిటెడ్ :: బెజవాడ